తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

జూన్ 2021..... వెల రూ. 5/-



తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకం
(2021, జూన్ 22 నుండి 24 వరకు)



తిరుమల తిరుపతి దేవస్థానములు

# కార్వేటినగరం
# శ్రీ వేణుగోపాలస్వామివారి
# బ్రహ్మోత్సవములు

## 2021 జూన్ 02 నుండి 10 వరకు

**02-06-2021 బుధవారం**
పగలు: ధ్వజారోహణం - రాత్రి: పెద్దశేషవాహనం.

**03-06-2021 గురువారం**
పగలు: చిన్నశేషవాహనం - రాత్రి: హంసవాహనం.

**04-06-2021 శుక్రవారం**
పగలు: సింహవాహనం - రాత్రి: ముత్యపుపందిరివాహనం.

**05-06-2021 శనివారం**
పగలు: కల్పవృక్షవాహనం - రాత్రి: సర్వభూపాలవాహనం.


**06-06-2021 ఆదివారం**
పగలు: పల్లకీలో మోహినీఅవతారోత్సవం - రాత్రి: గరుడవాహనం.

**07-06-2021 సోమవారం**
పగలు: హనుమద్వాహనం - రాత్రి: గజవాహనం.

**08-06-2021 మంగళవారం**
పగలు: సూర్యప్రభవాహనం - రాత్రి: చంద్రప్రభవాహనం.

**09-06-2021 బుధవారం**
పగలు: రథోత్సవం - రాత్రి: అశ్వవాహనం.

**10-06-2021 గురువారం**
పగలు: చక్రస్నానం - రాత్రి: ధ్వజావరోహణం.



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత ।
సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 24)

**ప్రతిపదార్థం:** భారత!= ఓ ధృతరాష్ట్రా!; గుడాకేశేన= అర్జునుని చేత; ఏవమ్= ఈ విధంగా; ఉక్తః= చెప్పబడిన; హృషీకేశః= శ్రీకృష్ణుడు; ఉభయోః= ఇరుపక్షాల వారి; సేనయోః= సేనలయొక్క; మధ్యే= మధ్యలో; రథోత్తమమ్= ఉత్తమమైన రథాన్ని; స్థాపయిత్వా= నిలిపి (పెను).

**భావం:** ఓ ధృతరాష్ట్రా! అర్జునుని కోరికమేరకు శ్రీకృష్ణుడు ఆ దివ్యరథాన్ని ఉభయసేనల మధ్య నిలిపెను.

---

## వెలుపు లేని రఘువీరుని బంటు..

అతిమతి హనుమంతుఁ డట్టిబంటు
వెలుపు లేని రఘువీరునికి బంటు॥

యేలికను దైవముగా నెంచి కొల్చేవాఁడే బంటు
తాలిమిగలిగిన యాతఁడే బంటు
పాలుమాలక యేపొద్దు పనిసేయువాఁడే బంటు
వేళ గాచుకవుండేటి వెరవరే బంటు ॥

చెప్పినట్లనే నడచిన యాతఁడే బంటు
తప్పులేక హితుఁడై నాతఁడే బంటు
మెప్పించుక విశ్వాసాన మెలఁగువాఁడే బంటు
యెప్పుడును ద్రోహిగాని హితుఁడే బంటు॥

కానిపనులకు లోనుగానివాఁడే బంటు
ఆనాజ్ఞ మీరని యాతఁడే బంటు
నానాగతి శ్రీవేంకటోన్నతుఁడైనయతనికి
తా నిన్నిటా దాసుఁడైనధన్యుఁడే బంటు ॥

(అధ్యాత్మ సంకీర్తన, సంపుటము: 4-278)





*అన్నమయ్య భక్తితో కొలిచేవాడు, సేవచేసేవాడు, యజమానిని గురువుగా భావించి చెప్పిన మాట వినేవాడు - అటువంటి వాడే 'బంటు' అని బంటుకు ఉండే లక్షణాలు చెపుతూ- సంభ్రమము కలిగించే ఈ హనుమంతుడు అటువంటివాడని, భయము తెలియని రామునికి నమ్మినబంటు ఈ స్వామి అని తెలుసుకోండి అని తెలుపుతున్నాడు.*

*'ఇతడు తన యజమానిని దైవంగా భావించి కొలిచే స్వభావం కల బంటు. ఎంతో ధైర్యం కలిగి ఏ మాత్రం సోమరితనం లేక ఎల్లవేళలా తన స్వామిని సేవించు వాడే ఈ బంటు. అన్ని సమయాలలో తగిన ఉపాయంతో సిద్ధంగా ఉండే వాడే ఈ బంటు. క్రమం తప్పక చెప్పినట్లు నడుచుకొనువాడు, ఏ విధమైన తప్పు చేయక హితము చేయువాడు, విశ్వాసమునకు మారుపేరు, ఎప్పుడూ ద్రోహం చేయక మేలుచేసే వాడే బంటు అని పిలువతగ్గ వాడు. లోభాలకు లొంగనివాడు అంటే స్వామివారి ఆజ్ఞను అమలుపరచువాడే సరియైన 'బంటు'. పలు విధములుగా పైన పేర్కొన్నట్లు శ్రీవేంకటేశ్వరస్వామికి దాసుడైన బంటు ఈ మహానుభావుడు 'శ్రీఆంజనేయుడు' అని అన్నమయ్య హనుమంతుని కీర్తించాడు.*



# శ్రీవేంకటేశ్వర వేదపరిరక్షణ ట్రస్టు





హిందూ సంస్కృతికి, హైందవ సనాతన ధర్మానికి ఆలవాలమైన వైదిక సంప్రదాయాన్ని పరిరక్షించి, పరివ్యాప్తి కావించే మహోన్నతమైన లక్ష్యంతో 2007 సంవత్సరంలో తి.తి.దేవస్థానం '**వేదపరిరక్షణ ట్రస్టు**'ను వ్యవస్థాపించింది. సర్వజన శ్రేయోదాయకమైన, ఉత్కృష్టమైన ఈ ట్రస్టుకు సద్భావనతో చందాలివ్వవలసిందిగా లోకోపకారులను ఆహ్వానిస్తున్నాం.

**అధికరణం 80 (జి) క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు వర్తిస్తుంది**

**: డిమాండు డ్రాఫ్ట్ / చెక్కులు పంపవలసిన చిరునామా :**

ముఖ్యగణాంకాధికారి, తి.తి.దే. పరిపాలనభవనం, కె.టి.రోడ్డు, తిరుపతి-517 501,
ఫోన్ నెం.0877-2264249, 2277777, 2264258

50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 52 జూన్, 2021 సంచిక : 01



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

గౌరవ సంపాదకులు
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు
ఆచార్య కె.రాజగోపాలన్, పిహెచ్.డి.,

సంపాదకులు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకులు
డా॥ అల్లాడి సంధ్య
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

ముద్రాపకులు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| శ్రీవారి జ్యేష్ఠాభిషేకం | శ్రీ అర్చకం రామకృష్ణ దీక్షితులు | 07 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్ | 11 |
| 'సుందర' హనుమాన్ | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ | 14 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు, కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 16 |
| పురాణాల ఆవశ్యకత | డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణ మూర్తి | 18 |
| ధర్మాచరణ ప్రశస్తి | డా॥ కె.అన్నపూర్ణ | 20 |
| ధ్యానం చేయడం ఎలా? | డా॥ లక్ష్మీనారాయణ | 22 |
| మన దేవాలయాలు- 'ఆగమాలు' | శ్రీ డి.నరసింహాచార్యులు | 24 |
| మేధానిపుణుడు 'బుధుడు' | శ్రీ మల్లంపల్లి రామలింగ శాస్త్రి | 26 |
| వీణాపాణి క్షేత్రం- అనంతసాగరం | శ్రీ విశ్వామిత్ర | 31 |
| సద్వాణి సూక్తి | శ్రీ మాదిరాజు రంగారావు | 32 |
| శ్రీమద్భగవద్గీత | ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ | 33 |
| శ్రవణభక్తి | డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ | 35 |
| మార్గదర్శి 'శ్రీవేంకటేశ్వరుడు' | శ్రీమతి సర్వలక్ష్మి | 39 |
| మహావాక్యరత్నావళి | డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్ | 40 |
| హరిదాసవాఙ్మయంలో... శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 41 |
| హిందూత్వంలో స్త్రీ విశిష్టత | డా॥ విజయలక్ష్మి | 43 |
| 'వైశాఖ'మాస వైశిష్ట్యం | డా॥ పి.వి.ఎన్.మారుతి | 44 |
| సనాతన వైద్యంలో తుంగముస్తలు | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 45 |
| లక్ష్మీదేవికి విష్ణుమూర్తి ఇచ్చిన వరం ఏమిటి? | కుమారి ఆర్.ప్రియంవద | 46 |
| 'కులపతి' వశిష్ఠుడు | శ్రీ డి.వి.ఆర్.భాస్కర్ | 47 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య, నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 49 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 50 |
| ప్రార్థనల విశిష్టత | శ్రీ దీవి సుబ్బారావు | 51 |
| బాలహనుమంతుడు (చిత్రకథ) | కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు, చిత్రాలు : శ్రీ కె.తులసీప్రసాద్ | 52 |

ముఖచిత్రం : తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకం
వెనుక చిత్రం : జాపాలి ఆంజనేయస్వామి (తిరుమల)

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333



వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# గోవిందునికి 'గో' ఆధారిత నైవేద్యమ్

## 'గావో విశ్వస్య మాతరః'

గో మాత ప్రాశస్త్యం ప్రభావం గురించి మన పురాణేతిహాసాల్లో స్పష్టంగా చెప్పబడి ఉంది. కల్పాల ప్రారంభంలో కామధేనువు నుంచి, కృతయుగంలో గురుదత్తాత్రేయుల వెంటా, ద్వాపరంలో శ్రీకృష్ణుని వెంటా ఉన్న గోవుల నుంచి, ఆధునిక కాలం సైతం, గోసేవ ఫలితం– వైశిష్ట్యం గురించి ఎన్నో ఆఖ్యానాలు ఉన్నాయి.

సాక్షాత్తు శ్రీవారు వల్మీకంలో ఉన్నప్పుడు బ్రహ్మరుద్రులు గో–వత్సములుగా వచ్చి శ్రీవారికి పాలధారను కురిపించారు. ఈనాటి కాలంలో మన జీవనశైలి మారి గో సన్నిధికి మనం బాగా దూరం అయి ఉండవచ్చు. కానీ, మన పూర్వీకులంతా పాడి పశువుల సంపద ఆధారంగానే సిరిసంపద లను అంచనా వేసేవారు. అందుకే గోసంపద అధికంగా ఉన్నకాలంలో గవ్యపదార్థాలు– అంటే గోవు నుండి లభించే పాలు, పెరుగు, నెయ్యి, గోమూత్రం, పేడవంటివి విస్తృతంగా వాడేవారు. అందువల్ల ప్రజలందరికీ మంచి పుష్టికరమైన ఆహారం, ఆరోగ్యం అందుబాటులో ఉండేవి.

ఈనాడు హరిత విప్లవం పేరుతో సాగుతున్న వ్యవసాయ విధానాలు సరికావని స్పష్టం అవుతున్నది. దీనికి 'గో ఆధారిత సేద్యమే' పరిష్కారం. ఒక్క ఆవుతో 20 నుండి 25 ఎకరాల భూమిని సాగు చేయవచ్చని శాస్త్రజ్ఞులు తెలుపుచున్నారు. ఒక గ్రాము ఆవుపేడ భూమిలో కలిస్తే సుమారుగా 300 నుండి 500 బ్యాక్టీరియాలను ఉత్పత్తి చేస్తుంది. దీని వల్ల భూమిలోని సేంద్రీయ కర్బన శాతం పెరిగి, భూమి ఆరోగ్యంగా మారుతుంది. పైగా ఇతర మూగజీవాలు హాయిగా బ్రతుకుతాయి. గో అధారిత సేంద్రీయ వ్యవసాయం ద్వారా అందించిన పదార్థాలో ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి.

దశాబ్దముల క్రిందట స్వామివారికి నైవేద్యంగా ఇచ్చేదానికి సహజంగా ప్రకృతిపరంగా పండిన పంటలతో నైవేద్యం తయారు చేసేవారు. అందులో భాగంగా సహజవనరులతో సేంద్రీయ ఎరువులతో పండిన పంటల ద్వారా, ధాన్యాలతో గోవిందునికి నైవేద్యాలను తయారు చేయాలని తి.తి.దేవస్థానం మే 1వ తేదీ నుండీ శ్రీకారం చుట్టింది. దేశీయ వరివంగడాలతో పండించిన బియ్యంతో శ్రీవారికి నైవేద్యం తయారు చేయాలని సంకల్పించి పదిరోజులపాటు స్వామివారికి నైవేద్యం పెట్టే అన్న ప్రసాదాల తయారీకి 2200 కిలోల బియ్యం, కూరగాయలు, అరటిపండ్లు, బెల్లం, 15 కిలోల దేశీయ ఆవు నెయ్యిని ఉపయోగించడం జరిగింది.

తి.తి.దే. గో ఆధారిత వ్యవసాయం సాగిస్తున్న వారి వద్ద నుండే నేరుగా స్వామివారి ప్రసాదాలకు కావలసిన పదార్థాలను కొనుగోలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. కాబట్టి, గోసంపదను కాపాడి, గో ఆధారిత వ్యవసాయంతో పంటలను పుష్కలంగా పండించి, శ్రీవారి నిత్యకైంకర్యాలు జరిపించి, సమస్తమానవాళి ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వెల్లి విరియాలని బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరుని ప్రార్థిద్దాం.. రండి.. గోసంపదను కాపాడండి– గోఆధారిత వ్యవసాయాన్ని విస్తృతం చేయండి.

'గౌః రక్షతి రక్షితా'

*గోమాతను రక్షిద్దాం. అది మనలను రక్షిస్తుంది.*

*ఓం నమో వేంకటేశాయ*



# శ్రీవారి జ్యేష్ఠాభిషేకం

– శ్రీ అర్చకం రామకృష్ణ దీక్షితులు

శ్రీవేంకటాచలాధీశం శ్రియా ధ్యాసితవక్షసమ్।
శ్రితచేతనమందారం శ్రీనివాసమహం భజే॥

సమస్తచరాచర సృష్టికి జగత్ప్రభువు, సర్వాధారుడు, సనాతనుడు, ఆశ్రిత భక్తజన వత్సలుడు, లక్ష్మీదేవిని వక్షఃస్థలమందు ధరించినవాడు, పాపపంకిలమైన కలియుగంలో, భక్తజనులందరికీ మార్గనిర్దేశం చేస్తూ, పూజలందుకుంటున్నాడు. అందుకే నిత్యం శ్రీవారి ఆలయంలో పఠింపబడే దివ్యమైన శ్రీవేంకటేశ సుప్రభాతం– 'సంసార సాగర సముత్తరణైక సేతో'– శ్రీవేంకటేశ నీవు లక్ష్మీదేవికి నివాసమైన వాడవు. సద్గుణ సముద్రుడవు. సంసార సాగరమును తరించుటకు అనువైన వారధివి. వేదాంత వేద్యుడవు. భక్తులకు స్వాధీనుడవు అని హృద్యంగా కీర్తిస్తుంది. నిజమే! దేవదేవుడైన కలియుగ ప్రత్యక్షదైవం శ్రీనివాసప్రభువు భక్తులకు స్వాధీనుడే. అందుకే వరాహావతారంలో చరమశ్లోకంలో స్వామి భక్తులను అనుగ్రహిస్తూ –

తతస్తం మ్రియమాణం
తు కాష్ఠ పాషాణసన్నిభమ్।
అహం స్మరామి మద్భక్తం
నయామి పరమాం గతిమ్॥

అని వాగ్దానం చేస్తాడు. ఎవరైతే తమ ప్రాణాలను వదిలే సమయంలో నన్ను స్మరిస్తారో, వారు నన్ను చేరుకుంటారని భవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ పేర్కొన్నాడు. అదే విధంగా శ్వేత వరాహకల్పంలో శ్రీఆదివరాహస్వామివారిగా అవతరించిన శ్రీమన్నారాయణుడు కల్పాంతం వరకూ సమస్తప్రాణికోటిని తరింపజేయడానికి శ్రీవేంకటాచలపర్వతంపై అర్చావతార రూపంలో కొలువైవుండి, ఇలా అనుగ్రహించాడు. 'ఏ మానవులైతే శరీరం చక్కగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే, మనస్సు స్వాధీనంలో ఉన్నప్పుడే విశ్వరూపుడైన నన్ను స్మరిస్తారో వారినే నేను సదా రక్షిస్తాను. వారు దేహత్యాగాన్ని చేయబోయే సమయంలో, స్పృహ లేకుండా కట్టెవలె, రాయి వలె నిశ్చేష్టులై ఉన్నాకూడా, నేనే వారి చివరిదశను తెలుసుకుంటాను. నేను స్వయంగా వచ్చి, వారిని నా దివ్యధామానికి చేర్చుకుంటాను' అని తన

అపారకరుణాకటాక్షములతో అనుగ్రహించాడు. అందుకే వేంకటాచలక్షేత్రం పరమపావనమైంది. మహత్తు కలిగింది. సదా దర్శనీయమైనదిగా విరాజిల్లుతోంది.

శ్రీవైకుంఠంలో భాగమైన శ్రీవేంకటాచల క్రీడా పర్వతంపై, 'శ్రీవైకుంఠవిరక్తాయ స్వామి పుష్కరిణీతటే' అని అన్నట్లు శ్రీమన్నారాయణుడు స్వయంవ్యక్త సాలగ్రామ దివ్య అర్చావతారరూపంలో కొలువై, కోరిన వరాలందించే కోనేటి రాయుడిగా, భక్తులను కటాక్షిస్తున్నాడు. శ్రీవారికి అత్యంత ప్రాచీనకాలం నుండి కూడా భగవాన్ విఖనసమహర్షి ప్రవచించిన శ్రీవైఖానస భగవచ్ఛాస్త్రవిధిగా సమస్త ఆరాధనలు జరుపబడుతున్నాయి. తిరుమలలో వారికి ప్రీతికరమైన సంప్రదాయంలో కైంకర్యాల యొక్క తాత్త్వికతనే శ్రీలక్ష్మీవిశిష్టాద్వైత విధానంగా, 10వ శతాబ్దానికి చెందిన వైఖానస అర్చకుడు, శ్రీవారికి పరమ భక్తుడైన శ్రీమాన్ శ్రీనివాసదీక్షితులవారు ఇలా పేర్కొన్నారు.

**లక్ష్మీ విశిష్టః యత్ర తే తత్ లక్ష్మీవిశిష్టాద్వైతమ్।**

లక్ష్మితో కూడి విగ్రహరూపంలో ఉన్న శ్రీమన్నారాయణుని అర్చించటమే, మోక్షప్రాప్తికి రాజమార్గమని లక్ష్మీ విశిష్టాద్వైతం సిద్ధాంతం. ప్రారంభంలో శ్రీవారి దివ్యఅర్చావతార రూపంతో పూజలు జరుపబడి, తిరుమల క్షేత్రం ఏకబేర ఆలయంగా ప్రశస్తి చెందింది.

**సాలంబం సగుణం శ్రేష్ఠం సకలం కౌతుకార్చనమ్।**
**సకామానాం సముచితం సంసారాశ్రమిణాం సదా॥**

అని భృగుప్రోక్త క్రియాధికారం పేర్కొంటోంది. కోరికలు గల గృహస్థులకు ఎల్లప్పుడూ సాలంబం, సగుణం అయిన కౌతుకమును అర్చించటమే శ్రేష్ఠం. అలాగే శ్రీవారి మూలవిరాట్‌రూపంలో దివ్యమైన సాన్నిధ్యశక్తిని, కౌతుకరూపంతో ఉన్న విగ్రహమునందు నిత్యం ఆవాహనం చేసి, విధి పూర్వకంగా ఆరాధన చేయాలి. ఇది ఐహిక ఆముష్మిక ఫలప్రదంగా చెప్పబడింది. అంటే ఎటువంటి భౌతికమైన కోరికలు లేక మోక్షాన్ని కోరి స్వామిని సేవించే వారు అలాగే తమ ఇష్ట కామ్యార్థ సిద్ధి కోసం స్వామిని దర్శించేవారు, ఇరు వర్గాల వారి కొరకు తప్పనిసరిగా కౌతుకమూర్తి ఆరాధన జరపాలని వైఖానస ఆగమం పేర్కొన్నందువల్ల తిరుమలలో 614వ సంవత్సరంలో పల్లవరాణి సామవై పేరుందేవి ద్వారా వెండి విగ్రహమైన, శ్రీభోగశ్రీనివాసమూర్తి బహూకరించబడి, ఇది 'కౌతుకబేరం'గా, ప్రతిష్ఠ గావించబడినది. క్రమేపి ఆలయంలో ఉత్సవాలను జనరంజకంగా నిర్వహించటానికి 1339సం॥లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారి పంచలోహవిగ్రహాలు ప్రతిష్ఠించబడ్డాయి. అలాగే 'స్నపనబేరం'గా ఉభయదేవేరుల సమేతంగా శ్రీఉగ్రశ్రీనివాసమూర్తి వారు 'బలిబేరం'గా శ్రీకొలువు శ్రీనివాసమూర్తి వారికి పూజలు జరుపబడుతున్నాయి. తిరుమల ఆలయ శాసనాలను పరిశీలిస్తే, శ్రీవారి ఉత్సవమూర్తియైన శ్రీమలయప్పస్వామి వారు సుమారు 800 సంవత్సరాల ప్రాచీనమైనదిగా తెలుస్తున్నది. శ్రీవారి ఆలయంలో 'నిత్యకల్యాణం పచ్చుతోరణం' అన్న చందంగా, ఏటా 365 రోజులకు గాను సుమారు 470 ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా నేత్రపర్వంగా నిర్వహింపబడుతున్నాయి. వైఖానసాగమోక్తంగా జరుపబడే ఈ ఉత్సవాలలో భాగంగా శ్రీమలయప్పస్వామివారికి అభిషేకములు, స్నపన తిరుమంజనాలు చేయబడుతాయి. అయితే ఈ విధంగా అభిషేకాలు జరపటం వలన బింబముల మూలస్వరూపంలో మార్పులు, అరుగుదల సంభవించే అవకాశం ఉంది. దీని పరిష్కారం కొరకు 90వ దశకంలో శ్రీవారిఆలయంలో సంవత్సర ఉత్సవంగా **'జ్యేష్ఠాభిషేకం'** అనే ఉత్సవం ప్రవేశపెట్టబడి, శాస్త్రోక్తంగా నిర్వహింప బడుతున్నది.

**జ్యేష్ఠమాసి తు సంప్రాప్తే జ్యేష్ఠానక్షత్రసంయుతే।**
**విష్ణోరేవ విశేషస్స్యాత్సుగంధం తైలమాహరేత్॥**
**(ప్రకీర్ణాధికారం - భగవాన్ భృగుః)**

జ్యేష్ఠమాసంలో, చంద్రుడు జ్యేష్ఠానక్షత్రంతో కలసి ఉన్న పూర్ణిమనాడు, దేవదేవుడైన విష్ణువు యొక్క విగ్రహమునకు



విశేషమైన సుగంధ తైలమును సమర్పించాలని భృగువు ప్రకీర్ణాధికారంలో పేర్కొన్నాడు. దీనినే 'సుగంధ తైల సమర్పణ' ఉత్సవంగా క్రియాధికారంలో చెప్పబడినది. ఈ ఉత్సవమును వైఖానస ఆగమోక్తంగా నిర్వహించడం వలన విష్ణువు యొక్క దివ్య అర్చావతారం అమితమైన తేజస్సుతో వెలుగొందుతుందని క్రియాధికారం తెలియజేస్తున్నది. తిరుమలలో జ్యేష్ఠాభిషేకాన్ని జ్యేష్ఠ శుక్ల త్రయోదశినాడు ఆరంభించి, జ్యేష్ఠ శుక్ల చతుర్దశి, మరియు జ్యేష్ఠ పూర్ణిమనాడు అంతమయ్యే విధంగా మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించబడుతున్నది. జ్యేష్ఠాభిషేక మహోత్సవానికి 15 రోజులు ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులైన శ్రీ, భూ సమేత మలయప్పస్వామి వారికి క్రిందటి సంవత్సరం సమర్పించబడిన స్వర్ణకవచములు సడలింపు చేస్తారు.

**పరిలిఖితమితి మంత్రేణ కవచం పరిశోధయేత్।**
**జీర్ణే భిన్నే చ కవచే శిల్పినైవ సుసన్నయేత్॥**
**(ప్రకీర్ణాధికారం - భగవాన్ భృగుః)**

ఈ ఉత్సవ నిర్వహణకు ప్రత్యేకంగా 'కంకణభట్టర్' అని పిలువబడే వైఖానస అర్చకునికి ప్రధానాచార్యునిగా బాధ్యతలు ఇవ్వబడుతుంది. ప్రకీర్ణాధికారంలో చెప్పబడిన విధంగా ఆచార్య స్వామి ఉత్సవమూర్తుల మీదున్న స్వర్ణకవచమును **పరిలిఖిత....** అను మంత్రముతో చక్కగా పరిశోధన చేయవలెను. అటుపై ఆ స్వర్ణకవచములలో ఏవైనా లోపములుంటే, వాటిని సడలింపు చేసి, సుశిక్షితుడైన శిల్పిద్వారా వాటిని సరిచేసి సిద్ధముగా ఉంచుకోవాలని శాస్త్రవచనం.

జ్యేష్ఠాభిషేకం మొదటిరోజు, శ్రీవారికి మాధ్యాహ్నిక ఆరాధన అయిన తర్వాత, శ్రీమలయప్పస్వామివారిని ఉభయ దేవేరి సమేతంగా విమానప్రాకారప్రదక్షిణగా, సంపంగిప్రాకారంలోని కల్యాణమంటపములోని యాగశాలకు వేంచేపు చేస్తారు. వైఖానస భగవచ్ఛాస్త్రవిధిగా దేవతా ప్రార్థన, విష్వక్సేన ఆరాధన, స్వస్తి పుణ్యాహవచనం, అంకురార్పణం, రక్షాబంధనం, అగ్ని ప్రణయనం మొదలైన క్రియలను శాస్త్రోక్తంగా, వేదమంత్ర పురస్సరంగా యాగశాలలో 'అష్టోత్తరశతకలశ స్నపనతిరుమంజనం' అనే వైదిక క్రియను 108 కలశాలతో నిర్వహిస్తారు.

తదుపరి ఈ ఉత్సవమునకు సర్కార్ (తి.తి.దే.) వారి తరపున కార్యనిర్వహణాధికారి దంపతులకు సంకల్పం చెప్పబడుతుంది. యాగశాలలో 108 కలశములను, 9 కలశములను ఒక అమరికగా-4 వరుసలుగా ఆ యాగశాలలో ఉంచుతారు. అలాంటి వరుసలు మూడుంటాయి. మధ్యలో ఉన్న ప్రధానకలశంలో వరుణ దేవతను ఆవాహన చేసి



ఉపచార సమర్పణ చేస్తారు. ప్రధానహోమం, ప్రాయశ్చిత్త హోమం, అంతహోమాలను, పూర్ణాహుతి నిర్వహించి అగ్ని ఉపస్థానం చేయడంతో హోమకైంకర్యం సమాప్తి అవుతుంది. అనంతరం శ్రీవారి ఉత్సవమూర్తులకు 12 రకాల ద్రవ్యాలతో మరియు పాలు, పెరుగు, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో విశేష స్నపనతిరుమంజనం జరుగుతుంది. సాయంత్రం శ్రీ, భూసమేతుడైన శ్రీమలయప్పస్వామివారిని అతివిలువైన, ముగ్ధ మనోహరమైన వజ్రకవచముతో అలంకరించి తిరుమాడవీథులలో ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఇలాగే మిగతా రెండురోజులు ఉదయం పూట అష్టోత్తర కలశ స్నపనం మరియు రెండవరోజు సాయంత్రం ముత్యపుకవచం, మూడవరోజు సాయంత్రం స్వర్ణ కవచంతో తిరువీథి ఉత్సవం జరుగుతుంది. మూడవరోజు ఉదయం స్నపనం తర్వాత కవచప్రతిష్ఠ జరుగుతుంది.





ప్రక్షాళ్య పంచగవ్యేన జలేన పరిశోధయేత్ ।
కృత్వాపి వాస్తుశుద్ధిం చ యథోక్తా నిష్కృతిం చరేత్ ॥
(ప్రకీర్ణాధికారం - భగవాన్ భృగుః)

మూడవరోజు ఉదయం అష్టోత్తరకలశ స్నపనంలో భాగంగా హోమాది వైదికక్రియలు పూర్తయిన పిదప, పంచ గవ్యమునకు (గోక్షీరం, గోదధి, గోఘృతం, గోమూత్రం, గోమయం) అధిదేవతను ఆవాహనంచేసి ఉపచార సమర్పణ గావించి, అనంతరం కవచమునకు వాస్తుహోమం చేస్తారు. పంచగవ్యముతో కవచములకు ప్రోక్షణచేసి, వాస్తుశుద్ధి జరిపి ఈ యొక్క స్వర్ణ కవచములను శ్రీవారి ఉత్సవమూర్తులకు సమర్పించుటకు యోగ్యతను కలగజేస్తారు (పవిత్రీకరిస్తారు). పంచదశసూక్తము లతో అభిమర్శన క్రియను కవచములకు నిర్వహించి తదుపరి..

విష్ణోర్నుకాది మంత్రైశ్చ సంధధ్యాత్కవచం తథా।
దృఢీకృత్య తు పూర్వోక్తం యత్నేన పరికల్పయేత్॥
(ప్రకీర్ణాధికారం - భగవాన్ భృగుః)

అని చెప్పబడినట్లు విష్ణోర్నుకం... అను మంత్రముతో స్వర్ణకవచమును, శ్రీ, భూ సమేత శ్రీమలయప్పస్వామివారికి దృఢముగా, స్థిరంగా పూర్వం ఉన్నట్లుగానే సమర్పణ గావించ బడుతుంది. సంవత్సరం పూర్తిగా శ్రీవారి ఉత్సవమూర్తుల దివ్య తిరుమేని స్వర్ణకవచములతో శోభిస్తూ ఉంటుంది. కాని జ్యేష్ఠా భిషేక ఉత్సవసమయంలో మాత్రమే స్వామివారి యొక్క నిజమైన అర్చారూపదర్శనం భక్తులకు కలుగుతుంది. అలాగే సాధా రణంగా అభిషేక ద్రవ్యాలైన పాలు, పెరుగు మొదలైన వాటితో స్వామివారియొక్క పాదాలకు అభిషేకం చేస్తారు. ఎందుకంటే ఉత్సవమూర్తులు స్వర్ణకవచాలతో ఉంటారు కాబట్టి, అభిషేకం శిరసాదిగా చేయబడదు. కానీ ఈ జ్యేష్ఠాభిషేకసమయంలో మాత్రమే శ్రీమలయప్పస్వామివారికి శిరసాదిపాదపర్యంతం అన్ని ద్రవ్యాలతో అభిషేకం జరుపుతారు.

యద్యద్రూపం తథా ధ్యాయేత్తత్తద్బింబేషు యోజయేత్।
తస్మాత్సర్వప్రయత్నేన బింబరక్షాం సమాచరేత్॥
(ప్రకీర్ణాధికారం - భగవాన్ భృగుః)

భృగువు ప్రకీర్ణాధికారంలో, ఆ యా మూర్తుల రూపము నకు తగినట్లు, చక్కగా సరిపోవునట్లుగా కవచములను సర్వ ప్రయత్నముతో సమకూర్చుకుని, బింబములను రక్షించుకోవలె నని, ఇదియే జ్యేష్ఠాభిషేకం అనే ఉత్సవం యొక్క పరమార్థంగా చెప్పబడినది. అలాగే మూడవదినం స్వర్ణకవచసమర్పణకు ముందు శ్రీవారి మూర్తులకు సుగంధ తైలమును సమర్పించి, నిజతిరుమేని పై చందనము, ఆపై పల్చటి శ్వేతవస్త్రము ధరింప జేసి, కవచధారణ చేస్తారు. ఇటువంటి మహత్తరమైన జ్యేష్ఠాభిషేక మహోత్సవము, తిరుమలలో అంగరంగవైభవంగా, నేత్రపర్వంగా మూడు రోజులపాటు నిర్వహించిన కంకణభట్టర్ ఆచార్యులకు, చివరి రోజు సాయంత్రం అర్చక బహుమానం అనే దేవస్థాన మర్యాదలను చేయటంతో క్రతువు పూర్తి అవుతుంది.



ఏవం యః కురుతే భక్త్యా కార్యం రోగప్రణాశనమ్।
సర్వాన్ కామానవాప్యైవ విష్ణోస్సాయుజ్యమాప్నుయాత్॥
(ప్రకీర్ణాధికారం - భగవాన్ భృగుః)


ఈ ఉత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ, శ్రీవేంకటే శ్వరస్వామి వారి దివ్యాశీస్సులతో, అన్ని కార్యాలు నిర్విఘ్నంగా నెరవేరుతాయి. వారికి ఉన్న దీర్ఘకాల రుగ్మతలు, వ్యాధులు తొలగిపోతాయి. సమస్త మనోవాంఛలు సిద్ధిస్తాయి. దేహావసా నమున, శాశ్వతమైన విష్ణుసాయుజ్యం లభిస్తుందని, క్రియాధి కారంలో భృగుమహర్షి పేర్కొన్నాడు. ఈ విధంగా జ్యేష్ఠాభిషేక మహోత్సవం ఎంతో ఘనంగా నిర్వహింపబడుతుంది.

॥ శ్రీనివాసో విజయతే ॥

# శ్రీమద్భగవద్గీత

విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్,
94416 45995

7



## 7వ - అధ్యాయం (సారసంగ్రహం)

### విజ్ఞాన యోగం అధ్యాయ నామౌచిత్యం

గీత **'తత్, త్వం, అసి'** అనే వేదవాక్యానికి వివరణ అని వ్యాఖ్యాతలన్నారు. అది నీవు అయి ఉన్నావు- అన్న ఉపదేశం ఇందులో ఉంది కనుక ఇది ఉపదేశ వాక్యమయింది. ఈ వాక్యం ఛాందోగ్యోపనిషత్తులో ఉంది. గీతలోని మొదటి ఆరధ్యాయాలు **'త్వం'** అనే శబ్దాన్నిచ్చే అర్థాన్నీ, మధ్యలోని ఆరధ్యాయాలు **'తత్'** శబ్దార్థాన్నీ, చివరి ఆరధ్యాయాలు **'అసి'** శబ్దార్థాన్ని వివరిస్తాయంటారు. అందువల్ల ఈ ఏడవ అధ్యాయం నుంచీ పం(దెండవ అధ్యాయం వరకు ఉన్న ఆరధ్యాయాలు **'తత్'** అనే శబ్దానికి అర్థమైన పరమాత్మను వివరిస్తున్నాయి. మరొక రకంగా చెబితే మొదటి ఆరధ్యాయాలు **'కర్మ'** షట్కాన్నీ, మధ్యలోని ఆరధ్యాయాలు **'భక్తి'** షట్కాన్నీ, చివరి ఆరధ్యాయాలు **'జ్ఞాన'** షట్కాన్నీ బోధిస్తాయని- కర్మ, భక్తి, జ్ఞాన యోగాల సమన్వయమే గీత అని కూడా అంటారు. ఇంతవరకు కర్మ షట్కం బోధింపబడింది. భక్తి ద్వారా జ్ఞానం, జ్ఞానం ద్వారా మోక్షం లభిస్తుందని శాస్త్ర వాక్యం. ఇక్కడ నుంచి భక్తి షట్కం ప్రారంభమౌతున్నది. ఇందులో మొట్టమొదట కృష్ణపరమాత్మ జ్ఞాన విజ్ఞానయోగం గూర్చి అర్జునుడికి తెలుపుతూ ఉన్నారు. అందుకే ఈ అధ్యాయానికి జ్ఞాన విజ్ఞానయోగం అనే పేరు వచ్చింది. జ్ఞాన విజ్ఞానాలు రెండూ సాధకుడికి అవసరం. సిద్ధాంతరూపమైన అవగాహనే జ్ఞానం అనబడుతుంది. ఆ జ్ఞానమే అనుభవంలోకి వస్తే విజ్ఞాన మనబడుతుంది. అటువంటి విజ్ఞానాన్ని చెప్పేదే ఈ అధ్యాయం.

వేదాంతార్థంలో జ్ఞానమంటే వాచాజ్ఞానమనీ, శాస్త్ర జ్ఞానమనీ, విజ్ఞానమంటే అనుభవజ్ఞానమనీ పెద్దలంటారు. ఈ అధ్యాయంలో జ్ఞానాన్ని గురించి, జ్ఞేయాన్ని గురించి సవిస్తరంగా చెప్పబడి ఉంది. ఇందులోని ఈ క్రింది శ్లోకం ముఖ్యమైంది.

**రసోఽహమప్సు కౌంతేయ ప్రభాఽస్మి శశిసూర్యయోః ।**
**ప్రణవస్సర్వ వేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥ 8**

ఈ శ్లోకంలోని విశేషజ్ఞానమే విజ్ఞానం అని గ్రహించాల్సి ఉంటుంది. జలములోని రసం, సూర్యచంద్రులలోని కాంతి, వేదాలలోని ఓంకారం, ఆకాశమందలి శబ్దం, మానవులందలి పురుషాకారం నేనే అయి ఉన్నానని తెలిపారు. ఇదే విజ్ఞానం యొక్క పరమరహస్యం. సామాన్య జనులజ్ఞానం- అజ్ఞానం చేత మూసుకొని ఉండటం చేత ఈ రహస్యాన్ని తెలుసుకోలేకున్నారు. రసం లేకుండా జలం లేదు. ప్రకాశం లేకుండా సూర్య చంద్రులు లేరు. ఓంకారం లేకుండా వేదం ఉండదు. శబ్దం లేకుండా ఆకాశం లేదు. ఇలాంటి పరమ రహస్యాలు ఇందు చెప్పబడి ఉండటం చేత దీనికి **'విజ్ఞానయోగం'** అనే పేరు వచ్చింది.

విజ్ఞానంతో కూడిన జ్ఞానాన్ని నీకు చెబుతానన్నాడు శ్రీకృష్ణుడు. దీన్ని తెలుసుకుంటే మళ్ళీ తెలుసుకోవలసింది ఏదీ ఉండదని కూడా అన్నాడు. వేలకొలది జనుల్లో సిద్ధికై యత్నించే వాడు ఒకడు. అట్టి సిద్ధుల్లో భగవత్తత్త్వాన్ని తెలుసుకొనేవాడు ఒకడే అనటం వలన ఈ మార్గం ఎంత దురవగాహమైందో బోధపడుతుంది.

పంచభూతాలు, మనోబుద్ధ్యహంకారాలని ప్రకృతి ఎనిమిది విధాలు. జీవులన్నీ పరాప్రకృతి. ప్రాణులన్నీ పరాప్రకృతి నుండి ఏర్పడినవే. అంతా పరమాత్మలోనే గుది గ్రుచ్చబడి ఉంది- అంటూ కృష్ణుడు పంచభూతాలలో తాను ఎలా ఉన్నాడో వివరించాడు. సర్వభూతాలకు తానే బీజమన్నాడు. సాత్త్విక, రాజస,

తామసిక భావాలు తననుండే వస్తాయని చెప్పాడు. తన మాయ శరణాగతులు కానివారికి దాటరానిదన్నాడు.

గత ప్రాణి వర్గమంతా తనకు తెల్సుననీ, తన్ను తెలిసిన వాడు లేడని చెప్పాడు. పాపరహితులే భగవద్భజన చేస్తా రన్నాడు. ఈ విధంగా ఏడవ అధ్యాయంలో అనుభవరూపకమైన జ్ఞానం అనగా విజ్ఞానం వివరింపబడి ఉంది. ఈ అధ్యాయం చదివినా విన్నా జన్మరాహిత్యం కలుగుతుందని అంటారు.

- - - - -

## భగవంతుడంటున్నాడు :

అర్జునా! నీ మనస్సు నా యందే నిలిపి, నన్నే ఆశ్ర యించి ఉన్నావు గనుక; యోగులు సంపూర్ణంగా, సంశయ రహితంగా నన్నెట్లా సాక్షాత్కరించుకుంటారో ఆ మార్గాన్ని నీకిప్పుడు పరిచయం చేస్తాను. దేన్ని తెలుసుకుంటే అన్నీ తెలుసు కొన్నవాడ వవుతావో అటువంటి జ్ఞాన విజ్ఞానాలనే రెండింటినీ సంపూర్ణంగా స్పష్టంగా వివరిస్తాను. విను. నన్ను గూర్చి తెలుసు కోవటం జ్ఞానం. ప్రపంచంలోని చరాచరాలన్నిటికంటే నేను వేరని తెలుసుకోవడమే విజ్ఞానం (విశేషజ్ఞానం).



మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥ 3

వేలమంది మనుష్యుల్లో ఏ ఒక్కడో యోగసిద్ధికై ప్రయ త్నిస్తాడు. ఆ ఒక్కడు మాత్రమే నన్నూ, నా స్వరూపతత్త్వాన్ని సరిగా అర్థం చేసుకొని ఆరాధించ గల్గుతాడు. మోక్షాన్ని పొందుతాడు.

అర్జునా! నాకు 'పర', 'అపర' అని రెండు ప్రకృతు లున్నాయి. అందు భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం (పంచభూతాలు) మనస్సు, బుద్ధి, అహంకారం అనే ఎనిమిది భాగాలుగా నా ప్రకృతి కన్పిస్తుంది. ఇది జడప్రకృతి. దీనినే అపర ప్రకృతి, ప్రకృతి, మూలప్రకృతి, మాయ, అవ్యక్తం, ప్రధానం అని పెక్కు విధాలుగా పేర్కొంటారు. జగన్మాత, జగదంబస్వరూపంగా కూడా భావిస్తారు. దీనికంటే ఉత్తమమైన, భిన్నమైన చైతన్యం చేత ఈ జగత్తు ధరింపబడి ఉంది. అది నా పరప్రకృతి. జీవుల నిచ్చేది జీవ ప్రకృతి– అంటే పురుషుడు. అతడే నిర్వికారమైన పరమాత్మ. భగవత్స్వరూపం. ప్రకృతి జడం. పరమాత్మ చైతన్యం. ఈ రెండూ నా స్వాధీనంలోనివే. ప్రపంచం లోని సర్వభూతాలు ఈ రెండు ప్రకృతుల నుండే ఉత్పన్నమవు తాయి. సమస్త భూతకోటి ఉత్పత్తికి, నాశనానికి నేనే కారణం. అవి నా యందు పుట్టి నా యందే లయమవుతాయి అని గ్రహించు.

మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ ।
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥ 7

ఈ లోకంలో నాకంటే గొప్పది, ఉత్తమమైన వస్తువు ఇంకొకటి లేదు. మణులను దారానికి కూర్చిన విధంగా సమస్త ప్రపంచంలోని చరాచర వస్తువులన్నీ నా యందే ఉన్నాయి. దారం కనబడనట్టే అన్నిటా– అంతటా అంతర్యామిగా ఉండే నేనూ కనబడను. ఇదే పరమాత్మ స్వరూపం. పరమాత్మ ఆత్మ ప్రపంచమంతటా వ్యాపించి ఉంది.

ఓ ధనంజయా! నీటిలోని రుచినీ, సూర్యచంద్రులలోని కాంతినీ, వేదాలలోని ఓంకారాన్నీ, ఆకాశంలో శబ్దాన్నీ, పురుష లందు పౌరుషాన్ని నేనే. భూమియందు సుగంధాన్ని, అగ్నిలో ప్రకాశాన్ని, సర్వభూతాల ప్రాణాన్ని, తాపసులలోని తపస్సును నేనే. భూతకోటికి బీజాన్ని, బుద్ధిమంతులలోని బుద్ధిని,

తేజోవంతుల యందలి తేజస్సును, బలవంతుల బలాన్ని, విధి విహితమైన కామాన్నీ నేనే. వేయేల? ప్రపంచమందలి వస్తువు లన్నిటిలో ఉండే సారాన్ని నేనే. అయినా జనులు సాత్త్విక, రాజస, తామసాలనే మూడు గుణాల మాయకు లోనై నన్నెరుగ లేకపోతున్నారు.

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।
మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే ॥ 14

దివ్యమూ, త్రిగుణాత్మకమూ ఐన ఈ యోగ మాయను దాటడం సామాన్య విషయం కాదు. నన్ను శరణుజొొచ్చి, ఆశ్ర యించిన వారు ఈ మాయ అనే మేలిముసుగును తొలగించు కొని నన్ను చేరుతారు. పాపాచారపరాయణులైన మూఢులు ఈ యోగమాయకు లోబడి దుష్కార్యాలను చేస్తూ అసురగుణా లను కలిగి దైవమునకు దూరమై అధోగతిని పొందుతున్నారు.

ఓ భరతశ్రేష్ఠా! సృష్టిలోని అందరూ భగవంతుని చేతనే సృష్టింపబడ్డారు. దేవుడికి జీవులందరు సమానులే. అయినా జీవులు వారి వారి అర్హతలకు తగినట్లు భగవంతుణ్ణి సేవిస్తుం టారు. పుణ్యాత్ములైన సజ్జనులు నన్ను ధ్యానించి సద్గతిని పొందు తున్నారు. అట్టి భక్తులు ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులని నాల్గు రకాలు.

1) విపరీతమైన విపత్తులు కల్గినపుడు అవి పోవాలనీ కాపాడ మనీ మొక్కే వాళ్ళు 'ఆర్తులు'.

2) దేవు డెట్టివాడు? అతని తత్త్వం ఏమిటి? అని తెలుసుకోగోరే ముముక్షువు 'జిజ్ఞాసి'.

3) ప్రాపంచిక సంబంధమైన భోగాలను, సంపదలను, అధి కారం, కీర్తిప్రతిష్ఠలను కోరి ఆరాధించేవారు 'అర్థార్థులు'.

4) నిరంతర భక్తితో భగవంతుడే తప్ప మరి దేనినీ భావన చేయని వారు 'జ్ఞానులు'.

ఈ నాల్గు తెఱగుల వారున్నూ ఉత్తములే. అయినా వీరందరికంటే జ్ఞాని శ్రేష్ఠుడు. జ్ఞానికి నాకూ భేదం లేదు. నేనే జ్ఞాని. జ్ఞానే నేను. జ్ఞానికి నేను ప్రియుణ్ణి. అతనియందు నాకు ప్రీతి. జన్మజన్మల పుణ్య పరిపాకంతో ఒకానొకడు జ్ఞానియై "సర్వం ఖల్విదం బ్రహ్మ" వాసుదేవుడే సర్వం అని గ్రహించి భగవంతుణ్ణి ఆశ్రయించి మోక్షం పొందుతాడు. ఈ స్థితిని పొందిన మహాత్ములు చాలా అరుదుగా ఉంటారు.

> **శ్రమిస్తే దానికి తగ్గ ఫలితం తప్పకుండా ఉంటుంది.**
>
> **శ్రమ మీద మాత్రమే మీకు అధికారం ఉంటుంది. ఫలితం మీద కాదు.**
>
> **కావున, త్రికరణ శుద్ధిగా శ్రమ చెయ్యండి.**
>
> **శ్రమైక జీవులను గౌరవించండి.**
>
> **శ్రామికులలో ఉన్న నైపుణ్యాలను చూడండి, అభినందించండి.**

పామరులు కొందరు ఏవో కోర్కెలతో ఫలాన్ని శీఘ్రంగా పొందాలని రకరకాల దేవతలను ఆరాధిస్తుంటారు. ఆ దేవత లందు కూడా నేనే అంతర్యామిగా ఉన్నాను. నా ఆజ్ఞవల్లనే ఆ దేవుళ్ళు ఫలాన్నిస్తున్నారు. ఎవరి ఇష్టదేవతల్ని వారు ఆరాధించు కోవచ్చు. ఎవరు ఏ రూపంతో ఏ దేవతను ఆరాధించినా మొదట అలవర్చుకోవలసింది దృఢమైన భక్తి, శ్రద్ధ. ఆ శ్రద్ధా భక్తుల్ని అనుగ్రహించే వాడనూ నేనే.


నాహం ప్రకాశః సర్వస్య యోగమాయాసమావృతః ।
మూఢోఽయం నాభిజానాతి లోకో మామజ మవ్యయమ్॥ 25

మూర్ఖులైన జీవులు మాయకు లోబడి మోహసాగరంలో మునిగి నా అవతార తత్త్వాన్ని గ్రహించలేక నన్నుకూడా మానవ మాత్రునిగానే భావిస్తుంటారు. ఈ అవివేకులు నన్ను జనన మరణ శూన్యునిగా తెలుసుకోలేరు. అర్జునా! భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లోని ప్రాణికోటిని నేను తెలుసుకోగలుగు తున్నాను. కానీ నన్నెరిగిన జనులు లేరు. నన్ను గూర్చిన జ్ఞానములేదు. జ్ఞానులకు మాత్రమే నా స్వరూపం అర్థమవుతూ ఉంటుంది. పార్థా! ఎవరు జరామరణ రహితమైన మోక్షం కొరకు ఆధ్యాత్మిక దీక్షతో నన్నాశ్రయించి సాధన చేస్తుంటారో వారు తరిస్తారు. పరబ్రహ్మను దర్శించగల్గుతారు. ఆధి భూత, ఆధి దైవం, ఆధి యజ్ఞం అనే అన్నిటికీ నేనే ఆధారమని తెలుసుకున్నవారు నన్ను మరువక మరణవేళ కూడా నన్ను గూర్చిన జ్ఞానముతోనే ఉంటారు.

శ్రీకృష్ణార్పణమస్తు.

# 'సుందర' హనుమాన్

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ



సుగ్రీవుడు హనుమంతునే అంటి పెట్టుకున్నాడు. లోతుగా ఆలోచిస్తే హనుమదుపాసకుడు. అందుకే హనుమంతుని అండతో అభయాన్ని పొందాడు. ఆ స్వామి కరుణతోనే శ్రీరామ సఖ్యాన్ని సంపాదించుకున్నాడు.

హనుమత్ప్రవేశంతో రామాయణానికి నూతనోత్తేజం, ఉత్సాహం సమకూరుతుంది. ఆనందదాయకుడు, శోక నివారకుడు, అభయప్రదాత– ఈ లక్షణాలను రామాయణంలో ప్రదర్శించాడాయన. సీతారాములకు వియోగవ్యథనుండి ఊరట కల్పించాడు. ఆత్మహత్యకు సిద్ధమైన సీతమ్మను ఆ ప్రయత్నం నుండి విరమింపజేసి, శోకాన్ని పోగొట్టి ఓదార్చి ఆశనీ, అభయాన్నీ, ధైర్యాన్ని కల్పించాడు. సీత జాడ తెలిపి శ్రీరాముని ఆనందపరచి, శ్రీరామ పరిష్వంగవైభవాన్ని పొందాడు.

వేలకొలది రావణులనైనా ఒక్కడు ఎదుర్కోగల సమర్థుడు. దానవవీరులను అవలీలగా చెండాడిన శౌర్యమూర్తి, మహాప్రతాపశాలి.

ప్రతాప ధైర్యాదులే కాక– 'మహాయోగి'. తన బలశౌర్య విజ్ఞానాదులన్నీ పరోపకారం కోసమే వినియోగించిన నిస్సంగుడు. త్యాగి. మహావీరుడు, సమర్థుడు అయినా గొప్ప వినయ సంపన్నుడు. తన వాగ్వైదుష్యంతో శ్రీరామునే అబ్బుర పరచిన వాక్యకోవిదుడు. లంకాదహనంలోనూ, రావణుని హెచ్చరించడంలోనూ, విభీషణ శరణాగతి ఘట్టంలోను హనుమ ప్రవర్తన, సంభాషణ అతడి రాజనీతి విశారదత్వాన్ని తెలియజేస్తాయి.

స్వయంగా సర్వగుణ బలసంపన్నుడైనా **'దాసోఽహం కోసలేంద్రస్య'** అని చాటిన భక్తవతంసుడు. నిస్వార్థ కర్మయోగి. రామాయణంలో అతిమానుష దివ్యత్వాన్ని ప్రదర్శించిన రుద్ర స్వరూపుడు. ఎంత ప్రతాప రౌద్రతయో – అంతటి ప్రశాంత గాంభీర్యం, ఎంత ఉగ్రతేజమో – అంత మృదుమధుర వాక్ చిత్త సంస్కారం, ఎంతటి దేహదారుఢ్యమో– అంతటి బుద్ధి నైపుణ్యం. అపారశబ్దశాస్త్ర పాండిత్యం. అమోఘ బ్రహ్మచర్యతేజం.

ఒక పరిపూర్ణ శోభతో రామాయణాన్ని సుందరం చేసిన మంత్రమూర్తి. శ్రీమద్రామాయణంలో శక్తి, విష్ణు, రుద్రస్వరూపాలే సీతారామాంజనేయులు. వీరు ముప్పురూ మంత్రమూర్తులు. మహర్షి వాల్మీకి ధ్వనిప్రాయంగా గర్భీకరించిన ఈ వేదమూర్తుల మంత్ర రహస్యాలను వివిధ మంత్ర సంహితలు ఉపాసనా సంప్రదాయాలుగా నిబద్ధం చేశాయి. ఆ మంత్రానుష్ఠానాలతో ఎందరో దివ్య ఫలాలను పొందుతున్నారు కూడా.

'హనుమాన్' శబ్దానికి 'జ్ఞానవాన్' అని అర్థం చెప్పారు. 'హను' అంటే జ్ఞానం అనే అర్థాన్ని కొన్ని నిఘంటువులు చెబుతున్నాయి. 'హనువులు' అంటే 'దౌడలు'. బలమైన దౌడలు కలిగి ఉన్నాడని అభివర్ణించడం ఆతని వాగ్వైదుష్యాన్ని కీర్తించడమే!

శబ్దపరంగా చూస్తే 'హనుమాన్' (హనుమ)లోని అచ్చులు (ప్రాణాక్షరాలు) అ+ఉ+మ కలిపితే 'ఓం'. ప్రణవ రూపుడైన రుద్రుడే ఈ స్వామి. ఇది శబ్ద మర్మభావన.

యోగీశ్వరుడైన హనుమ దీక్షాదక్షతలతోపాటు యోగ శక్తిమంతుడు. అన్నీ చేయగలిగీ, చేసి కూడా ఏమీ ఆశించక అంటీ అంటక ఉండగలిగినవాడు. దాసునిగా, మంత్రిగా ఉంటూనే ప్రభువులతో సమానంగా, ఒక్కొక్కసారి వారిని మించి నట్లుగా భాసించే వ్యక్తిత్వం కలిగినవాడు.

సులభ ప్రసన్నుడైన ఈ స్వామిని వాల్మీకి ప్రత్యేకించి సుందరకాండనందంతటా పరిపరివిధాల శ్లాఘించి, పరమేశ్వర స్వరూపుడీతడని స్ఫురింపజేస్తాడు. శ్రీరాముడు కృతజ్ఞత, ప్రేమల సంకేతంగా ఆలింగనం చేసుకున్న దృశ్యాన్ని ధ్యానిస్తే హరి హరాద్వైతమూర్తి గోచరిస్తాడు.

హనుమద్భుజాన అధిరోహించి రావణునితో పోరిన శ్రీరామమూర్తిలో ప్రత్యేకశోభ కనిపిస్తుంది. సంజీవరాయుడై లక్ష్మణప్రాణదాతగా శ్రీరాముని ఆనందానికి మళ్లీ హేతు వయ్యాడు. "మమ్మల్నందర్నీ జీవింపజేసిన అమృత స్వరూపుడు హనుమ" అని శ్రీరాముడే ప్రత్యేకంగా శ్లాఘించాడు.

వాయుపుత్రుడైన ఈ రుద్రతేజుడు పవన నియంత్రణ విద్యను సిద్ధింపజేసుకున్న యోగవిద్యాసంపన్నుడు.

శరీరమనోబలాలకు, బుద్ధిశక్తి సంపన్నతకు, ధర్మనిష్ఠకు, ధైర్యవంతమైన పురోగమనానికీ, విజయవీరత్వానికీ, అభయ ధీరత్వానికీ మూర్తి కట్టించితే ఆ మూర్తి ఈ వజ్రాంగబలిగా ప్రత్యక్షమౌతుంది.

వేదాలలో 'మన్యుసూక్తం'వంటివి హనుమంతునిలో ఉన్న రుద్రతేజాన్ని వ్యక్తీకరిస్తాయి. హనుమదుపాసనలో, మంత్ర సాధనలో మన్యుసూక్తాన్ని మేళవించడం, సంపుటీకరించడం ఆగమాలలో కనిపిస్తుంది.

దేశమంతటా అన్ని రాష్ట్రాలలోనూ వారి వారి సంప్ర దాయాలకనుగుణంగా మహోన్నత హనుమన్మూర్తుల్ని అందరూ ఆరాధిస్తారు. హనుమంతుని ఆలయం ఉన్నచోట ఏ పీడలు చేరవని శాస్త్రాలు చెబుతున్నాయి.

'యోసావాదిత్యః పరమపురుష స ఏవ రుద్రోదేవతా' అన్నట్లుగా ఆదిత్యమండలంలోని రుద్రతేజమే ఈ స్వామి. అందుకే సూర్యోపాసనతో తన ఆత్మశక్తిని ఆవిష్కరించుకున్నాడు.




త్రయీమయుడైన ఆదిత్యుని నుండి వేదాది విద్యలను అభ్య సించి, అటుపైన అమోఘ తపఃఫలంగా సూర్యునిలోని 'సువర్చస్సు' అనే శక్తిని పొందగలిగాడు.

భక్తుల పాలిటి కల్పవృక్షమీతడు. రామనామ రసికుడు. రాముడు తన పరిష్వంగంతో సంభావిస్తే, జానకీమాత పరమ వాత్సల్యంతో స్వయంగా ముత్యాలమాలనిచ్చి సన్మానించింది.

ఆపదుద్ధారకుడు, సంకటమోచనుడు, వజ్రాంగ బలి, వీరాంజనేయ, అభయాంజనేయాది నామాలతో సన్నుతు డైన వాడు. తులసీదాసుకు రామదర్శనాన్ని అందజేసిన ఆప ద్బాంధవుడు. ఆ కారణంగానే తులసీదాసు కాశీలో హనుమ దాలయాన్ని నిర్మించి చాలీసాతో కీర్తించాడు.

కామరూపధరుడైన ఈ స్వామి సర్వదేవతా శక్తులతో భాసిల్లే పరదైవం. గంధమాదన పర్వతంపై నేటికీ భాసిల్లుతున్న భక్తసులభుడు.

ఆ స్వామి స్ఫూర్తితో 'త్యాగ కర్మ ధర్మ వీర యోగశక్తుల్ని' పొందగలదీ భారతజాతి.




*(గత సంచిక తరువాయి....)*

అనిన వచనము చొప్పున శ్రీవైఖానసశాస్త్రసిద్ధమై శ్రియః పతికి అసాధారణమై రేఖాద్వితయరూపమైన తిరునామమున (తిరుమణ్‌కాప్పు, ఊర్ధ్వపుండ్రము) నాసిక మొదలు కేశముల పర్యంతము దిద్దించెను. ఇట్లు కట్టడచేసిన మరునాడు శుక్ర వారము కాగ ఆ దినమున తిరుమంజనము (అభిషేకము) ఆచరించు సందర్భమున మొదట ఆకాశగంగాతీర్థముతోడ అభి షేకము చేయగా, అందుచేత స్వామి దివ్యఫాలతలమున దిద్దిన ఊర్ధ్వపుండ్రరేఖలు చెరిగిపోవగ, ఆ రేఖలకు మూలమగు నాసాది యందు సమర్పించిన అర్ధచంద్రాకృతియగు తిరునామ భాగము చెదిరిపోవకయుండెను. ఈ యర్ధచంద్రరేఖాకారమగు ఊర్ధ్వ పుండ్రమును శ్రీరామానుజాచార్యులు కటాక్షించిరి. మునుపు జగన్మోహినిగా అవతరించిన దశలో దివ్యఫాలమున నుండిన అర్ధచంద్రరేఖాకారపు పుండ్రము (స్త్రీల ముఖమందలి నామము తీరు) అచటనున్న దేవదానవులకు మోహజనకముగా నుండినట్లే ఈ జగన్మోహనమైయున్న దివ్యమంగళవిగ్రహమున నాసికా మూలమందు కనుపించు అర్ధచంద్రాకారపు తిరునామము స్వామి వారి శ్రీముఖమండలమునకు శోభావహమై ఆశ్రితుల దృష్టిని హృదయమును ఆకట్టుకొనునదైయుండుట వలన ఈ తీరగు తిరునామమునే కొన్నాళ్లు ధరింపజేయవలెనని మనమున తలపోయుచుండగ 'అట్లే యగుగాక!' యని అర్చక ముఖమున భగవదనుగ్రహము తెలిపెను.

శ్రీ భగవద్రామానుజాచార్యులు శుక్రవారమున శ్రీనివాసుడు అభిషేకము స్వీకరించిన తరువాత కర్పూరరేణువుతో దివ్యఫాలమున రేఖాద్వయరూపముగ సమర్పించిన తిరు నామమును మూడుదినములు ధరించునట్లు ఏర్పరచిరి.

"ఆదౌ కృతయుగే జంబూద్వీపే భారతవర్షకే,
గంగాయా దక్షిణే భాగే యోజనానాం శతద్వయే,

సప్తయోజనమాత్రేణ పూర్వాంబోధేస్తు పశ్చిమే,
మాసే భాద్రపదే విష్ణుతిథ్యాం విష్ణుసమన్వితే.

సిద్ధయోగే సోమవారే గిరౌ నారాయణాహ్వయే,
స్వామిపుష్కరిణీతీరే పశ్చిమే భూత్యపశ్చిమే.

బృందారకాణాం బృందైస్తు ప్రార్థితో లోకరక్షకః,
ఆవిర్బభూవ భగవాన్ శ్రీనివాసః పరః పుమాన్."

(మొదటి కృతయుగమందు జంబూద్వీపమున భారత వర్షమున గంగానదికి దక్షిణభాగమున రెండువందల ఆమడల దూరమున, తూర్పు సముద్రమునకు ఏడు ఆమడల దూరమున, పడమటివైపున భాద్రపదమాసమున శ్రవణనక్షత్రయుక్తమగు ద్వాదశితిథి సోమవాసరము సిద్ధయోగమున నారాయణాద్రి యను కొండపై (శ్రీనివాసుని నివాసస్థానమగు కొండకిది యొక పేరు) సంపత్సమృద్ధమైన స్వామిపుష్కరిణి పశ్చిమతీరమున లోకరక్షకుడై పురుషోత్తముడైన శ్రీనివాసభగవానుడు దేవ బృందములచే ప్రార్థితుడై యావిర్భవించెను.)

అని పాద్మపురాణమున ముప్పదిమూడవ యధ్యాయము చివరిభాగమున నున్న రీతిగ శ్రీవేంకటేశ్వరస్వామి యవ తారవాసరమగు సోమవారమున తాము తలచిన తీరుగ భగవ దనుగ్రహము (అనుమతి) ఏర్పడియుండుట వలన నాసికా మూలమున అర్ధచంద్రాకారపు తిరునామము ధరించి, దివ్యఫాల

భాగమున రేఖా ద్వయరూపముగ ముత్తియముల తిరు నామమును దివ్యనయనార విందములకు శీతలద్రవ్యవిశేషముతో కాటుకయు ధరించియుండి మిగిలిన దినమంతయు ఎల్లరకు (స్వామి)దర్శనభాగ్యము కలుగున ట్లేర్పరచెను.

శూరపురుషుడు తన శౌర్యసాధనములగు ఆయుధము లకు మొదట చందనకుసుమములు సమర్పించి, పిమ్మటనే తాను వానిని స్వీకరించు విధముగ వేంకటాచలపతియు ప్రతి దినమున త్రిసంధ్యలందు తోమాలియను సమర్పించునపుడు తమ విజయపరంపరలకు ప్రధానసాధనములగు సువర్ణమయ శ్రీశంఖచక్రములకు మాలిక సమర్పించిన తరువాత శ్రీవక్షఃస్థల లక్ష్మి, దివ్యకిరీటము మున్నగు దివ్యావయములకు శ్రీమాలికలు సమర్పింపవలెననియు, శ్రీవేంకటేశ్వరునకు అభిషేకము చేయు సమయమున ప్రతి శుక్రవారమున 'క్షణకాలము కూడ ఎడబాసి యుండలేను' అనుచు నిత్యానపాయినియై వక్షఃస్థలము కుడి భాగమున వాసము చేయుచున్న లలనయగు అలర్మేల్ మంగా దేవి వక్షమునుండి యవతరింప తత్కాలమాత్ర వియోగమును గూడ ఓర్వలేని యామె ప్రకృతిని భగవద్రామానుజాచార్యులు చింతించి, ఆమె యపరావతారమై ఆమె ప్రియసఖియై భూదేవ్యంశమున అవతరించిన పెరియాళ్వారుల అనుంగు పుత్రికయైన గోదాదేవి తులసిపరిమళముతోడనే పుట్టినట్లుగ, భగవత్ప్రేమ తోడనే యవతరించినది మొదలుకొని భగవంతునే అనుభవింప ఆసగొని, అది లభింపనందున ఆయనను పొందు టకైన ఉపాయ విశేషములు గైకొనిన తీరు, ఆయన సన్నిధికి సందేశము పంపినరీతి ఆ స్వామియొక్క స్థితి గమన శయనాదు లకు యోగ్యములైన దివ్యక్షేత్రములను అనుభవించి ఆనందిం చిన విధము– ఇట్లు వివిధ విరహదశలను అనుభవించిన ప్రకారమును వర్ణించెడి 'నాయ్చ్చియార్ తిరుమొళి' అను ద్రావిడ ప్రబంధమును, శ్రీవేంకటాచలపతి పురుషసూక్తము మున్నగు సూక్తముల పారాయణముతోడ అభిషేకమును స్వీకరించిన తరువాత అలర్మేల్మంగాదేవి అభిషేకము స్వీకరించినపుడు అనుసంధింపవలె ననియు కట్టడిచేసెను.

తిరుమల సంస్థానము కొండలు – అడవిరూపముగా నున్నందున దివ్యనగరమును విస్తరించి కట్టుటకు యోగ్యముగా లేనందున పూర్వకాలమున ద్రుమకుశారుడు (చెండివాళన్) అను భక్తుడొకడు దేవాలయమునకు పడమటివైపు ప్రాకారము ప్రక్కగా ఒకవీథి నిర్మించి, అందు కైంకర్యపరులు మాత్రము నిత్యనివాసము చేయునట్లేర్పరచినాడు. ఆ కాలమున దేశాధిపతు లైన విష్ణుభక్తులు స్వామివారి యుత్సవములు జరుపుటకు తిరు వీథుల నిర్మింప సమతలము లేనందున,

"దేవస్థానస్య పరితః వీథికాకరణాక్షమే,
సమీపే వా పురీం కృత్వా తత్ర దేవోత్సవం చరేత్."

(దేవస్థానము చుట్టుప్రక్కల వీథుల నిర్మింప వీలుకాని యెడల సమీపమునందు పురము నేర్పరచి యట దేవోత్సవములు అనుష్ఠింపవలెను.)

అని వైష్ణవాగమశాస్త్రములందు చెప్పిన చందాన 'వేంగడత్తుఱై వార్' అను అప్పటి వేంకటేశ్వరుల ఉత్సవమూర్తి, బ్రహ్మోత్సవారంభదినమున ధ్వజారోహణమైన పిదప తిరుమల నుండి దిగి మహానగరమై రాజాస్థానమైన శ్రీశుకపురియందు (తిరుచానూరునందు) విజయము చేసియుండి ప్రతిదినము ప్రాతస్సాయంకాలములందు వాహనములతోడ వీథులందు ఊరేగి సమస్తోపచారములంది ఉత్సవసేవాపరుల నుజ్జీవింపజేసి తొమ్మిదవ యుత్సవమున సాయంకాలమున తిరుమల ఆరో హించి ధ్వజావరోహణము స్వీకరించు విధముగ చేసిన నియ మమును శ్రీభగవద్రామానుజాచార్యులవారు చింతించి, ఈ దివ్య దేశమునందే (తిరుమలయందే) ప్రతి సంవత్సరమున స్వామి బ్రహ్మోత్సవము జరిపింపవలెనని సంకల్పించిరి. స్వామి పుష్కరిణికి తూర్పుతీరమున దక్షిణోత్తరముగ ఒక క్రోసు నిడివిగల ఒక శ్రీవీథి నిర్మించి అందుకొందరు కైంకర్యపరులు నిత్యవాసము చేయునట్లేర్పాటు చేయించి ఉత్సవకాల మారంభింపగానే ఆ వీథి యందు ఉత్తరాభిముఖముగ బయలుదేరి మరలి దక్షిణా భిముఖముగ విజయము చేయునట్లు నియమము చేసిరి.

*(ఇంకా ఉంది)*

## సుమతి శతకం

**కూరిమి గల దినములలో**
**నేరములెన్నడును గలుగనేరవు మఱి యా**
**కూరిమి విరసంబైనను**
**నేరములే తోచుచుండు నిక్కము సుమతీ!**

**పరస్పరం స్నేహమున్న రోజుల్లో తప్పులెప్పుడూ కనిపించవు. ఆ స్నేహం చెడిపోగానే అన్నీ తప్పులుగానే కనబడుతుంటాయి. ఇది నిజం.**

# పురాణాల ఆవశ్యకత

- డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణ మూర్తి

వేదాలలోని విషయవిజ్ఞానం ప్రజలందరికీ సులువుగా అర్థమయ్యేటట్లు అందించటంకోసం పురాణాలేర్పడ్డాయి. వేదాల్లో జ్ఞానం సూత్రప్రాయంగా ఉంటే, పురాణాలలో అది భాష్యరూపంలో ఉంది. అందుచేతనే పురాణాలను పంచమ వేదంగా భాగవతం పేర్కొంది.

ఇతిహాసపురాణాని పంచమం వేదమీశ్వరః ।
సర్వేభ్య ఏవ వక్త్రేభ్యః సస్పృజే సర్వదర్శనః ॥
- భాగవతం 3.12.39.

ప్రప్రథమంలో బ్రహ్మ సమస్తశాస్త్రాలను పురాణాల రూపంలోనే చెప్పాడని, ఆ తర్వాతే వాటిని స్వరబద్ధంచేసి సూత్ర ప్రాయంగా మంత్రరూపంలో ప్రవచించాడని మత్స్య పురాణం చెబుతోంది. 'ఇతిహాస పురాణాభ్యాం వేదం సముప బృంహ యేత్' అనే ప్రమాణాన్ననుసరించి ఇతిహాస పురాణాదుల చేతనే వేదార్థాన్ని నిర్ణయించాలి. సంశయగ్రస్తులైన సజ్జనులను ఉద్ధ రించడానికి, వేదార్థాలను వివరించడానికి వ్యాసభగవానుడు భాగవతాది అష్టాదశపురాణాలను, ఉపపురాణాలను రచించాడు.

యది విద్యా చ్చతుర్వేదాన్ సాంగోపనిషదాన్ ద్విజః ।
న చేత్పురాణం సంవిద్యాత్ నైవ స స్యాద్విచక్షణః ॥

అనే ప్రమాణాన్ననుసరించి సర్వశాస్త్రాలను తెలుసు కొన్నప్పటికీ, భగవత్తత్త్వాన్ని నిరూపించే పురాణాలను తెలుసుకోక పోతే మానవుడు జ్ఞాని కాలేడు. "వేదోపబృంహణార్థాయ తాన్యస్థాపయత ప్రభుః" అని చెప్పినట్లుగా పురాణాలు వేదాల లోని విశిష్ట విషయాలను విడమరచి చెప్పడానికి ఏర్పడినవే కాని ఇవి ఎవరికి తోచినట్లు వారు వ్రాసిన గ్రంథాలు కావు. పురాణాలకంటే విజ్ఞాన దాయకాలు సారస్వతంలో మరెచ్చటా కనపడవు.

## సందేశం

అష్టాదశ పురాణేషు వ్యాసేన కథితం ద్వయమ్ ।
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్ ॥

శ్లోకార్థేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః ।
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్ ॥

మానవుడు తన సంకల్పాలు, ఆలోచనలు, మాటలు, పనుల వలన మరొక జీవికి ఉపకారం చేయడమే పుణ్యం. అపకారం చేయడమే పాపం. ఇదే పురాణాల సారాంశం. వ్యాస భగవానుడు ఈ విధంగా మనకు ధర్మానికి కొలబద్దనిచ్చాడు. లోకంలో ధర్మాధర్మాలు, పుణ్యపాపాలు, మంచిచెడులు రెండే ఉన్నాయి. మంచిని ఆచరిస్తూ, చెడు చేయకుండా ఉండటమే సర్వధర్మాల సారాంశం. ఇదే సర్వమానవాళికి వ్యాసభగవానుని దివ్యసందేశం.

## ప్రయోజనం

ఇవి జాతి సంప్రదాయాలను బలపరుస్తాయి. గౌరవప్రతిష్ఠలను ఇనుమడింపజేస్తాయి. ధర్మాన్ని ప్రబోధిస్తాయి. సంఘవ్యవస్థను సుస్థిరం చేస్తాయి. మానవుని అనుభూతులకు, ఆవేశాలకు, ఆశలకు, ఆశయాలకు, అంతరంగానికి, అన్వేషణకు మణిదర్పణాలు 'పురాణేతిహాసాలు'. ఇవి విశ్వవిశ్వాంతరాళాల లోని మహాద్భుత విషయాలను చెబుతాయి. మహాత్ముల జీవితా లను వర్ణిస్తాయి. విశేషానుభవాలను తెలియజేస్తాయి. మత-సాంఘికాచారాలను వివరిస్తాయి.

నేటి వైజ్ఞానికయుగంలో పురాణాల ప్రయోజనం ఏమిటి? అని అనుకోవడం ఆలోచనారహితం, అవాస్తవం కూడ. ఈ పురాణవాఙ్మయమే లేకపోతే సమాజాన్ని ఉజ్జీవింపజేసే కళలు కాని, శాస్త్రాలుకాని, సృష్టిస్థితి వివరాలు తెలిపే విశేషాలు కాని గ్రహించటం అశక్యం. ఖగోళ-భూగోళాలు, గ్రహస్థితి గతులు, నక్షత్రమండల వివరాలు, ధృవమండల స్వరూపాలు, గ్రహమండలాల కొలతలు, నదీనదసముద్రాల ప్రస్తావన-విస్తారాలు, సంగీతం, సాహిత్యం, కవిత్వం, వాద్యభేదాలు, నృత్యనాట్యాది విభేదాలు, వ్రతాలు, తపస్సులు, పుణ్యక్షేత్రాలు, తీర్థాలు, పర్వకాలాలు - ఇవి అని అననేల ఈ విశ్వంలోని

సర్వవిషయాలను పురాణవాఙ్మయం స్పృశించక, విమర్శించక, విడువలేదనడం నిస్సంశయం.

యుగభేదం లేకుండా సమాజానికి సార్వకాలిక సత్యం, హితం బోధించడమే వీటి ప్రధాన ఉద్దేశ్యం. పురాణరహస్యాలను చక్కగా గ్రహిస్తే నేటి సమాజం ఎంతగానో పురోగమించగలదు. ఈనాడు మానవసమాజంలో లోపించినవి, మనకెంతో అవసరమైన విషయాలెన్నింటినో పురాణాలు తెలియజేస్తున్నాయి. బాగా విచారిస్తే ఈ పురాణగ్రంథ పాఠన, పఠన, శ్రవణాదులు లోపించడమే నేటి సమాజంలో కట్టెదుట తాండవిస్తున్న అనేక దౌర్జన్యాలు, అవినీతి, పెద్దలయెడ గౌరవ ప్రపత్తులు లేకపోవడం మొదలైన ఎన్నో అనర్థాలకు కారణమని తెలుస్తుంది.

## సామాజికత

పూర్వం దేవాలయాలు, మఠాలు, పాఠశాలలు, రాజాస్థానాలు- రచ్చపట్లు మొదలైన స్థానాల్లో పురాణప్రవచనాలు జరుగుతుండేవి. రాజులు, సంపన్నులు వీటిని ప్రోత్సహించి ప్రజానీకాన్ని చైతన్యవంతం గావించేవారు. పురాణాలను వినడం వలన ప్రజల్లో నీతివర్తన, ధార్మికదృష్టి, దైవభక్తి మొదలగు లక్షణాలు పెంపొందేవి. ఆస్తికబుద్ధికల భారతీయులు, ఈ పురాణాలను విని, పుణ్యపాపదృష్టికలవారై స్వధర్మాచరణం చేసేవారు. దేవతారాధన, యజ్ఞయాగాది క్రియలను ఆచరించేవారు. వర్ణాశ్రమధర్మాలను పాటించేవారు. పరిపాలకులు వీటిననుసరించి ప్రజాపాలన చేసేవారు. ప్రాజ్ఞులైన విద్వాంసులు పురాణధర్మాలను ప్రజలకు బోధించి వాటిలోని ధర్మసేతువులను కాపాడేవారు. స్త్రీలు పురాణాలు విని ఆచారాది నియమాలను పాటించేవారు. ప్రభువులు వీటిని విని నీతిధర్మ పరాయణులయ్యేవారు. పిల్లలు వీటి ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకునేవారు. ఇంతెందుకు? ఆ రోజుల్లో పురాణాలు సర్వవిధవిజ్ఞానానికి మూలకందాలుగా ఉండేవి.

ఆ కాలంలో ప్రజలు తమ జీవయాత్రకు కావలసిన విషయాలన్నింటిని పురాణాలనుండే గ్రహించేవారు. ఎవరి ధర్మాలను, ఎవరి వృత్తులను వారు ఆచరిస్తూ జీవితాన్ని తృప్తిగా, సుఖమయంగా చేసుకొనేవారు. ఆ రోజుల్లో పురాణశ్రవణ ప్రభావంవలన ప్రజల మానసిక ప్రవృత్తి ధర్మైకబద్ధమై, మర్యాద నతిక్రమించేది కాదు. ఈ మహాగ్రంథానుసంధానంతో విశాల భరతఖండంలో ఎందరో యోగులు, భక్తులు, సిద్ధులు, జ్ఞానులు, దేశభక్తులు, మహాత్ములు ప్రభావితులై, మానవకోటిని ముందుకు నడిపించారు. సంఘము, వ్యక్తి ఎవరు ఏవిధంగా ప్రవర్తించాలో స్పష్టంగా ఉదాహరణలతో మిత్రునివలె అనేక దృష్టాంతాలతో పురాణాలు మనకు కర్తవ్యాన్ని ఉపదేశిస్తాయి. అభ్యుదయాన్ని అందిస్తాయి. ఇంకనూ భగవదనుగ్రహసాధనాలైన భక్తి జ్ఞాన వైరాగ్యాలను బోధిస్తాయి.

కాని, రానురాను వీటి ప్రచారం అంతరించింది. ఇవి కల్పితాలనే భావం ఏర్పడింది. వీటిని పుక్కిటి పురాణాలన్నారు. వీటిపై విమర్శలధికమై విశ్వాసం సన్నగిల్లింది. ఆస్తికత నశించి, నాస్తికత ఏర్పడింది. దానివలన పుణ్యపాప విచక్షణపోయి, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు పెరిగినాయి. ధార్మికదృష్టి తగ్గి, ఐహిక వాంఛాసక్తి ప్రబలింది. దైవప్రీతి- పాపభీతి- సంఘనీతి నశించి, మానవత్వం మాసిపోయి, రాక్షసత్వం పైశాచికత్వం ప్రబలినాయి.




కావున, నేటి సమాజాభివృద్ధికి, అభ్యున్నతికి, మానవుడు సత్య- శౌచ- దాన- దయాది సద్గుణాలను సంపాదించి, తోటి మానవుల శ్రేయస్సాధనకై పాటుపడడానికి, హింస- దౌర్జన్యం మొదలైన వికృత పైశాచిక గుణాలను పారద్రోలి ప్రపంచంలో సుఖశాంతులను నెలకొల్పడానికి **'పురాణ ప్రవచన'** ప్రచారం ఎంతో ఆవశ్యకం.

# ధర్మాచరణ ప్రశస్తి

– డా॥ కె.అన్నపూర్ణ

**ధారణాద్ధర్మ మిత్యాహుః ధర్మేణ విధృతాం ప్రజాః ।
యస్మాద్ధారయతే సర్వం త్రైలోక్యం స చరాచరమ్ ॥**

జగత్తును ధరించునట్టిది (కాపాడునట్టిది) కావున దానికి **'ధర్మమని'** పేరు. చరాచర ప్రాణులతో కూడిన ముల్లోకములను కాపాడునది కావున ఆ ధర్మమే ప్రజలు సురక్షితులుగా ఉండుటకు మూలము.

భిక్షుతాడిత అయిన శునకము రామునితో సంభాషించిన సందర్భంలో వాల్మీకి ధర్మాన్ని గురించి వివరించాడు. రామాయణంలోని ఉత్తరకాండలో ధర్మాన్ని గురించి ఈ విధంగా చెబుతారు–"రాజు ధర్మాన్ని అనుసరిస్తే అతని శత్రువులు అణగారి పోతారు. అప్పుడు ఆ ప్రభుత్వంయొక్క పాలన ప్రజానురంజకంగా వుంటుంది. ధర్మం దుష్ట శిక్షణకు, శిష్టరక్షణకు సాధనమవడం నిశ్చయం. ఈ ధర్మం అత్యంత శ్రేష్ఠమైనది. దీనిని ఆశ్రయించిన ధర్మనిరతులు మరణించిన పిదప కూడా సత్ఫలాలను పొందుతారు. ధర్మాన్ని ఆచరించినవారికి ఈలోకంలో దుర్లభమైనది ఏదీ లేదు. దానం చేయడం, భూత దయ కలిగి ఉండడం, సత్పురుషులను గౌరవించడం, అన్ని వ్యవహారాలలోను ఋజుప్రవర్తనను కలిగి ఉండడం అనేవి పరమ ధర్మాలు. వాటిని రక్షించుకొన్న వారికి ఇహపరసౌఖ్యాలు కలుగుతాయి" అని చెప్పి సమస్త ధర్మాత్ములకు రాముడే ఆదర్శ ప్రాయుడు. రాముని ధర్మమార్గము లోకవిదితము. దానిని సత్పురుషులంతా ఆచరిస్తూ ఉంటారు. "రాముడు సకల ధర్మాలకు ఆలంబనమైనవాడు. జలధివలె గుణనిధి అయినవాడు" అని రాముని ధర్మనిరతిని ప్రస్తుతించాడు.

కృతయుగంలో నాలుగు పాదాలతో నడిచిన ధర్మం కలియుగం వచ్చేసరికి ఒకే పాదంతో నడుస్తున్నది. రాజ్యం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లుతోంది అంటే దానికి కారణం ఆ రాజ్యంలోని ప్రజల, రాజుల ధర్మాచరణ మాత్రమే. రామాయణకాలం నాటికి ధర్మం సర్వత్రా వ్యాప్తి చెంది ఉంది. అధర్మం అనే మాటే లేదు. అందుకే ధర్మభూయిష్టమైన రాజ్యం అని చెప్పేందుకు బదులుగా 'రామరాజ్యం' అని అంటూ ఉంటారు. రామాయణంలోని పాత్రలన్నీ ఆదర్శమైనవే. రామాయణంలో భ్రాతృప్రేమ, దాంపత్య ధర్మం, రాజధర్మం, సేవక ధర్మం, మిత్ర ధర్మం మొదలైనవి చిత్రించబడ్డాయి.

రాముని వంటి కొడుకు, సీతవంటి ఇల్లాలు, లక్ష్మణ భరతశత్రుఘ్నుల వంటి సోదరులు, అసమానమైన సుగుణాలను కలిగి ఆచంద్రతారార్కం తరగని కీర్తిని గడించుకున్నారు. అన్నింటినీ మించి **'రామోవిగ్రహవాన్ ధర్మః'** అని మూర్తీభవించిన ధర్మమే రాముడట. మరి ఇక అధర్మానికి తావెక్కడిది? ఈ పరిస్థితే యుగభేదం కారణంగా మహాభారత కాలం నాటికి కొంతమార్పును పొందింది. ధర్మానికి హానికలిగే పరిస్థితులు కొద్దిగా తలెత్తడంతో వాటిని నివారించవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

హితబోధలు, ఇతర ప్రయత్నాలు దానికి అవసరమైనట్లుగా మనకు కనిపిస్తుంది. శ్రీకృష్ణుడు భగవద్గీతలో ***"ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"*** అన్నాడు. భారతంలో ధర్మరాజు ధర్మానికి మారుపేరు.

చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థకామమోక్షాలలో 'ధర్మం' మొదటిది. సమాజంలోని వివిధవర్గాలవారు పాటించాల్సిన ఆచారవ్యవహారాలను ధర్మశాస్త్రాలు తెలియజేస్తాయి. వేదాలలోని విషయాలే ధర్మశాస్త్రాల్లో విశదీకరించబడ్డాయి. ధర్మం ఎంతో విస్తృతమైనది. ఆశ్రమ ధర్మాలు, వర్ణ ధర్మాలు మొదలైనవి ఎన్నో ఉన్నాయి.

బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాశ్రమాలుగా ఆశ్రమధర్మాలు విభజించబడ్డాయి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులుగా వర్ణధర్మాలు విభజింపబడ్డాయి. ఆశ్రమ ధర్మాలను ఒకదానివెనుక మరొకటి నిర్వర్తిస్తూ మోక్షప్రాప్తిని పొందవచ్చు. మోక్షాన్ని కాంక్షించేవారు ఈ ఆశ్రమధర్మాలు అనే సోపానాలను తప్పక అధిరోహిస్తూ క్రమంగా మోక్షాన్ని చేరుకోవాలి. అప్పుడే జీవితం పరిపూర్ణమవుతుంది. వర్ణధర్మాల విభజన ఆయా వ్యక్తులు చేయగలిగినపనులు, చేయదగినపనులు, వృత్తులను అనుసరించి జరిగింది. ధర్మం ఎంతపటిష్టంగా నెలకొనివుంటే రాజ్యం అంతసుభిక్షంగా ఉంటుంది.



ముల్లోకాలను కాపాడేది 'ధర్మమే'

ధర్మాచరణ ఇహపర లోకాలలో శ్రేయస్సును కూర్చడమే కాదు, జ్ఞానప్రాప్తిని కూడా కలిగిస్తుంది. భారతంలో కౌశికుడనే మునికి ధర్మవ్యాధుడు ధర్మాన్ని బోధిస్తాడు. ధర్మవ్యాధుడు మాంసవిక్రేత అయినా, హింస, అహింసల గురించి, ధర్మం గురించి బోధిస్తాడు.

ధర్మాన్ని గురించి మనం తెలుసుకోవడం అసాధ్యమనీ, శ్రుతిప్రమాణాలద్వారా, వృద్ధాచార నిదర్శనాలద్వారా తెలుసుకోవచ్చని అంటాడు. ధర్మవ్యాధుడు కౌశికునికి బోధించగలిగేంత జ్ఞానం తనకెలా కలిగిందో ఇలా వివరిస్తాడు– "నాకు వేరే దైవం అంటూ ఎవరూలేరు. నా తల్లిదండ్రులే నాపాలిటి దైవం. వారికి సేవ చేయడంవల్ల ఇటు వంటి జ్ఞానాన్ని పొందగలిగాను" అంటాడు.


చివరకు –

"జనని జనకుడు సద్గురు దనలు దాత్ము
దనగ నియ్యేవురును నేగృహస్థుచేత
సుగతి వాంఛ ప్రసాదితు లగుదురట్టి
వాడ జూవె ధర్మాత్ముండు వసుధమీద"

అని కొసమెరుపుగా ఒక పద్యం చెప్తాడు. తల్లి, తండ్రి, గురువు, అగ్ని, ఆత్మ అనే ఈ ఐదు ఏ గృహస్థుచేత సంతృప్తి చెందుతారో అటువంటి గృహస్థుడే ఈ భూమి మీద ధర్మాత్ముడు అని చెబుతాడు. దీని ప్రకారంగా తల్లిదండ్రులకు పుత్రునిగా, గురువునకు శిష్యునిగా తన ధర్మాన్ని నిర్వర్తించినవాడు ధర్మాత్ముడవుతాడు. ఎడతెగని ధర్మాచరణ, ధర్మంపట్ల అతనికిగల గౌరవం ధర్మవ్యాధుని గొప్ప జ్ఞానిగా తీర్చిదిద్దినాయి.

మనుచరిత్రలో ప్రవరుడు గృహస్థాశ్రమధర్మానికి ప్రతీకగా నిలుస్తాడు. అతిథి అభ్యాగతులను ఆదరిస్తూ, పార్వతీ పరమేశ్వరులవంటి తల్లిదండ్రులను తనభార్యతో కలిసి సేవిస్తూ ఉండేవాడు. వీటినిబట్టి చూస్తే ఏ స్థాయిలో ఉండేవారికి ఆ స్థాయిలో ధర్మాచరణ విధింపబడి ఉంటుందనేది స్పష్టమవుతోంది. తిక్కన రచించిన, అన్ని కాలాలకూ వర్తించే మానవ ధర్మాన్ని మేలుకొలిపే పద్యం భారతంలో ఈ విధంగా ఉంది.

"ఒరులేయవి యొనరించిన
నరవర అప్రియము తన మనమ్మునకగు తా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మ పథములకెల్లన్" అనేది.




ఎవరు మనకి ఏ పని చేయడం ద్వారా మనం బాధ పడతామో, మనం అదేవిధంగా ఇతరులపట్ల ప్రవర్తించక పోవడం, ఆ బాధ కలిగించే పనిని ఇతరులకు చేయకపోవడమే గొప్పధర్మమని చెప్పబడింది. ఒక మనిషి ఉన్నతికి తోడ్పడేందుకు ఇంతకుమించిన ధర్మాచరణ ఇంకేముంటుంది? ధర్మాచరణ వెనుక ఉన్న ముఖ్యోద్దేశం– మంచిని ప్రోత్సహించడం, మంచిని పెంచే ప్రయత్నం చేయడం.

'స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః' అని ఉంది. స్వధర్మాన్ని విడిచి పెట్టి భయంకరమైన పరధర్మాన్ని ఆచరించడంకంటే మరణమే మేలు. 'ధర్మో రక్షతి రక్షితః' ధర్మాన్ని మనం రక్షిస్తే అది మనలను కాపాడుతుంది. దీనిద్వారా ఒక విషయం విశదమవుతున్నది. ప్రతి మనిషికి ధర్మం తప్పనిసరిగా ఉంటుంది అది 'మానవధర్మం'. ఆ ధర్మాన్ని గుర్తించి ఆచరించడం మన కనీస ధర్మం.

"ధర్మో రక్షతి రక్షితః"

# ధ్యానం చేయడం ఎలా?

- డా॥ లక్ష్మీనారాయణ

ఆత్మజ్ఞానానికి నిరంతరం ధ్యానం అవసరం. దీనివల్ల మనస్సు స్థిరమవుతుంది. సర్వగతుడైన 'భగవంతుని'యందు మనస్సు నిలపడమే దీని పరమార్థం. గురువుకు నమస్కారం చేస్తే చాలదు. ఆత్మసమర్పణ చేసుకోవాలి. భక్తుడు తన ఇష్టదైవాన్ని నిష్కామబుద్ధితో ఆరాధిస్తే 'భగవంతుని' సాక్షాత్కరించుకోవచ్చు.

## ప్రార్థన ద్వారా 'ధ్యానం'

అలసి సొలసిన మనస్సుతో ధ్యానానికి కూర్చుంటే– మనస్సు నిద్రలోకి జారుకొనే ప్రమాదం ఉంది. కనుక మొదట ప్రార్థన ద్వారా భగవంతునిపై మనస్సును కేంద్రీకరిస్తే నిశ్చలమైన ఈ మనస్సు అప్రయత్నంగానే ఇష్టదైవధ్యానంలో లయమవుతుంది. ప్రార్థన యొక్క అసలు గమ్యం, చెల్లాచెదురైన ఈ మనస్సును ఒక దగ్గరకు చేరదీసి భగవంతునిపై ధ్యానంలో నిమగ్నం చేయడమే.

'ధ్యానం' చేయుటకు పరిసరాల విమర్శకూడదు.

సాధారణంగా మనం "పరిసరాలు అనుకూలంగాలేవు, ధ్యానం చేయడమెలా?" అని అనుకుంటూ ఉంటాం. ఆదర్శవంతమైన పరిస్థితులు, పరిసరాలు అనేవి ఎక్కడా ఎప్పుడూ ఉండవు. ఏదో ఒక అసౌకర్యం ఉండవచ్చు. అంత మాత్రాన పరిసరాల గురించి విమర్శించి, మథనపడి 'ధ్యానం' ఆపకూడదు. అలాంటి పరిస్థితుల్లోనే మనం ధ్యానానికి ఉపక్రమించాలి. ఎంతో గందరగోళ పరిస్థితుల మధ్య కూడా మనం నిద్రించడానికి ప్రయత్నించుట లేదా? అలాగే... పరిస్థితులు ఏ రకంగా ఉన్నా మనం ధ్యానం చేయడానికి ప్రయత్నించాలి. దాన్ని అభ్యసించాలి.

ఇది ఎలా సాధ్యం అంటే– నిద్రపోయే ముందు మనం చేసేటట్లే, మన మనస్సుని పరిసరాల నుంచి వేరుపరచాలి. అభ్యాసం వల్ల ఇది సాధ్యపడుతుంది. అంతేకాదు. మనకు శారీరకమైన కష్టాలు కూడా ఉంటాయి. కొంతమందికి ధ్యానానికి కూర్చుంటే తలనొప్పి అని, ఒళ్లునొప్పులు అనీ ఏదో ఒక రోగం ఉందంటారు. కాని భగవంతుని ధ్యానించడం మాత్రం ఆ వంకతో ఆపకూడదు.

## శరీరానికి ముందుగా శిక్షణ ఇవ్వండి

సాధ్యమైనంతవరకూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నించాలి. శ్రీకృష్ణభగవానుడు ధ్యానయోగ అధ్యాయంలో ఇలా అంటాడు.

"ఆహారవిహారాల్లోనూ, కర్మలోనూ, నిద్రలోనూ, జాగ్రదవస్థలోనూ నియమ నిష్ఠలతో ఉండేవాడికి యోగం చాలా సులభం. అది అతని శోకాన్ని అంతం చేస్తుంది."

ఎక్కువ తక్కువలను త్యజించి మధ్యే మార్గాన్ని అనుసరించాలి. ఆధ్యాత్మిక పథంవైపు పయనించే సాధకుడికి ఇది (ధ్యానం) శక్తినీ, తేజాన్ని ఇస్తుంది.


శరీరానికి సుశిక్షణ ఇవ్వాలి. అలాగే మన ఇంద్రియాలకు, మనస్సుకు, అహానికి కూడా శిక్షణనివ్వాలి. ఆహారం విషయంలో చాలాజాగ్రత్తగా ఉండాలి. అతిగా తినటాన్ని త్యజించాలి. మీ శరీర తత్త్వానికి సరిపడా, దానిని చక్కటి స్థితిలో ఉంచే ఆహారాన్ని తీసుకోవాలి. శరీరారోగ్యానికి ఆహారాన్ని భుజించడంతో పాటు, జీర్ణించుకోవటం, విసర్జించటం మొదలైన ప్రక్రియలన్నింటికి మూలాధారమైన కడుపుకి ప్రత్యేకంగా, అన్ని అంగాలకూ సమానంగానూ వ్యాయామం కావాలి. సరిపడా సమతులాహారం తీసుకుంటే ఈ ప్రక్రియలన్నీ వాటంతటఅవే సక్రమంగా జరుగుతాయి. అప్పుడు సంపూర్ణారోగ్యం సమకూరుతుంది.

## 'ధ్యానం' చేయడమెలా?

నిశ్చలంగా కూర్చుని క్రమం తప్పకుండా ధ్యానం అభ్యసించాలి. ఒక్కరోజు కూడా మానకూడదు. మనస్సు మారాం చేసే శిశువులాంటిది. ఎప్పుడూ చపలంగానే ఉంటుంది. ఇష్టదైవం మీద లేక నీవు ఎన్నుకున్న ఆదర్శం మీద తిరిగి తిరిగి నీ మనస్సు ఏకాగ్రంగా ఉండేటట్లు ప్రయత్నించాలి. చివరకు ఆ పరమాత్మలో నీవు తప్పక లీనమవుతావు.

ఈ అభ్యాసాన్ని రెండు మూడు సంవత్సరాలు క్రమం తప్పకుండా చేస్తే అనిర్వచనీయమైన ఆనందాన్ని నీవు అనుభవిస్తావు. మనస్సు ఏకాగ్రతను పొందుతుంది. ప్రారంభంలో 'ధ్యానం' యొక్క అభ్యాసం చాలా చప్పగా ఉన్నట్లు అనిపిస్తుంది.

# 'ధ్యాన' ప్రారంభదశలు



**ధ్యానానికి మనం నిశ్శబ్దంగా కూర్చుందామని అనుకొన్నప్పుడు ఎన్నో అవరోధాలు మనస్సులో ఏర్పడతాయి. ఒక్కొక్కప్పుడు ధ్యానానికి కూర్చున్నప్పుడు కొన్ని సమయాలలో మనం ఎంతోశాంతిని అనుభవిస్తాం. అయితే మరికొన్నిసార్లు ధ్యానానికి కూర్చొన్న క్షణంలోనే మనస్సు ఎంతో వ్యాకులతను పొందుతుంది. అలా మన ఇంద్రియాలు విశృంఖలంగా ప్రవర్తించటం ప్రారంభిస్తాయి. మనస్సులో ఎంతో అశ్లీలమైన భావాలు ఉద్భవించడం ప్రారంభిస్తాయి. ధ్యానం ఎంతో కఠినమైనదిగా తోస్తుంది. అయినా అలవాటు చేసుకోవడం వల్ల సులువు అవుతుంది.**

**ప్రథమంగా శారీరకమైన పవిత్రత. దీని తర్వాత ఇంద్రియాల పవిత్రత, మనః పవిత్రత, చివరకు అహంకారానికి కూడా పవిత్రత. ఇంకొక విధమైన సంఘర్షణ కూడా మనం మనస్సులో చూస్తాం. మన ఆలోచన ఒకవైపు వెళ్తుంది. మన ఉద్రేకాలు వేరే వైపు, మనకార్యశక్తి మరోవైపు, దీనికి తోడు మన అహం మూఢంగా ప్రవర్తిస్తుంది. 'అహం' అన్నది ఒక గాలిబుడగ లాంటిది. కాని ఈ బుడగకి స్వాతిశయం చాలా ఎక్కువ. ఇతర బుడగల్నేకాదు, సముద్రాన్నే మర్చిపోయి, తనంతటతాను స్వార్థపరంగా ఎదగాలని కాంక్షిస్తుంది. దీన్ని చాలామంది జనుల్లో మనం గమనిస్తాం.**

**ఈ విధంగా మన ముందర ప్రత్యక్షమయ్యే ఈ అవ రోధాల్ని, సమస్యల్ని చూసి మనం అధైర్యపడకుండా నిత్యం 'ధ్యానం'ను సాధన చేస్తూవుంటే ఈ జగదాత్మల ఆత్మ అయిన ఆ 'పరమాత్మ' దర్శనం తప్పక కలుగుతుంది. మరియు మానసిక, శారీరక ఆనందం కలుగుతుంది.**

కానీ.... సాధన చేయగా, చేయగా నీవు అనిర్వచనీయమైన ఆనందసాగరపు అలలలో ముంచి వేయబడతావు. మనస్సుకీ శరీరానికి కూడా విశ్రాంతి లభిస్తుంది. 'భగవద్దర్శనం' అన్నది చాలా సునాయాసమైన పని. ప్రశాంతమైన మనస్సుతో, ధ్యాన ముద్రలో ఉండి భగవంతుణ్ణి పిలు! తప్పక పలుకుతాడు.

'ధ్యానం' యొక్క ఫలితం అనివార్యం. భక్తి ఉన్నా లేక పోయినా ధ్యానాన్ని తప్పక కొనసాగించినట్లయితే మీరు తప్పక ఫలితాలను పొందుతారు. కొంతకాలం క్రమం తప్పకుండా ధ్యానాన్ని కొనసాగిస్తే భక్తి దానంతట అదే తప్పక వస్తుంది. ధ్యాన అభ్యాసంతో నీ మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగవు తుంది. ప్రారంభదశలో 'ధ్యానం' అన్నది, మనస్సుతో యుద్ధం చేయడంలాంటిది. ఎంతో శ్రమతో వ్యాకులమైన మనస్సును లొంగదీసుకొని 'భగవంతుడి' చరణాల దగ్గర ఉంచాలి. ముందు మెల్లగా ప్రారంభించి, క్రమేణా నీ కృషిని పెంచి, తీవ్రం చేయాలి. క్రమమైన అభ్యాసంతో మనస్సు ఏకాగ్రత కుదిరి ధ్యానం సులువవుతుంది. ధ్యానావస్థలో ఎన్నిగంటలు గడిపినా ఏమి శ్రమ అనిపించదు. గాఢనిద్ర తర్వాత మనిషి శారీరకంగా, మానసికంగా ఎంత సేద దీరుతాడో 'ధ్యానం' తర్వాత అంత గానూ సేదదీరి, దాని తర్వాత ప్రగాఢమైన అనుభూతిని పొందు తాడు. శరీరమూ, మనస్సు సన్నిహిత సంబంధం కలిగున్నాయి. శరీరం వ్యాకులత చెందితే మనస్సు కూడా కలవర పాటు పడుతుంది. 'ధ్యాన' మన్నది అంత సులువైన విషయం కాదు. కామం, క్రోధం, లోభం మొదలైన వాటిని బలంగా శాసించకపోతే మనస్సు చాలా అనిశ్చయంగా ఉంటుంది. 'ధ్యానం' చేస్తేనే కాని మనస్సును లోబరచుకోవటం కుదరదు. మనస్సుని నిగ్రహిస్తేకాని ధ్యానం కుదరదు. అందు వల్లనే మొదట 'నన్ను మనసుని నిగ్రహించనీ, తర్వాత ధ్యానం చేస్తాను' అని నీవు అనుకుంటే ఏనాటికీ కృతార్థుడవు కాలేవు. మనస్సుని నిగ్రహించడం, ధ్యానం చేయడం ఒకే కాలంలో జరగాలి.

ధ్యానానికి కూర్చునేటప్పుడు మనస్సులో కలిగే కోరిక లన్నీ కేవలం స్వప్నాలని భావించాలి. వాటిని మిథ్యగా చూడాలి. అప్పుడు అవి మనస్సుకి ఏనాడూ తగులుకోలేవు. నేను 'అతి పవిత్రమూర్తిని' అని భావించు. ఈ విధంగా క్రమేణా పవిత్రతా భావం నీ మనస్సుని ఆక్రమిస్తుంది.

భగవంతుణ్ణి సాక్షాత్కరింప చేసుకోవాలి అన్న ఆకాంక్ష నీకు ఉంటే ఆధ్యాత్మిక సాధనలను ఓర్పుతోనూ, పట్టుదలతోనూ చేయి. కాలక్రమేణా నీకు తప్పక జ్ఞానోదయం అవుతుంది.

ఈ విధంగా పరమాత్మ దర్శనం కలిగిన తరువాత ఆ జ్ఞానాన్ని పొందిన ఆత్మ-శాంతినీ, మోక్షసిద్ధిని పొంది, వీటిని తన తోటి వారందరితోనూ పంచుకుంటుంది.

# మన దేవాలయాలు- 'ఆగమాలు'

- శ్రీ డి.నరసింహాచార్యులు

## ఆగమోక్తం

మనదేశంలో ఎక్కువగా శైవ, వైష్ణవ, శక్తి ఆలయాలు ఉన్నాయి. శివాలయాలు శైవాగమాన్ని, వైష్ణవాలయాలు శ్రీవైష్ణవా గమాన్ని, శక్తి సంబంధమైన అమ్మవారి ఆలయాలు శాక్తేయ సంబంధమైన ఆగమాలను అనుసరించి కొనసాగుతున్నవి. వివిధ ఆలయాలు వాటి వాటి ఆగమ సంప్రదాయాలను అనుసరించి కొనసాగటమే ఉత్తమమార్గం. దేవాలయాల నిర్వహణను ఆరా ధనా విధులను సక్రమంగా నిర్దేశించేవి 'ఆగమశాస్త్ర గ్రంథాలు'.

వైష్ణవాలయాల ప్రతిష్ఠ ఆరాధనాది కైంకర్యములు ఏవిధంగా జరగాలో నిర్దేశించు శ్రీవైష్ణవ ఆగమాలు రెండు అవి 1)శ్రీవైఖానసాగమము 2)శ్రీపాంచరాత్రాగమము. ఇవి రెండు శ్రీవైష్ణవసిద్ధాంతానికి రెండుకళ్ళు. విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవక్త శ్రీవైష్ణవ జగద్గురువు అయిన శ్రీరామానుజాచార్యులు ఈ రెండు ఆగమాలను ప్రమాణంగా అంగీకరించినారు.

## శ్రీవైఖానసాగమము

విఖనసమహర్షిచే చెప్పబడినది 'వైఖానసాగమము'. ఇందులో శ్రీమహావిష్ణువును ఆరాధించే పద్ధతిని, ఆరాధించేవారి జీవనవిధానము చెప్పబడినది. ఈ ఆగమమునకుమూలము వేదమే. వేదమును అనుసరించి ఈ సిద్ధాంత మేర్పడినది. శ్రీమహావిష్ణువు యొక్క ఆజ్ఞచే విఖనసమహర్షి ఈ శాస్త్రగ్రంథాన్ని రచించినాడు. అతడు గృహ్య, శ్రౌత, సూత్ర గ్రంథాలను కూడా రచించినాడు. విఖనస మహర్షి చెప్పిన ఈ ఆగమసూత్రాలు వేదమంత్రాలను అనుసరించి విష్ణు ఆరాధనలు చేసే విధానాన్ని నిర్దేశించినది. విఖనసమహర్షి పరమప్రామాణికుడు. జైమినీయ బ్రాహ్మణము, ఆర్షేయ బ్రాహ్మణము, తైత్తిరీయ ఆరణ్యకములు విఖనసమహర్షిని ఆయన ఆగమగ్రంథాన్ని ప్రముఖంగా పేర్కొన్నవి. బోధాయనుని ధర్మసూత్రములను, అగ్నివేశుని గృహ్య సూత్రములను, శ్రౌత సూత్రములను తమ ఉపాసనామంత్ర గ్రంథములయందు పొందుపరచి విఖనసమహర్షి ప్రామాణి కుడుగా గుర్తించబడెను. విఖనస మహర్షి ప్రముఖశిష్యులైన కశ్యపుడు, అత్రి, మరీచి, భృగువు ఆగమశాస్త్రగ్రంథాలను రచించారు.

మనుస్మృతి, నారదస్మృతి గ్రంథాల వలె కశ్యప, అత్రి మహర్షుల వైఖానసాగమ గ్రంథాలు ప్రామాణికంగా గుర్తించ బడినవి. వైఖానసాగమము విష్ణ్వారాధనను ప్రముఖముగా తెలుపుచున్నది. దేవాలయ స్థలఎంపిక, దాని నిర్మాణము, ప్రతిష్ఠామూర్తుల వివరములు, ఆరాధనా పద్ధతులు, ఉత్స వాదులు, ప్రాయశ్చిత్తాది కర్మలు ఈ ఆగమమునందు వివరించ బడినవి. మరీచి 'విమానార్చన కల్పం' నందు వైఖానసాగమ రచయితలను గూర్చి చెప్పారు.

వైఖానస సంహితలు మొత్తం 60 వరకు ఉన్నాయి. ఇందులో 17 గ్రంథాలు సమగ్రంగాను, మిగతావి పాక్షికంగా నేడు లభిస్తున్నాయి. ఈ సంహిత గ్రంథాలు చాలా వరకు శ్లోకరూపములో కొనసాగినవి. కశ్యప మరీచి గ్రంథాలు మాత్రం గద్యరూపంలో ఉన్నవి.

పై ఆగమగ్రంథాలన్నీ దేవాలయాలకు సంబంధించిన అన్ని విషయములు వర్ణించినవి. ఉత్సవాదులలో జరిపే అభిషే కాదులు, వాటిని నిర్వహించే పద్ధతులు ఇందులో చెప్పబడినవి. మరీచి, భృగువు, అత్రి, కశ్యపుడు ఉత్తర భారతదేశమునకు చెందినవారు. చాలామంది కల్పసూత్ర గ్రంథకర్తలు ఔత్తరాహులే. అయినప్పటికీ ఉత్తర భారతదేశంలో వైఖానస ఆగమము ఎక్కువ ప్రాచర్యంలో లేదు.

శ్రీవైఖానసాగమ కల్పసూత్రములను కృష్ణయజుర్వేదము లోని తైత్తిరీయశాఖకు చెందినవారు ఎక్కువగా అనుసరించు చున్నారు. కృష్ణయజుర్వేదము దక్షిణభారతదేశంలో ఎక్కువ ప్రాచుర్యమును పొందింది కనుక దక్షిణభారతదేశములో చాలా వైష్ణవ ఆలయాలలో వైఖానసాగమ పద్ధతి కొనసాగుచున్నది.

శ్రీవైఖానసాగమము ఆచరణ ప్రధానమైన శాస్త్రము, అత్రి, మరీచి, మొదలగు ఈ ఆగమ రచయితలు దేవాలయ సంబంధమైన అన్ని విషయాలను తమ గ్రంథాలలో సమగ్రంగా వివరించారు. ఇక కశ్యపుడు శ్రీవైఖానసాగమ గ్రంథాలకు

సంపూర్ణమైన హేతుబద్ధమైన వ్యాఖ్యానాన్ని రచించినాడు. శ్రీవైఖానసాగమము నందు భగవంతునికి చేసే ప్రతి సేవకు వేదమంత్ర ములు నిర్దేశించబడియుండుట విశేషము. శ్రీవైఖానస మంత్రప్రశ్న విభాగమునందు ఆ మంత్రములన్నియు పేర్కొన బడినవి.



## పాంచరాత్రాగమము

శ్రీపాంచరాత్రాగమము కూడా శ్రీవైష్ణవ ఆగమమే. దేవాలయములలోనూ, గృహములలోనూ, శ్రీమహావిష్ణువును అర్చించే విధానమును, అందుకు సంబంధించిన మంత్ర ములను బీజాక్షరయుక్తములైన మంత్రముల వివరములు శ్రీపాంచరాత్రాగమమునందు వివరించబడినవి. దీనికి కూడా వేదమే ప్రమా ణము. కుల, మత, వర్ణ, లింగ భేదములు ఏవీ లేకుండా సమస్తజనులు శ్రీమహావిష్ణువును ఈ ఆగమానుసారము అర్చించదానికి వీలుగా ఉన్నది. ఈ ఆగమశాస్త్రమంత్రములు సర్వ జనులు అధ్యయనము చేసి శ్రీమహావిష్ణువును ఆరాధించవచ్చును. శ్రీపాంచరాత్రాగమము ప్రకారము శ్రీవైష్ణవదీక్షను అనగా పంచ సంస్కారములను, సమాశ్రయణమును పొందిన వారెవరైనా శ్రీమహావిష్ణువును ఆరాధించి తరించ వచ్చును. పంచసంస్కారములు, శ్రీవైష్ణవదీక్ష ప్రధానార్హతలుగా గుర్తించబడింది.

శ్రీమన్నారాయణుడే స్వయముగా ఈ పాంచరాత్రాగమ శాస్త్రమును బ్రహ్మకు ఉపదేశించినాడు. మహాభారతంలోని శాంతిపర్వమునందు "ఇదం మహోపనిషదం చతుర్వేద సమన్వితం సాంఖ్యయోగకృతం తేన పాంచరాత్రాను శబ్దితం నారాయణ ముఖోద్గీతం నారదో శ్రావయన్మునిః" అని కలదు. ఇది చతుర్వేదములతో కూడినది. శ్రీమన్నారాయణుని ముఖము నుండి ఆవిర్భవించినది. సాంఖ్యయోగ సమన్వితమైనది. "పంచేత రాణి శాస్త్రాణి రాత్రియంతే మహాంత్యపి" అని సూర్యప్రకాశంతో చంద్రుడు రాత్రి కనిపించకపోయినట్లు శ్రీపాంచరాత్రాగమ జ్ఞానముచే ఇతరములన్నియు ప్రకాశహీనములైనవి. పంచ భూతములు, పంచతన్మాత్రలు, అహంకారము, బుద్ధి, అవ్యక్తము లను ఐదు, రాత్రివంటి అజ్ఞానమును కలిగించునవి. పాంచరాత్ర ఆగమజ్ఞానముచే రాత్రి వంటి ఆ అజ్ఞానము తొలగును– అని పాంచరాత్రాగమ నిర్వచనము. పాంచరాత్రాగమ ప్రసక్తి భారత భాగవత గ్రంథాదులలో కలదు. ఈ ఆగమశాస్త్రము పంచసంస్కారము పొందిన ప్రతి మానవుని ఉపాసనార్హుని కావించుట విశేషము. యామునాచార్యుల ఆగమ ప్రామాణ్య గ్రంథనందు పాంచరాత్రాగమమును గూర్చి వివరించారు.


108 దివ్యతిరుపతులలో కొన్నిటి యందు శ్రీవైఖాన సాగమము, మరికొన్నింటి యందు పాంచరాత్రాగమము కొన సాగుచున్నవి. శ్రీరంగక్షేత్రములో పాంచరాత్రము, తిరుమల శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో శ్రీవైఖానసాగమము అనుసరింప బడుచున్నవి. భగవద్రామానుజులు ఈ రెండింటినీ అంగీకరిం చారు.

# మేధానిపుణుడు 'బుధుడు'

- శ్రీ మల్లంపల్లి రామలింగ శాస్త్రి

బుధుడు మిశ్రమ రుచుల కారకత్వం కలిగినవాడు. వర్ణం ఆకుపచ్చ. జాతి వైశ్య. అధి దేవత విష్ణువు. గుండ్రని ఆకారం. పరిమాణం పొడుగు. శరదృతువును ఉత్తరదిక్కునూ సూచిస్తూ, పృథ్వీ తత్త్వం కలిగినవాడు. గ్రహ సంఖ్య అయిదు. రత్నం పచ్చ. లోహం ఇత్తడి-కంచు. గుణం రజోగుణం కలిగినవాడు. ఆశ్లేష, మూల, రేవతి నక్షత్రములకు, మిథున-కన్యారాశులకు అధిపతి.

బుధుడు వాక్కుకు, ఉపన్యాసంలో నైపుణ్యం, లలిత కళలు, గణితశాస్త్రం, వాణిజ్యం, అర్ధశాస్త్రం, ఖగోళ శాస్త్రం, వ్యాపారశాస్త్రం, వ్యాకరణం, జ్యోతిషం, వివిధరకాల భాషలు, శిల్పి, మంత్రం, తంత్రం, వివేకం, పుస్తకప్రచురణ, గ్రంథాలయం మొదలైనవాటికి కారణం.



**బుధగ్రహ స్తోత్రం**

**ప్రియంగు కళికాశ్యామం। రూపేణ ప్రతిమం బుధం।**
**సౌమ్యం సత్వగుణోపేతం। తం బుధం ప్రణమామ్యహం॥**

దౌత్యం, వైద్యం, మధ్యవర్తిత్వం మొదలైన వాటికి కారకత్వం వహిస్తాడు. నాభి, నరము, స్వరపేటిక, చర్మమును సూచిస్తాడు, కనుక నరముల బలహీనత, మూర్ఛ, చెవి, మెదడుకు సంబంధించిన వ్యాధులకు కారకత్వం వహిస్తాడు.

అన్ని విధాల ఆకుకూరలు, కాయకూరలకు కారకత్వం వహిస్తాడు. సభా నిర్వాహకులు, ప్రజాసంబంధిత వ్యవహారికులు, ప్రచారకులు, ఉపన్యాసకులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు మొదలైన వాటికి కారకత్వం వహిస్తాడు.




వాక్సంబంధిత వృత్తులకు బుధుడు కారకుడు. మేధావులు, పండితులు, చారిత్రకులు, గుమస్తాలు, చిత్రకారులు, రాయబారులు, విద్య, గణికులు, దస్తూరి, నవలలు, వ్యాసాలు, కల్పితాలు, చిన్నపుస్తకములు, యువకులు, ప్రకటనలు, వ్యాపారం, వాహనములు, నిఘంటువులు, సత్యవాదముకు బుధుడు కారకత్వం వహిస్తాడు.

బుధుడు నాలుగు భుజాలు కల్గి, పసుపు పచ్చని మాలను ధరించి, కత్తి, డాలు ఆయుధాలు చేపట్టి ఉంటాడు. బుధుడు సింహాన్ని అధిరోహించి ఉంటాడు.

## బుధుని అనుగ్రహం కొరకు...

బుధుని ప్రతిమను ప్రతిష్ఠించి పాలతో కలిపిన అన్నాన్ని నైవేద్యంగా పెట్టాలి. అదేవిధంగా, అధిదేవత- అధిష్ఠాన దేవతలైన విష్ణువు, దుర్గలకు పులిహోర, వడపప్పులను నైవేద్యంగా పెట్టాలి. గ్రహానుకూలతకు బంగారం దానమివ్వాలి, బుధుని ఆరాధించుటకు శ్రావణశుక్ల పంచమి, వైశాఖ పూర్ణిమలు మంచిది.

**ఆచరించవలసిన వ్రతం-** సత్యనారాయణ వ్రతం.

**పారాయణం చేయవలసిన స్తోత్రాలు-**

బుధ అష్టోత్తరశత నామావళి, విష్ణుసహస్రనామం.

**ధరించవలసిన మాల -** తులసిమాల.

**తీసుకోవలసిన దీక్ష -** గోవింద దీక్ష

ఈ విధంగా వాక్పటుత్వానికి, బుద్ధికి ముఖ్యకారకుడైన బుధగ్రహాన్ని అర్చించి సకలశుభాలను పొందుతాం.



తిరుమల ఆలయంలోని హనుమంతుడు

## తిరుపతి
## శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల దృశ్యమాలిక
## (2021, మే 18 నుండి 26 వరకు)





## తిరుమల
## శ్రీపద్మావతీశ్రీనివాసుల పరిణయోత్సవ దృశ్యమాలిక
## (2021, మే 20 నుండి 22 వరకు)





## తిరుచానూరు
## శ్రీపద్మావతీఅమ్మవారి వసంతోత్సవాల దృశ్యమాలిక
## (2021, మే 24 నుండి 27 వరకు)





## శ్రీనివాసమంగాపురం
## శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి వసంతోత్సవాల దృశ్యమాలిక
## (2021, మే 29 నుండి 31 వరకు)





# తిరుమల తిరుపతి దేవస్థానములు




తిరుపతి శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయంలో 2021, మే 14వ తేదీ 'అక్షయతృతీయ' నాడు
శాస్త్రోక్తంగా నిర్వహించిన 'శ్రీలక్ష్మీనారాయణ పూజ'




తిరుమల వసంతమండపంలో 2021, మే 25వ తేదీన శాస్త్రోక్తంగా నిర్వహించిన
'శ్రీభీషణ నృసింహపూజ' కార్యక్రమంలో పాల్గొన్న తి.తి.దే. అదనపు ఈ.ఓ. శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి దంపతులు




ఇటీవల తిరుమల వేదవిజ్ఞాన పీఠంలో జరిగిన 'పూర్వాషాఢ నక్షత్రేష్టి యాగం'లో పాల్గొన్న
తి.తి.దే. అదనపు ఈ.ఓ. శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, తి.తి.దే బోర్డు సభ్యులు శ్రీ శివకుమార్ మరియు ఇతర అధికారులు

# వీణాపాణి క్షేత్రం-అనంతసాగరం

- శ్రీ విశ్వామిత్ర

"కాశ్మీరేతు సరస్వతీ" అనే సూక్తిని బట్టి కాశ్మీరమున మొదటి సరస్వతీ క్షేత్రమున్నదని తెలియుచున్నది. రెండవది తెలంగాణాలోని ఆదిలాబాదు జిల్లా బాసరలోని 'జ్ఞానసరస్వతి' పేరుగల మహాసరస్వతి. మూడవది కూడా తెలంగాణాలోని సిద్ధిపేట జిల్లా అనంతసాగరం గ్రామ శివార్లలోని శ్రీసరస్వతీ క్షేత్రం. ఇది దేశంలోనే మొదటి నిలుచున్న 'వీణాపాణి' క్షేత్రంగా ప్రసిద్ధి గాంచినది.

ఇక్కడ సహజసిద్ధంగా మూడు నీటిగుహలు ఉన్నాయి. అందలి నీటికి క్రిమిసంహారక శక్తి కలదని జనుల ప్రగాఢ విశ్వాసం. అవి 'రాగి దోనె', 'పాల దోనె', 'చీకటి దోనె' అనే పేర్లతో నిరంతరజలంతో అలరారుతున్నాయి. ఇందులో స్నానం చేస్తే దీర్ఘవ్యాధులు పోతాయని నమ్మేవారు వేల సంఖ్యలో ఉన్నారు. ఎంత కరువు వచ్చినా ఈ గుహలలో జలం పుష్కలంగా లభిస్తుంది. ఇటువంటి మహిమగల స్థలంలో పూర్వం యక్షులు, మునులు ఉండేవారని ప్రతీతి. అందుకే దీనికి సమీపంలోనే 'జక్కుల చెలిమె' అనే పేరుతో వేరొక దోనె ఉండటాన్ని బట్టి ఈ విషయం సత్యమని భావించాలి.

ఈ కొండపైనే సంపూర్ణ శిలానిర్మితమై చూపరులకు ప్రాచీనదేవాలయ భ్రాంతిని కలిగించే సుందర దేవాలయములో కుడివైపున సౌభాగ్యలక్ష్మి, ఎడమవైపున దక్షిణకాళి కలిగి మధ్యలో సరస్వతీ నిలుచుని వీణాపాణియై యుండి, అశేష భక్త జనుల సేవలందు కొనుచున్నది. ఆమె అనుగ్రహమును కోరి వచ్చి, సేవించే అనంత భక్తజనానికి కోరిన కోరికలను తీర్చే కల్పవల్లి సరస్వతీదేవి.

మాటలు రాని చిన్న పిల్లలు, యువకులకు అమ్మవారి అనుగ్రహంతో మాటలు వచ్చినట్లు ఎందరో భక్తులు తెలుపుతున్నారు.

ఇక్కడ ఆంజనేయస్వామి క్షేత్రపాలకుడుగా ఉత్తరాభిముఖుడైయున్నాడు. ఇది అరుదైన విషయం.

అదే గుడిలో నిలుచున్న శివలింగము కలదు. పానవట్టము, షట్కోణములు కలిగియున్న అది నిలుచున్న






లింగమని శాస్త్రము చెప్తోంది. ఇక్కడ ఒక స్తూపమందిరంలో పశ్చిమాభిముఖంగా శ్వేతశిలా సరస్వతీ మూర్తి ప్రతిష్ఠించబడి యున్నది.

సమతలంగా చేసి నిర్మించిన ఈ క్షేత్రంలో సరస్వతీ దేవాలయమునకు దక్షిణంలో సుమారు 1000 మంది కూర్చో గలిగిన యజ్ఞశాల కలదు. ఇక్కడ ఉదయం 6 గంll ల నుండి మధ్యాహ్నం 12 గంll ల వరకు నిత్యపూజా కార్యక్రమాలు జరుగుతాయి. భక్తులు, యాత్రికులు దర్శనము చేసుకొంటారు. 'అక్షరస్వీకారము' అనే కార్యక్రమం జరుపుకొనుటకు భక్తులు వేలసంఖ్యలో ఇక్కడికి విచ్చేస్తారు.

ఈ ప్రదేశం కరీంనగర్-మెదక్ జిల్లాల సరిహద్దులో కొన్ని గజముల వ్యత్యాసముతో 'సిద్ధిపేట' జిల్లాలో ఉంది. హైదరాబాదు రామగుండం (రాజీవ్ రహదారి) రోడ్డుపై 120 కి.మీ. దూరంలో గల 'శనిగరం' అనే స్టేజీ వద్ద దిగి, శ్రీసరస్వతీ క్షేత్రమునకు ఆటోలో గాని, నడచి కాని వెళ్ళవచ్చు. భక్తులకు నివాసవసతులు కలవు.

1990 జనవరి 31వ తేదీన ప్రతిష్ఠించబడిన ఈ క్షేత్రం, ప్రఖ్యాత అష్టావధాని శ్రీఅష్టకాల నరసింహరామశర్మ గారిచే నిర్మితమైనది. ఈ క్షేత్రంలో దేవీనవరాత్రముల కంగంగా త్రిరాత్రోత్సవములు మూలానక్షత్రమ్ సరస్వతీ పూజతో ఆరంభమవుతాయి. విజయదశమినాడు వేలసంఖ్యలో భక్తులు దేవిని దర్శిస్తారు.

ప్రతి మాఘశుద్ధపంచమికి ముందు వెనకలుగా (మొత్తం మూడురోజులు) క్షేత్రవార్షికోత్సవములు, అసంఖ్యాక జనుల దర్శనానందములతో మహావైభవముగా సాగుతాయి. ఉత్సవవేళలలో సాహితీసాంస్కృతిక కార్యక్రమాలు జరుప బడుతాయి. దేవిని దర్శించి తరించగలరు.

*'ఓం సరస్వత్యై నమః'*



# సద్వాణీ సూక్తి

– శ్రీ మాదిరాజు రంగారావు

**ఉద్యోగినం సతత మత్ర ముపైతి లక్ష్మీ**
**ర్దైవేన దేయ మితి కా పురుషా వదన్తి**
**దైవం నిహృత్య కురు పౌరుష మాత్మ శక్త్యా**
**యత్నే కృతే యది న సిధ్యతి కోఽత్ర దోషః?**

ఉద్యోగం అంటే ఏదో ఒక పని లేదా వ్యాపకం. ఇది వ్యక్తి జీవితంలో అనివార్యమయింది. దీనిని వరించిన మనిషిని, లక్ష్మి స్వయంగా చేరుతుంది. సర్వసంపదలూ చేకూరుతాయి.

కొందరు బద్ధకస్తులూ, పని చేయనివారూ, నిరాశా జీవులూ దైవం చేతనే అన్నీ ఇవ్వబడతాయని అంటారు. పూర్తిగా దైవం పైనే బాధ్యతను వేయడాన్ని నియంత్రించడం అవసరం. దీన్ని పరిహరించాలి.

స్వయంశక్తి చేత పురుషప్రయత్నం "చేయుము" అన్న హితం చెప్పబడింది.

ఒకవేళ ఫలం చేకూరకపోతే దోషమేముంది?

ఏ దోషమూ లేదు. నష్టమూ ఉండదు.

మానవ జీవితంలో తొలి నుండి ఎన్నో కారణాల వల్ల దైవభావన ప్రవేశించింది. ఇది విడదీయరానిదిగా అల్లుకున్నది. ఈ నేపథ్యంలో మనిషి మానసికంగా దైవంపై ఆధారపడడమూ ఎక్కువయింది. ఇది మానవ చరిత్రలో సాంస్కృతికమైన గతుల్ని తీర్చిదిద్దిన మాట వాస్తవం.

ఈ సూక్తి దీన్ని తగ్గించి, మానుష శక్తి పై విశ్వాసానికి ప్రేరేపిస్తుంది. మానవ ప్రయత్నం అవసరాన్ని తలపిస్తుంది. ఇందులో దైవభావనను పూర్తిగా నిరాకరించడం జరుగలేదు. ముందుగా మానవ ప్రయత్నానికి ప్రాధాన్యమీయ బడింది.

సమస్య అంటే భయపడేవారు, వెనుకంజ వేసేవారు మానవయత్నం పట్ల శ్రద్ధ వహించరు. వారిలో ఈ సూక్తి మానవశక్తియుక్తుల పట్ల అవగాహనకు తోడ్పడుతుంది. ఉత్సాహాన్ని ప్రేరేపిస్తుంది. కార్యోన్ముఖుల్ని చేస్తుంది.

ఇది మంచి పరిణామంగా భావించవచ్చు.

ధారావాహిక - 3

# శ్రీమద్భగవద్గీత

- ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ

*గత సంచిక తరువాయి భాగం...*

ఎన్నో సద్గుణాలు ఉన్నాయి. మనం కూడ దానం చేస్తాం. మంచి పనీ చేస్తాం. మంచిపని చేసేటప్పుడు దానితో పాటు ఒక రూపాయో, రెండు రూపాయలో దానం చేస్తాం. దానం చేయటం మంచి గుణమే. కాని, దానితో పాటు మనసులో యేముంది అని ఒక్కసారి పరిశీలించుకుంటే, 'నేను ఇస్తున్నాను. వాడు పుచ్చుకుంటున్నాడు'. మొహంలో అప్రసన్నత. అంతా ఏదో గర్వం నిండిపోతుంది. వాడి జీవితాన్ని ఉద్ధరించి నట్లుగా ఒక్కసారి అలా పారేస్తున్నాము. రెండు గుణాలు కలసి నవి. మంచిగుణం కలిసింది, దుర్గుణం కలిసింది. పరోపకారం చేశాం. చేసిన తరువాత ఏం చేస్తాం? సామాన్యంగా వాడిని తిడతాం. ఉపకారం చేస్తూ వాడిని తిడతాం. ఉపకారం చెయ్యట మెందుకు? తిట్టటమెందుకు? అన్న ప్రశ్నరాదు. ఉపకారం చేశాం కాబట్టే క్రింద నుంచి రాక్షసగుణం కూడ వస్తుంది. ఇలా అనేక సద్గుణాలు, దుర్గుణాలు కలసిపోయి అవి విడదీయరాని సంబంధంతో ఉంటున్నాయి. అవి యుద్ధం చేసుకొని చివరికి దుర్గుణాలు గెలిచేరోజు కూడ వస్తుంది. అలా దుర్గుణాలు గెలిచేరోజు వచ్చిందంటే మనం రాక్షసులమై పోయినట్లే! మళ్ళీ ఏదో పైజన్మ ఆపైజన్మలో రాక్షసజన్మ అనేంలేదు. మనకు రాక్షస జన్మవచ్చేసినట్లు అయిపోయింది. ఇట్లాంటి సందర్భం రాకూడదు. మానవులు జాగ్రత్తగా ఉండాలి. దేవతల సద్గుణాలను పెంచు కోవాలి. వాళ్లలో యేమైనా లేశమాత్రంగా దుర్గుణాలున్నా అవి మనకొద్దు. రాక్షసుల దుర్గుణాలు వద్దే వద్దు! మనష్యుల సద్గుణాలు బాగా పెరగాలి. ఇంతకంటే పైకి వెళ్లాలి. దేవస్థానం దాన్ని మించిన స్థానం. దాన్ని మించిన స్థానం సాక్షాత్తు అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడి యొక్క పాదపద్మాలకు చేరాలి. పరమాత్మను తెలుసుకోవాలి అనే ఉద్దేశ్యం ఈ బ్రహ్మ గారి ఉపదేశం అని మనకు స్పష్టంగా తెలుస్తున్నది. ఈ స్ఫూర్తి తోనే శ్రీకృష్ణపరమాత్మ మనకు భగవద్గీతామృతాన్ని ఉపదేశిం చాడు, అని మనం అర్థం చేసుకోవాలి. అర్జునుడు అనేది ఒక వ్యాజం మాత్రమే. అర్జునుడిలో ఉన్న గుణాలన్నీ మనలో ఉన్నాయి. అర్జునుడిలో యేం గుణాలున్నాయి? అర్జునుడు యేమి ఆలోచించాడు? అనే విషయాన్ని మనం విస్తారంగా ఈ అధ్యాయంలో తెలుసుకోబోతున్నాము. మనం కూడ అలాంటి సందర్భంలో అలాగే ఆలోచిస్తాము. అని పరమాత్మ అర్థం చేసుకొని మనందరికి కూడ ఉపయోగించేట్లు ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయి దక్కేటట్లుగ ఉపదేశం చేశాడు. ఇటువంటి ఉపదేశాన్ని మనం కేవలం శ్రీకృష్ణపరమాత్మ అర్జునుడికి చేశాడు, శ్రీకృష్ణపరమాత్మ మన అర్చావతారమూర్తి యైనటువంటి శ్రీవేంకటేశ్వరస్వామి మనకే చేస్తున్నాడు అనే భావనతో కనుక మనం విన్నట్లయితే, అలా మనం భావన చేసినట్లయితే, ఆ అర్థాన్ని అనుసంధానం చేసుకున్నట్లయితే శ్రీకృష్ణపరమాత్మ శ్రీమద్భగవద్గీతామృతాన్ని ఉపదేశించినటు వంటి ఫలితం పూర్తిగా దక్కుతుంది, మనకు సత్ఫలితం దక్కుతుంది. ఇది ప్రాథమికమైన విషయం. ఈ భావనతో మనం గీతామృతాన్ని బాగా అర్థం చేసుకున్నప్పుడు, భగవద్గీతామృతంలో మనం నిన్నటిరోజున ధృతరాష్ట్రుడు సంజయుణ్ణి అడిగిన సంగతి తెలుసుకున్నాం. ఆ యుద్ధరంగంలో యెవరెవరు యేమేంచేశారు? ఏయే రకమైన విచారణ జరిగింది అని అడిగాడు. ఆ దానికి సమాధానంగా సంజయుడు ఇలా అంటున్నాడు.

> దృష్ట్వాతు పాండవానీకం వ్యూఢం దుర్యోధనస్తథా।
> ఆచార్యముపసంగమ్య రాజా వచనమబ్రవీత్॥

అని సంజయుడు చెబుతున్నాడు- 'అక్కడ సేనంతా నిల్చుని ఉంది. అక్కడ పాండవులు గూడ ఉన్నారండి. దుర్యోధ నుడు మీ అబ్బాయిగారు ద్రోణాచార్యుని దగ్గరకు వెళ్ళి ఆయనతో మాట్లాడడం ప్రారంభించారండి' అన్నాడు. ఆయన అడిగిందే మిటి? ఈయన చెబుతున్నదేమిటి అని ఒకసారి చూద్దాం. అయనేం అడిగాడు - ధృతరాష్ట్రుడు.

> ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।
> మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ॥

పాండవులు, నావాళ్లు వీళ్లందరూ కలసి యేంచేశారు? అని అడిగాడు. ఈయన దుర్యోధనుడు యేం చేశాడో చెబు తున్నాడు. అందరూకలసి యుద్ధం చేశారు అనైనా చెప్పాలి, అందరూకలిసి చర్చలు చేసుకున్నారనైనా చెప్పాలి. శంఖనాదం

చేశారండి అనైనా చెప్పాలి. దుర్యోధనుడి గురించి యెందుకు యెత్తుతున్నాడు? ఇక్కడ మనం సంజయుడి యొక్క సమాచార నైపుణ్యం అన్నిటిని శ్రద్ధగా అర్థం చేసుకోవాలి. ఆయన రాజ సేవకుడు. జాగ్రత్తగ రాజసేవకుని అభిప్రాయాన్ని గమనించాడు. రాజు అభిప్రాయం యేమిటి అంటే 'ధర్మక్షేత్రే' అన్నాడు గదా! అది ధర్మాలను పెంపొందించే క్షేత్రం. మానవుడు సామాన్యంగా ఆలోచించటం వేరు. ధర్మక్షేత్రానికి వెళ్లి యోచించటం వేరు. మనం కూడ అనుభవిస్తుంటాం ఏదైనా క్షేత్రాలకు వెళ్లినప్పుడు ఒకరకమైన మంచి ఆలోచనలు పెరుగుతాయి. దానితో మరొక మంచి క్షేత్రానికి వెళదాం, లేదా ఇంకొన్ని రోజులుందాం లేదా అంగప్రదక్షిణం చేద్దాం మరొక సేవ చేసుకుందాం అనే మంచి భావాలు కలుగుతూ ఉంటాయి. ఈ సందర్భంలో ఈ పాండవు లున్నారే వాళ్ళసలే ధర్మం పిచ్చి ఉన్న వాళ్ళు. వాళ్ళే మన్నా యుద్ధం వద్దు, ఈ హింసవద్దు, ఇదంతా వదిలేసుకుంటాము, మీ రాజ్యం మీరే తీసుకోండి అని మా అబ్బాయికి వదిలేసి వెళ్లారా. లేదా మావాడే ఆ ధర్మక్షేత్రానికి వెళ్లిన తరువాత మారిపోయి ఈ యుద్ధం వద్దులే, వాళ్ల రాజ్యం వాళ్లకిద్దాం అనే అభిప్రాయంలో యుద్ధం మానేసుకొని యేమన్నా వచ్చేసాడా (పొరపాటున), మన వాడు రాడు అని నమ్మకముంది వచ్చేస్తా డేమో అని ఓ చిన్న భయం కూడ ఉంది. వీళ్ళద్దరిలో యెవరు యేమి చేశారు? పాండవులు యుద్ధం మానుకొని వెళ్ళారా? లేదా మా పిల్లలు యుద్ధం మానుకొని వాళ్ళకు రాజ్యం ఇచ్చేశారా? ఇది ఆయన ప్రశ్న యొక్క తాత్పర్యం. ఆ ప్రశ్న తాత్పర్యాన్ని 'ధర్మక్షేత్రే' అనటంలోనే పట్టేశాడు చాలా తెలివైన వాడు మంచి సేవకుడు. సేవకుడికి సహజంగా ఆరాజు యేం చెబుతున్నాడు అనే అభిప్రాయం తెలిసి ఉండాలి. తెలిసి ఉన్నప్పుడు సేవకుడి ధర్మం సక్రమంగా జరుగుతుంది. పరిపాలనా వ్యవస్థ కూడ సక్రమంగా సాగుతుంది. రెండవది సమాధానం యేమని ప్రారంభిస్తున్నాడు. మీరేం కంగారు పడక్కరలేదు. మీ అబ్బాయి యుద్ధమేమి మానలేదు. యుద్ధంచేద్దామనే సంకల్పంలోనే ఉన్నాడు. కాబట్టి ఆ విషయంలో మీరు ధైర్యంగా ఉండచ్చు. ఇది మంచితనం. ఎందుకు పైన చెప్పబోయే దేమిటి? భీష్ముడు నిర్యాణం చెందాడు. భీష్ముడనే వాడు యుద్ధంలో పనికిరాడు. ఈ స్థితిలో ఈ విషయాన్ని మొదలే ఉచ్చరించకుండా ఆయనకి ప్రియమైనటువంటి దుర్యోధనుడి పేరు చెప్పి ఆయన్ను కాస్త శాంత పరిచాడు. ఇది సంజయుడి యొక్క మంచితనం. మూడవది. యేం చేస్తున్నాడు అంటే 'రాజావచన మబ్రవీత్' అన్నాడు. ధృతరాష్ట్రుడు జీవితమంతా బాధపడింది యే అంశం మీద అంటే దుర్యోధనుణ్ణి రాజు చేయాలి అనే అంశం మీద. కాబట్టి ఎలాగూ దుర్యోధనుడికి రాజ్యం దక్కేది లేదు. ఆయన తరపున ప్రధాన వీరుడొక్కడు పడిపోయాడు కాబట్టి ఇంక మీద రాజ్యం లేకపోయినా నా మాటతో నైన రాజు వింటాడు, అని ఈయన సంతోషించాడు, సమాచార నైపుణ్యాన్ని చూపిస్తు ఆయనేం చెప్తున్నాడు 'రాజా వచన మబ్రవీత్' 'దృష్ట్వాతు పాండవానీకం వ్యూఢం దుర్యోధనస్తథా'.

'ఆచార్యముపసంగమ్య రాజా వచన మబ్రవీత్' ఎవరి దగ్గర వెళ్ళి మాట్లాడాడు. భీష్ముడు సేనాపతి గదా! ఆయన దగ్గర కెళ్ళకుండా ద్రోణుడి దగ్గర కెందుకువెళ్ళాడు అని మీకు సందేహంకలగవచ్చు దానికి సమాధానం ద్రోణాచార్యుడు ఈయన గురువుకదా గురువు దగ్గరకెళ్ళాడు. భీష్ముడి దగ్గరకెళితే నేమి? ద్రోణుడి దగ్గర కెళితే నేమి? ఈయనా సేనాపతి కాబోతున్నవాడే. ఆ స్థాయివాడే. కాబట్టి ద్రోణాచార్యుడి దగ్గరకు వెళ్ళాడు అనటంలో దుర్యోధనుని స్వభావం, స్వరూపం ఇవన్నీ తెలిసినా, ప్రస్తుతానికి ఆచార్యుని దగ్గరకైతే వెళ్ళాడు అని సంజయుడు ఆయనతో చెప్పాడు. ఈ చెప్పటంతో మనం చాలా సూక్ష్మంగా తెలుసుకోవలసిన విషయం ఒకటున్నది. మనం సంకల్పం చేసే ముందు గురుప్రార్థన, తరువాతే శ్రీనివాస ప్రార్థన చేసుకుంటాం. అంటే శ్రీనివాసప్రార్థన కంటే ముందు గురు ప్రార్థన చేయాలి. మనల్ని శ్రీనివాసుని దగ్గరకు తీసుకువెళ్ళేది గురువే. మనకు గురువే ముందు, తరువాతే భగవంతుడు. ఆ భగవంతుడే గురువు రూపంలో మనకు వచ్చి ఉన్నాడు. మనకు దగ్గరగా ఉన్నదెవరు? గురువు. ఆయన యెవరి యొక్క రూపం? ఆయన యెందుకొచ్చాడు? గురురూపంలో పరమాత్ముని తెలియజేయటానికి వచ్చాడు. పరమాత్మదగ్గరకు తీసుకు వెళ్ళటానికి వచ్చాడు. తన రూపం దగ్గరకే తీసుకు వెళ్ళటా నికి వచ్చాడు. కాబట్టి మనం గురుప్రార్థన చేసుకుంటున్నాం ఆ విషయం ఎక్కడనుంచి తెలిసింది 'భగవద్గీత' దగ్గర నుంచే తెలిసింది. ఎట్లా భగవద్గీతలో ప్రారంభ శ్లోకం ప్రశ్నతో ధృతరాష్ట్రుడిది సమాధానం 'ఆచార్య ముపసంగమ్య' అనటంతో ఇది చాలా చిన్న వాక్యంలో కనిపిస్తుంది ఇది 'గురూప సదనం' 'గురూప గమనం' అనే పేరుతో ఉపనిషత్తులలో చాలా పెద్ద విషయంగా చెబుతారు.

*(ఇంకా ఉంది)*



దయగల హృదయమే 'దైవమందిరం'

# శ్రవణభక్తి

– డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ

అష్టాదశపురాణాలలో శ్రీమద్భాగవతం ఒకటి. ఈ భాగవతంలో చెప్పబడిన శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదన మనేవి నవవిధభక్తి రీతులు. ఇవన్నీ స్థూలదృష్టికి వేరువేరుగా కనబడినా విహంగ వీక్షణం చేస్తే అన్నీ ఒకటే.

నిచ్చెన ఎక్కేవేళ తొలిమెట్టు చివరిమెట్టు ఎలాగో, భక్తి రీతులలో శ్రవణం– ఆత్మనివేదనం చాలా ముఖ్యం. ఈ నవవిధ భక్తిరీతులకు 'సత్సాంగత్యం' వెన్నెముక.

## శ్రవణభక్తి గొప్పతనం

శ్రవణభక్తి అనగానే సామాన్యులకు కూడా 'పరీక్షిత్తు' గుర్తుకు వస్తాడు. ఇతడు ఉత్తర, అభిమన్యుల కుమారుడు. కురుక్షేత్రసమరం చివర అశ్వత్థామ 'అపాండవమగుగాక' అని 'బ్రహ్మశిర'మనే దివ్యాస్త్రం ప్రయోగించాడు. ఆ దివ్యాస్త్ర ప్రభావంతో ఉత్తర గర్భంలోని శిశువు సంతాపానికి గురి అయింది. అపుడు ఉత్తర, కల్యాణగుణోత్తరుడయిన హరిని చూచి–

'చెల్లెలి కోడల నీ మే
నల్లుడు శత్రువులచేత హతుఁడయ్యెను సం
ఫుల్లారవిందలోచన!
భల్లాగ్ని నణంచి శిశువు బ్రతికింపఁగదే'

అని ప్రార్థించింది. ఆ సమయంలో స్వామి అంగుష్ఠమాత్ర దేహుడై, గద చేతబట్టుకొన్నవాడై, శిశువును పీడించే సంతాపమనే చిచ్చు నణచి శిశువును రక్షించాడు. అతడే 'పరీక్షిత్తు'.

పరీక్షిత్తు ఒక రోజు వేటకు పోయాడు. కాని వేటలో ఒక మృగం రాజును నానాతిప్పలు పెట్టింది. రాజు ఎలాగయినా ఆ మృగాన్ని మట్టుపెట్టాలని వెంబడించాడు. మృగం మాయమయింది. రాజు అలసిపోయాడు. అతనికి అణచరాని దాహం మొదలయింది. తన దాహం తీరడానికి అడవిలో తచ్చాడుతుంటే దగ్గరలో శమీకుని ఆశ్రమం కనబడింది. రాజు సంతోషించాడు. తపోనిష్ఠుడైన మునిని తన దాహం తీర్చమని అడిగాడు. కాని హరిచింతనాపరుడైన ఆ మునికి రాజు రాక, అతని ప్రార్థనలు తెలియవు. అపుడు రాజు ఇదొక అవజ్ఞగా భావించాడు.

'కన్నులు మూసి బ్రాహ్మణుఁడు గర్వముతోడుత నున్నవాఁడు చే
సన్నలనైన రమ్మనడు సారజలంబులు దెచ్చి పోయఁడే
మన్ననలైనఁ జేయఁడు సమగ్రఫలంబులు పెట్టఁ డింత సం
పన్నత నొందెనే? తన తపశ్చరణా ప్రతిమప్రభావముల్' అని తలపోసి, దగ్గర్లో పడివున్న చచ్చిన పామును వింటికోపుతో ఎత్తి మునిమూపున పడవేసి, చక్కాపోయాడు. ఈ దృశ్యమంతా చూస్తున్న మునికుమారులు అడవిలోని శమీక పుత్రునికి తెలియజేశారు. శమీకపుత్రుడు తన ఆశ్రమానికి వచ్చి కోపంతో తండ్రి మెడలో చచ్చినపాము వేసినవాడు 'హర కేశవులడ్డుపడినా తక్షక విషంతో నేటికి ఏడవనాడు మరణిస్తాడని' శపించాడు. ఇంతలో శమీకమహర్షి మేల్కొని శృంగికుమారుని మందలించాడు. చివరకు ఈ వార్త రాజుకు తెలియజేయవలసిందిగా ఆనతిచ్చాడు. మునికుమారులు శృంగి శాపాన్ని పరీక్షిత్తుకు తెలియజేశారు.


శృంగిశాపంవల్ల పరీక్షిత్తు తనకు మరణం ఆసన్నమైనదని నిశ్చయించుకొన్నాడు. భూలోక స్వర్గలోక భోగంబులు హేయంబులుగా భావించాడు. రాజ్యం విసర్జించాడు. గంగానదీ తీరంలో ప్రాయోపవేశానికి సిద్ధమయ్యాడు. ఎందరో ఋషులు వచ్చారు. వారితో పరీక్షిత్తు ఏడు రోజులలో ముక్తి లభించడానికి ఏదైనా ఉపాయం సూచించమన్నాడు. అంతలోనే వ్యాసనందనుడైన శుకుడు కూడా రానే వచ్చాడు. శుకమహర్షిని పరీక్షిత్తు ప్రార్థించాడు.



'భూపతీ! ముక్తి రెండురకాలు. ఒకటి సద్యోముక్తి. రెండవది క్రమముక్తి. ఈ రెండూ కొత్తవేమీ కావు. వేదగీతాలలో చెప్పబడ్డవే. సంసారప్రవిష్టుడైన వానికి 'ముక్తి' భక్తివల్లనే సుసాధ్యం. భక్తిఫలాన్ని ప్రసాదించేవాడు హరి. అతడు అన్ని ప్రాణులలోను అంతర్లీనుడు. అందరికీ దగ్గరివాడు. సులభంగా సేవించదగినవాడు. అన్నివేళల వందనీయుడు. భక్తవత్సలుడు. ఎవడయితే నియతబుద్ధితో ఆత్మరూపుడయిన 'హరికథ' అనే అమృతాన్ని చెవులనే దొప్పలతో నిండుగా సేవిస్తాడో అతడు భౌతికమైన మలినదేహం వదలి విష్ణుని చరణారవిందయుగళం చేరుకొంటాడు. అంతెందుకు? ఖట్వాంగుడనేవాడు తనకు రెండు గడియలలో మరణమని తెలియగానే గోవిందకథాశ్రవణం చేశాడు. గోవిందకీర్తన చేశాడు. ముక్తి పొందాడు.' అని శుకుడు పరీక్షిత్తుతో చెప్పాడు. ముక్తికి భక్తిమార్గమే శరణ్యమనే విధివిధానం వివరించాడు. ఆపై మహావిష్ణుని లీలాభివర్ణనం చేస్తూంటే పరీక్షిత్తు శ్రద్ధగా శ్రవణం చేశాడు.

శుకమహర్షి తొమ్మిదిస్కంధాల భాగవతం వినిపించి, పదోస్కంధం ప్రారంభించేవేళ పరీక్షిత్తుదైన్యాన్ని చూచి "నాయనా! వినగలవా?" అన్నాడు. వెంటనే పరీక్షిత్తు 'అయ్యో! ఎంతమాట న్నారు' అని ఆవేదన పడ్డాడు. కృష్ణకథ వద్దనేవాడు పశుఘ్నుడే కదా! అంటూ పరీక్షిత్తు దశమస్కంధం వినడానికి సిద్ధమయ్యాడు.

సంస్కృతంలో కసాయివాణ్ణి 'పశుఘ్న' అంటారు. ఈ శబ్దానికి భాగవత వ్యాఖ్యాత శ్రీధరస్వామి 'ఆత్మవిచారం' లేని వాడని అర్థవిశేషం చెప్పారు. అచ్యుతుని కథామృతం ఎంత గ్రోలినా తృప్తి కలుగదు. అమరత్వాన్నిచ్చే సుధకూడా భగవత్కథ ముందు వెలవెలబోతుంది. అందువల్ల లోకంలో ప్రతివాడికీ





భగవత్కథాశ్రవణం ఆహ్లాదాన్ని పంచి ఇహపరాలను ప్రసాది స్తుంది. పైగా నాకు మరీ ముఖ్యమన్నాడు. అందువల్ల నిత్యం మృత్యుముఖంలో ఉండే కలియుగజీవులకు శ్రవణభక్తే ప్రథమో పాయం. శ్రవణభక్తి లేకపోతే సంసారసాగర తరణం సులభం కాదు. పైగా నైమిశారణ్యంలో శౌనకాది మహర్షులు ఎన్నో పురాణాదులను, వ్యాస శిష్యుడైన సూతుని ద్వారా విన్నారు. పైగా విన్నవారు అసామాన్యులు. యజ్ఞకర్మ నిరతులు –

కర్మణ్యస్మిన్ననాశ్వాసే ధూమ ధూమ్రాత్మనాం భవాన్ ।
ఆపాయయతి గోవిందపాద పద్మాసవం మధు ॥
(భాగ- ప్రథమ- 18 అధ్యాయం- 11వ శ్లోకం)

"సూతా! అమృతస్వరూపుడైన పరమాత్మవిశుద్ధవైభ వాన్ని వినిపించావు. యజ్ఞకర్మల్లో హోమధూమంతో పొగచూరి పోయాం. ఈ సత్రయాగం దీర్ఘకాలం దివ్యంగా సాగింది. గట్టెక్కిస్తుందన్న గురువాక్యాలు మాకు విశ్వసనీయమే. కానీ మధురాతిమధురమైన పరమాత్మకథాసుధ మమ్మల్ని అసార సంసారం నుంచి మానసికంగా కూడా తరింపజేసింది"- అని యజ్ఞ, దాన, తపో, జపాది మార్గాలకంటే పరమాత్మకథాశ్రవణ భక్తి మోక్షప్రదమనీ, రసానుభవాన్నిస్తుందనీ తీర్మానించారు.

అందుకే బాల్యాదిగా "వినదగునెవ్వరు చెప్పిన" అనే పద్యాలతో చదువును పుష్టి చేస్తున్నారు. ఆబాలగోపాలాన్ని ఉర్రూతలూపిన పదకవులు "వినరో భాగ్యము విష్ణుకథ' అని శ్రవణభక్తిని ప్రచారం చేశారు. త్యాగయ్యవంటి వాగ్గేయకారులు విశేషంగా, తమ చిత్తభ్రమరం పరమాత్మకథామకరందంలో ఆసక్తం కావాలని కోరారు.

భూలోకంలో శ్రీమద్భాగవత వ్యాప్తికి కారకుడు నారద మహర్షి, నవవిధ భక్తులను చెప్పిన ప్రహ్లాదునికీ, వాసుదేవుణ్ణి వశం చేసుకొన్న ధ్రువునికీ, మంత్రోపదేశం చేసినవాడు నార దుడే! భక్తిసూత్రాలు చెప్పినవాడు నారదుడు. అన్నమయ్య, త్యాగయ్యవంటి వాగ్గేయకారుల జీవనంలో పూర్ణత తెచ్చిన ఋషి కల్పుడు శ్రీనారదముని. నవవిధభక్తిమార్గాలను ఉదహరించ డానికి మూలమైన భక్తులందరి ముత్యాల్లాంటి వృత్తాంతాల్లో మణిసూత్రమైనవాడు నారదయోగి. ఆ మహర్షి తొలిజన్మలో దాసీపుత్రుడై సకాలంలో చాతుర్మాస్యవ్రత దీక్షితులైన మహ నీయుల మంచిమాటలు వినడంతో, అంతటి వాడయ్యాడు. కనుక శ్రవణభక్తి అన్నింటికీ మూలధాతువు. సాధనచతుష్టయ మనే (శ్రవణ- నిధి- ధ్యాస- దర్శనములు) వాటిలో 'వినుట' (శ్రవణం) తొలిమెట్టు. వైజ్ఞానికంగా ఈ శ్రవణాన్ని ఆర్షగ్రంథాలు

ప్రాయికంగా నామశ్రవణం, రూపశ్రవణం, లీలాశ్రవణం అని వర్గీకరిస్తున్నాయి.

## నామశ్రవణం

వాల్మీకి 'రామ' నామాన్ని జపించి, కిరాతులతోడి సాన్నిహిత్యంవల్ల వచ్చిన పశుత్వంనుండి ఋషిత్వాన్ని పొందాడు. తారకనామ శ్రవణంవల్ల జీవుడు దేవుణ్ణి చేరడానికి ప్రతిబంధకం తొలగించుకొంటాడని పార్వతికి పరమశివుడు ఉపదేశించాడు. పుణ్యగుణాలరాశి కాశిలో ప్రమథగణపతి శివుడు తన్ను ఆశ్రయించిన జీవుని చెవిలో అధిశ్రవణంతో ముక్తినిస్తున్నాడు. నారదమహర్షి, భాగవతమాహాత్మ్యంలో స్పష్టంగా సనకాదులకు వైకుంఠుని నామశ్రవణం కన్నా అన్యోపాయం లేదని చెప్పాడు. *"శ్రవణం సర్వధర్మేభ్యః వరం మన్యే తపోధనాః? వైకుంఠస్థా యతః కృష్ణ శ్రవణాద్ యస్య లభ్యతే?"*

"ఓ తపోధనులారా! కృష్ణనామశ్రవణం శ్రేష్ఠమైన ధర్మం. శ్రవణభక్తితో శ్రీవైకుంఠస్వామి సులభసాధ్యుడు. ఎటువంటి కష్టదశలలో ఉన్నా, పరమాత్మను పెద్దగా భావించనివారు, ఆయన రూపాన్ని గుర్తు తెచ్చుకోలేని వారుంటారు. ఆ దశలో వినికిడి వల్ల ఉన్న శక్తితో అప్రయత్నంగా భగవన్నామాన్ని ఆశ్రయిస్తారు. ఈ స్థితిలోనే అన్నమయ్య "ఆకటివేళల, అలపైన వేళలను, తేకువ హరినామమే దిక్కు మరిలేదు" అన్నాడు. ఈ సత్యం అజామిళుని వృత్తాంతంలో కూడా సుస్పష్టం. యమభటులను చూచి భయంతో "నారాయణ" అనే పేరున్న తన కుమారుణ్ణి పిలిచి తరించాడు. కనుక భగవన్నామంలోని స్వారస్యం అనుభవంలో రాకపోయినా వింటూ ఉండాలి. అందుకే ఆచార్యులు– *"నామశ్రవణా దన్యోపాయో, నహి పశ్యామో భవతరణే!"* అన్నారు. సంసారం పాముకాటు లాంటిది. మనిషిని చంపేస్తుంది. అతడు బతకాలంటే మంత్రం పఠించాలి. ఆ మంత్రమేదంటే 'కృష్ణమంత్రం' అన్నారు పెద్దలు. 'అన్నిటికి నిది పరమౌషధము వెన్నుని నామమే విమలౌషధము' అని అన్నమయ్య ఢంకా బజాయించి చెప్పాడు.

## రూపశ్రవణం

రూపశ్రవణం రెండు విధాలు. చెవిటివాడు భగవంతుణ్ణి గురించి వినలేడు. కానీ వాడు చూడడం ద్వారా అనుభూతి పొందుతాడు. ప్రకృతిలో మధుర శబ్దాలను వినలేకపోయినా, పరవశించిన వారిని, పుష్పించి ఫలిస్తున్న హరిత ప్రకృతిని చూచి, ఆత్మానందాన్ని పొందుతాడు. ఇదే సగుణ బ్రహ్మోపాసన వినడమని వేదాంతులు తీర్మానించారు. పుట్టు చెవిటివారికి పరమాత్మతత్త్వం, చక్షుశ్రవణం ద్వారా ఏర్పడుతుంది.

అలాగే రెండో విధమైన రూపశ్రవణం చూడనివాణ్ణి గురించి విని తరించడమే! క్రాంతదర్శులే కాలరూపుడైన పరమాత్మను దర్శిస్తారు. లోకంలోని సామాన్య భక్తులు పరమాత్మను చూడలేరు. కానీ భగవద్వైభవశ్రవణంవల్ల తరించిన శివభక్తులు, దేవీభక్తులు, ఇతర దేవతాభక్తులు వృత్తాంతాలు అత్యధికం.

శ్రవణం అనేకవిధాలు. విదర్భరాజతనయ రుక్మిణి చిన్నతనం నుండి కృష్ణుని రూపలీలా పరాక్రమాదులు వింటున్న తరుణి. ఆమెను కృష్ణుని కిచ్చి పెళ్ళి చేయడం తండ్రికి అంగీకారమే! కానీ, తమ్ముడు రుక్మి రుక్మిణిని తన స్నేహితుడయిన శిశుపాలునికి కట్టబెట్టాలని భావించాడు. తల్లిదండ్రులు నిస్సహాయులయ్యారు. స్వయంవరం నిశ్చయమయింది. అపుడు రుక్మిణి అగ్నిద్యోతనుని ద్వారా కృష్ణునికి సందేశం పంపింది. ఆ సందేశంలో ప్రత్యేకంగా –

*'ఏ నీ గుణము కర్ణేంద్రియంబులుసోక దేహతాపంబులు తీరిపోవు'* అని శ్రవణభక్తిని ప్రత్యేకంగా ప్రస్తావించింది. అప్పటిదాకా రుక్మిణి కృష్ణుని చూడలేదు. ఈ ప్రార్థన ద్వారా లక్ష్మీస్వరూపురాలయిన రుక్మిణి తాపత్రయనాశనం రూపశ్రవణంతో సాధ్యమని తెలియజేసింది. ఆలాగే గోదాదేవిచరిత్ర.

తమిళనాడులో శ్రీవిల్లిపుత్తూరు దివ్యదేశంలోని వటపత్రశాయికి పుష్పమాలాకైంకర్యం కొనసాగించేవాడు విష్ణుచిత్తుడు. ఆ మహాభక్తునికి తోటలో ఒకరోజు 'పసిబాల' కనిపించింది. సంతానం లేని విష్ణుచిత్తదంపతులు ఆ పసిబాలను గారాబంగా సాకినారు. బాల్యం నుండి ఆ పాప(గోద) విష్ణుభక్తురాలు. తండ్రిముఖతః 108 దివ్యదేశాలకథలను విని, శ్రీరంగనాథునిపై మరులు పెంచుకొంది. చివరకు వటపత్రశాయి ఆనతి మేరకు విష్ణుచిత్తుడు గోదతో శ్రీరంగానికి వెళ్ళాడు. ఆపై గోదాదేవీ శ్రీరంగనాథుల కల్యాణం జరిగింది. తండ్రి వర్ణించిన దివ్యదేశాలకథలు విన్న గోదాదేవి రంగనాథునే పతిగా వేడింది.



శ్రీవైష్ణవులు సంభావించే పన్నిద్దరాళ్వారులలో 'కుల శేఖరాళ్వార్' ఒకరు. అతడు కేరళదేశాధిపతి. ఇక్ష్వాకువంశీకుడు. శ్రీరామకథాశ్రవణ కుతూహలపరుడు. వైష్ణవజనం పట్ల అత్యంత ఆదరాభిమానాలు కలవాడు. అలాంటి కులశేఖరులు ఒకరోజు శ్రీమద్రామాయణంలో అరణ్యకాండలోని ఖరదూషణాదుల వృత్తాంతం వింటూ పరవశించిపోయాడు. ఆ కథాశ్రవణంలో లీనమై సైన్యాధిపతితో "రాముడొక్కడు 14వేల రాక్షసులతో తలపడుతున్నాడు. రాక్షసులు విశ్వాసఘాతకులు. స్వామికి ఎలాంటి ఆపదవస్తుందో? వెంటనే సైన్యం సిద్ధం చేయించు. నేను శ్రీరాములవారికి సాయంగా వెళతానని" శస్త్రధారి అయ్యా డట. ఎప్పటి రామకథ. అయితే రామాయణకథాసన్నివేశం చక్కగా వినడంతో మైమరపించింది. వెంటనే మంత్రులందరూ రాజు పరిస్థితి గ్రహించి, రాముడు రాక్షసులను జయించాడని ఇపుడే వార్త వచ్చిందన్నారు. వెంటనే రాజ్యంలో విజయోత్సవం చేయించమని కులశేఖర మహారాజు మంత్రులకు ఆజ్ఞ జారీ చేశాడు. త్రేతాయుగం దాటి, ద్వాపరం గతించి, కలియుగంలో ఉన్న వివేకవంతుడైన కులశేఖర చక్రవర్తిని, గుణశ్రవణ పారవశ్యం కాలాన్ని మరిచేట్లు చేసింది. ఇలా ఎందరి వృత్తాంతాలనో ఉదాహరణాలుగా చెప్పవచ్చు.

## లీలాశ్రవణం

భక్తి భావం జీవునిస్వభావాన్నిబట్టి ఏర్పడుతుంది. వారి ప్రవృత్తికి అనుగుణంగా జీవులు పరమాత్మ లీలలను ఆలకిస్తారు. యోధులకు మధురమైన బాలకృష్ణుని రాసకేళిపై మక్కువ లేక పోవచ్చు. కానీ రాక్షసశిక్షణలో పసిబాలుని తెగువను ప్రీతిగా ఆలకిస్తారు. ఆలాగే కాళీమాత కథలను, లయకారుడైన శివుని త్రిపురాసురసంహారాన్ని కొందరు ఇష్టపడవచ్చు.

అరణ్యంలో, ధ్యానావస్థలో, ప్రశాంతచిత్తంతో ఉండే యోగి దత్తాత్రేయ రూపాన్నో, దక్షిణామూర్తినో, కాత్యాయినీమాత వైభవాన్నో ఆలకించడానికి మక్కువ చూపిస్తాడు. ధనాన్ని కోరే గృహస్థులు లక్ష్మీనాథుణ్ణి ఆరాధి స్తారు లేదా బంగారు ఉసరికలను వర్షంగా కురిపించిన మహాలక్ష్మీ దేవి 'కనకధారాస్తవం' వారికి రుచించవచ్చు. అయితే సగుణ బ్రహ్మోపాసనకు మూలసాధం రూపశ్రవణం. అందుకే పురాణ శ్రవణంలో ఆబాలగోపాలాన్ని రంజింపజేసేది– నామశ్రవణం కంటే రూపశ్రవణం, అంతకంటే



లీలా వైభవశ్రవణం. ఈ త్రివేణీ సంగమంలో మునిగి తేలే వారికి పరమాత్మపట్ల నవనవోన్మేషమైన దివ్యరసానుభూతి సుస్థిరమవుతుంది.

శ్రీమద్భాగవతంలో కృష్ణుడు గోపికలకు ఉపశమనం కలిగించడానికి ఉద్ధవుణ్ణి పంపిన వృత్తాంతముంది.

సర్వం కృష్ణమయంగా భావించే గోపికలు ఉద్ధవుణ్ణి చూచి అతడు 'మా రాజీవాక్షుని భంగి' ఉన్నాడని భావించారు. ఈ సమయంలోనే ఒక గోపిక కృష్ణచరణ ధ్యానపరవశురా లయింది. అపుడే ఒక గండు తుమ్మెదను చూచింది. తమను సముదాయించడానికి వచ్చిన దూతగా భావించి తన ఆవేదన లను ప్రకటించుకొంది. ఇవన్నీ విన్న ఉద్ధవుడు గోపికల ఆర్తిని అర్థం చేసుకొన్నాడు. కృష్ణ సందేశం వినిపించాడు. అపుడు గోపికలు కృష్ణకథాశ్రవణానికి ముగ్ధులయ్యారు.

## ముక్తాయింపు

శ్రవణభక్తి పరాధీనత కలిగిస్తుందని కొందరి అభి ప్రాయం. కాని ఇది సరి కాదు. భక్తుల ఉపాసన సాంద్రమయితే స్వప్నాదులలో, అనుభవాలలో భగవద్ వైభవం శ్రవణగోచర మవుతుంది.

వేదాలకు శ్రుతులని పేరు. బ్రహ్మ శ్రవణేంద్రియాల ద్వారా వేదాలను విన్నాడు. వేదరూపాలు దర్శించాడు. పరమే శ్వరుని తాండవం నాటి ఢక్కానాదాన్ని నందీశ్వరుడు, పాణిని విన్నారు. ఆ మాహేశ్వరసూత్రాల శ్రవణంతో నృత్య, వ్యాకరణ శాస్త్రాలు వెలువడ్డాయి. ఇదే మోస్తరు జ్ఞానవయోధికులయిన మునులకు దక్షిణామూర్తి మౌనవ్యాఖ్యానంవల్ల ఎన్నో రహస్యాలు అవగత మయ్యాయి.

శ్రవణం భౌతికజీవితంలోను, ఆధ్యాత్మిక జీవితంలోను చాలా అవసరమయిందే! భగవంతుని పుణ్యకథలు వినడం ద్వారా ఆయువు, వైరాగ్యం, భక్తి, జ్ఞానం అలవడతాయి. అందుకే అన్నమయ్య 'వినరో భాగ్యము విష్ణుకథ– వెనుబలమిదివో, విష్ణుకథ' అన్నాడు.

అందుకే వ్యాసులవారు శ్రవణభక్తికి అద్వితీయస్థానాన్ని కేటాయించారు. ఇది కేవలం శ్రవణేంద్రియ పరిమితికి మాత్రం లోబడనిది. పైగా పురాణాలు అన్నీ వినిపించిన సూతులు ఆత్మ నివేదన, కీర్తనాదులు ఎన్నో చేసినా మోక్షానికి సశరీరులై వెళ్ళ లేదు. శ్రోతలైన శౌనకాదులు సశరీరులై మోక్షాన్ని పొందారు. ఇలాంటి పౌరాణిక సత్యమే 'శ్రవణభక్తి' తత్త్వానికి, మాహాత్మ్యానికి మణిదర్పణం పడుతున్నాయి.



# మార్గదర్శి 'శ్రీవేంకటేశ్వరుడు'

శ్రీవేంకటేశ్వరలీలలు

శ్రీమతి స్వరలక్ష్మి

మాది విజయనగరం. నాకు ముగ్గురు మగపిల్లలు. ముగ్గురు ఆడపిల్లలు. మా కుటుంబమంతా ఆ వేంకటేశ్వరుని భక్తులం. మా ఇంట్లో ఏ కార్యక్రమం జరిగినా తలచుకొని ముడుపుకట్టనిదే ఏదీ చేయము. కార్యక్రమము నిర్విఘ్నంగా జరిగిన వెంటనే ఆ ఆపదమొక్కులవానికి మ్రొక్కు తీర్చుకుని ఆ స్వామి దర్శనము చేసుకుంటాము.

చాలా సంవత్సరాల క్రిందట ఒక సారి మా పెద్దమ్మాయి, పెద్ద అల్లుడు తిరుపతి దర్శనానికి వెళ్లారు. అనుకోకుండా వెళ్ళవలసి వచ్చింది. వారికి దర్శనానికి టిక్కెట్ కూడా దొరకలేదు. ఆ స్వామి మీద భారము వేసి తిరుపతి వెళ్ళాక సుదర్శన కౌంటర్‌నందు తీసుకోవచ్చు అనుకున్నారు. కానీ, వారికి సుదర్శన టిక్కెట్టు కూడా దొరకలేదు. వారు ఆ స్వామిని ప్రార్థించుకొని ఎలాగైనా దర్శనం కలగజేయవలసిందిగా మొక్కుకుంటూ తిరుగుతున్నారు.

అంతలో వారి వద్దకు ఒక అబ్బాయి వచ్చి మాట్లాడుతుండగా, ఇలా దర్శనానికి టిక్కెట్లు దొరకలేదని చెప్పగా, అవును మీ రూమ్ నెంబర్ చెప్పండి. నేను టిక్కెట్లు తెస్తాను అన్నారు. కొంతసేపటికి అబ్బాయి వచ్చి వారి దర్శనానికి ఏర్పాటు చేశారు. వీరు అతనకి డబ్బిచ్చి, మరలా తిరిగి చూడగా, అతను ఆ చుట్టు పక్కల ఎక్కడా వారికి కనబడలేదు. ఇది అంతా స్వామిమహిమ అనుకొని, ఆ స్వామికి మ్రొక్కుకొని దర్శనానికి వెళ్లారు.

అలాగే, మా మనవడికి పిల్లలు పుడితే ఏడువీథులు బ్యాండ్‌తో జోగి దండి, ఆ పిల్లవాడి పొడుగు బంగారు తీగ, వెండి తీగ, తన బరువు రూపాయి బిళ్ళలు, పటిక పంచదారతో మ్రొక్కు తీసుకుంటామన్నాము.


వెంటనే మరో 9 నెలలకి తనకి బాబు పుట్టాడు. ఈ విధముగా మా ఇంట్లో మా కుటుంబములో, అన్ని విషయములలో ఆ స్వామి మా ముందు ఉండి, మమ్మల్ని ముందుకు నడిపిస్తూ, మాకు ధైర్యాన్ని ప్రసాదిస్తూ, మమ్మల్ని కాపాడే మా వేంకటేశ్వరునికి శతకోటి నమస్సుమాంజలులు.

# అతిథి దేవో భవ

'అతిథి దేవో భవ' అని ఆర్యోక్తి.

కుటుంబధర్మాల్లో ఇంటికి వచ్చిన అతిథిని గౌరవించడం మన సంప్రదాయం. అతిథిని దైవంలా భావించాలి.

మహాభారతకథల్లో సక్తుప్రస్థుని కథ అతిథిదేవోభవకు చక్కని ఉదాహరణ.



సక్తుప్రస్థుడు నిరుపేద. కాని గొప్ప త్యాగగుణం కలవాడు. ఒకనాడు గింజ, గింజ ఏరుకొని ఆ రోజుకే తన ఇంట్లో ఉన్నవాళ్లకు మాత్రమే తగినంత వండుకొని ఎవరిభాగం వాళ్లు తీసుకొని భుజించే సమయంలో ఒక అతిథి వచ్చాడు.

అప్పటికే కొన్ని రోజులుగా వాళ్లు ఆహారం లేకుండా ఉన్నారు. ఆ అతిథి ఆకలి తీర్చడం కోసం ముందు సక్తుప్రస్థుడు ఆహారంలో తన భాగం ఇచ్చి సత్కరిస్తాడు.

అతిథి తృప్తి చెందకపోతే తరువాత సక్తుప్రస్థుడి భార్య తన భాగం ఇస్తుంది.

అలా ఇంట్లో అందరూ తమ తమ భాగాల్ని త్యాగం చేస్తారు. అతిథుల్ని గౌరవించడం అంటే ఇలా గౌరవించాలి. ఇటువంటి గొప్ప కుటుంబ వ్యవస్థ మనది.

# మహావాక్యరత్నావళి

– డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్




ఋక్, యజుస్, సామ, అథర్వణ విభాగాలతో వేద వాహిని నాలుగుపాయలుగా ప్రవహిస్తూ జీవకోటిని విజ్ఞాన సస్యశ్యామలం చేస్తోంది. వేదవ్యాస మహర్షి ద్వాపరయుగంలో తనకాలం నుండి రాబోయే కాలాలకు అనుగుణంగా వేద విభాగం చేసి అధ్యయన సౌలభ్యాన్ని, విస్తృతిని కలిగించి విష్ణు మూర్తి వాఙ్మయావతారంగా కీర్తినందుకొన్నాడు.

ఋగ్వేదానికి ఇరవై ఒక్క (21) శాఖలు, యజుర్వేదానికి నూట తొమ్మిది (109)శాఖలు, సామవేదానికి వెయ్యి (1000) శాఖలు, అథర్వణ వేదానికి ఏభై (50) శాఖలతో 'వేదకల్ప వృక్షం' దశదిశలా విస్తరించింది. ఒక్కొక్క శాఖకు ఒక ఉపనిషత్తు ఏర్పడింది. ఆ శాఖకు ప్రాణభూతంగా, సారాంశంగా కొస మెరుపుగా ఆవిర్భవించిన వేదాంతరూపమైన ఉపనిషద్వాణి ఒక వెయ్యి నూట ఎనభై (1180) ఉపనిషత్తులుగా అవతరించింది.

ఆ ఉపనిషత్తులలో నూటెనిమిది (108) ముఖ్యమైన వానిని శ్రీరామచంద్రుడు తన దూత అయిన హనుమంతునకు ఉపదేశించాడు. అలాగే ముక్తికోపనిషత్తులో నూటెనిమిది ఉపనిషత్తుల పేర్లు శ్లోక రూపంగా ప్రకటితమైనాయి.

వాటిలో ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండ, మాండూక్య, తిత్తిరి, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యక ఉపనిషత్తులు పది (10) మరింత ముఖ్యమైనవి. ఇవి ఋగ్వేదం నుండి వచ్చాయి.

శుక్లయజుర్వేదం నుండి పందొమ్మిది(19), కృష్ణ యజుర్వేదం నుండి ముప్పైరెండు(32), సామవేదం నుండి పదహారు(16), అథర్వణ వేదం నుండి ముప్పై ఒకటి(31) మొత్తం నూట ఎనిమిది (108) ఉపనిషత్తులు ఏర్పడ్డాయి.

వీటిల్లో మాండూక్యోపనిషత్తుకు గౌడపాదాచార్యులు, దశోపనిషత్తులు, పంచరుద్ర, నృసింహతాపనిలకు శంకరాచార్య స్వాములు, ముప్పైరెండు ఉపనిషత్తులకు శంకరానంద, సదా శివ, స్వయంప్రకాశానందాద్యాచార్యులు వ్యాఖ్యలు రచించారు. విద్యారణ్యాచార్యులు మొత్తం నూటెనిమిది ఉపనిషత్తులను వ్యాఖ్యానించారు. ఈ ఉపనిషత్తులన్నీ మహాసాగరం వంటివి. సాగరగర్భంలో ఉన్న రత్నాలను తెచ్చుకోవాలంటే మొసళ్ళు, తిమింగలాలు వంటి వాటిని తప్పుకుంటూ ఊపిరిబిగపట్టి ఈదు కుంటూ అడుగుకు దిగి పైకి తేవటం అందరికీ సాధ్యమయ్యేపని కాదు. అందుకే ఈ 'మహావాక్యరత్నావళి'ని రాసిపోసి సాధ కులకు ఆచార్యులు వాత్సల్యంతో అందిస్తున్నారు.

ఈ మహావాక్యరత్నావళిలో విధి, బంధమోక్ష, అవిద్య న్నింద, జగన్మిథ్య, ఉపదేశ, జీవబ్రహ్మైక్య, మనన, జీవన్ముక్తి, స్వానుభూతి, సమాధి, అష్టవిధస్వరూప, ఫల, విదేహముక్తి అనే పదమూడు విభాగాలు ఉన్నాయి.

యః స్వాశ్రమాచారరతః పరివ్రాడ్విజితేంద్రియః।
సోఽధికారీమహావాక్య రత్నావళ్యాం న చాపరః॥

మహావాక్యరత్నావళిని చదవటానికి, వినటానికి తన ఆశ్రమాచారాలను పాటిస్తూ, పరివ్రాజకుడై, విజితేంద్రియుడై ఉన్నవాడు మాత్రమే అర్హుడు. పైకి ఈ అర్హతలు సన్యాసులకు మాత్రమే ఉన్నట్లు అనిపిస్తాయి. కానీ లోపలికి చూస్తే వేదాంతా భిలాష, తత్త్వచింతన, సత్ ప్రవర్తన, సాధన కలవారు అనే అర్థం తెలుస్తుంది.

కనుక ఆత్మజ్ఞానాన్వేషకులైన వారు తామున్న ఆశ్రమ ధర్మాలను చక్కగా అనుసరిస్తూ, ఇంద్రియాలకు లొంగనివారై మహావాక్యరత్నావళి శ్రవణం చేయవచ్చు. విదేహముక్తులై శ్రీమాత అనుగ్రహంతో జనకరాజర్షివలె జీవించవచ్చు.

యన్మహావాక్యసిద్ధాంతం ముక్త చిత్తైక గోచరమ్।
వాసుదేవేంద్ర సంజ్ఞంతం నేమి సర్వాత్మకం మహః॥



## హరిదాస వాఙ్మయంలో...
# శ్రీవేంకటాచలాధీశుడు 10

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

**గత సంచిక తరువాయి భాగం...**

వారిధియోళగాడిదె । గిరియ బెన్నలిఎత్తిదె ।
భారవధరెయతందె । దైత్యనకొందె ।
దురుళబలియను మెట్టి । దైత్యనృపరనుకుట్టి ।
తరుణి గభయవనిత్తె । తరువకిత్తె ॥

పురదనారియరను పంథదిగెలిదే ।
వరకల్కి యాగి తురగవనేరిదె ।
వరద ప్రసన్న హయవదన వేంకటరాయ
పొరెయో ఎందెందు ఎన్నవనన్ను ॥

పై చరణములలో సముద్రములో ఆడితివని (మత్స్యావతారమును) కొండను వీపున మోసితివని (కూర్మావతారమును), భారమైన భూమిని తెచ్చితివని (వరాహావతారమును), దైత్యుని చంపితివని (నరసింహావతారమును), దుష్టబలిని తన్నితివని (వామనావతారమును), దుష్టరాజులను అణచితివని (పరశురామావతారమును), తరుణికి అభయమిచ్చితివని (శబరి నను గ్రహించిన రామావతారమును), చెట్లను కూల్చితివని (యమళార్జున వృక్షములను భంగపరచిన కృష్ణావతారమును), పురనారి మణులను గెలిచితివని (బుద్ధావతారమును), గుఱ్ఱమెక్కితివి అని (కల్కి అవతారమును)- ఇట్లు దశావతారములతో శ్రీనివాసుని ఎల్లప్పుడు స్తుతిస్తూ కాపాడమని అంటారు. వాదిరాజస్వామి వారి కన్నడ కృతులలో ప్రత్యేకత తత్త్వము, సిద్ధాంతము నిస్సందేహత్వము, స్పష్టత, నిర్ధారణ కూడి ఉంటుంది.

'శ్రీశా నీనహుదో శేషాచలవాస నీ నహుదో' అనే సుప్రసిద్ధమైన కృతిలో శ్రీనివాసుని ఉద్దేశించి- 'స్వామీ! నీవు శ్రీశుడవు' అనగా లక్ష్మీదేవికి ఈశుడవు (భర్తవు) శేషాచలవాసుడవు అని అంటారు. *'వైకుంఠో వేంకటగిరిః। వాసు దేవో రమాపతిః। మాయావి పరమానందం త్యక్త్వా వైకుంఠ ముత్తమం। స్వామి పుష్కరిణీ తీర రమయా సహమోదతే।'* అను



పురాణవాక్యాధారముగా భూవైకుంఠము వేంకటపర్వతము. రమానాథుడైన శ్రీమహావిష్ణువే వేంకటేశ్వరుడు. ఆతడు ఆపై వైకుంఠమును వీడి లక్ష్మీదేవితో ఈ కొండపై ఉన్న స్వామి పుష్కరిణి తీరమందు వెలసిన 'శ్రీశుడవు నీవు' అని అంటున్నారంటే- అది శ్రీనివాసుని తత్త్వమును తెలుపుటకే అయినది. అంతేకాక ఈ పాట చరణములలో ఈ వేంకటేశ్వరుని ఆతని వెనుకటి అవతారములకు వ్యత్యాసము లేదని తెలుపుతుంది.

### వైకుంఠపాళి
### :: 65 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 మ | | 2 ద్రో | ణా | 3 చా | ర్యు | 4 లు | | |
| నో | | ణి | | రు | | లి | | 5 తా |
| 6 ర | మ | | 7 చా | మ | రం | | 8 పా | ట |
| మ | | 9 మ | | తి | | 10 దం | | క |
| | 11 సా | ధు | వు | | 12 కూ | డ | దు | |
| 13 పు | | వు | | 14 రే | | ము | | 15 సు |
| 16 చి | న్న | | 17 త | ణు | కు | | 18 సు | మం |
| త్తి | | 19 మ్మ | | మ | | 20 క్ష | | త్రు |
| | | 21 అ | ది | తి | | 22 మ | ధు | డు |

**శేషశయన సురేశవందితాశేష జనరనుపాలిసి బడ్డి**
**కాసు సేరిసి గంటు కట్టువ క్యాసక్కితిమ్మప్ప నీనే ॥**

హే శ్రీనివాస నీవు శేషశయనుడవు. ఇంద్రాది దేవతలచే వందితుడవు. అశేష జనులను కాపాడేవాడవు. వడ్డికాసులవాడవు. ఉత్కృష్టాన్నములను నైవేద్యముగా స్వీకరించేవాడవు అని మధ్యలో వ్యాజనిందాస్తుతి పరంగాను శ్రీమన్నారాయణుడితడని సూక్ష్మంగా తెలిపియున్నారు.

**"తందె నీనహుదో కరుణా సింధు నీనహుదో ।**
**అందు ద్రుపదన నందనేయ ఎళెతందు ఘాసియమాడుతిరలు**
**ముందే బందు అక్షయ వెందు సలహిద**
**మందహాసముకుందను నేనె ॥**

(తండ్రీవి నీవే, కరుణాసింధువు నీవే. ఆనాడు నిండు సభలో ద్రౌపదీదేవి వస్త్రాపహరణమునకు గురియైనప్పుడు అక్షయవసనములను ప్రసాదించి ఆమెను కాపాడిన శ్రీకృష్ణుడవు నీవేనయ్యా' అని అంటారు.)

**ఏవం శ్రీకృష్ణరూపేణ క్రీడతే వేంకటాచలే**
**ధీర నీనహుదో జగదోద్ధార నీనహుదో**
**బారి బారిగె నిన్న పాద సువారిజంగళ సేరిదభక్తర**
**ఘోర దురితవ దూరగైసువ మారజనక అపారమహిమనె॥**

(ధీరుడవు, జగదోద్ధారుడవు నీవైన నిన్ను సదా సర్వ కాలములలో పైపై నీ పాదపద్మములనాశ్రయించి సేవించే భక్తుల ఘోర దురితములను పారద్రోలే మన్మథ జనకుడైన అపార మహిముడైన నారాయణుడవు నీవు అని అంటారు.)

**ధన్య నీనహుదో । సురముని మాన్య నీనహుదో ।**
**పన్నగారి వాహన్న ధరే యోళు ఇన్ను నినగెదుర్యారుకాణెనో। ప్ర**
**సన్న నాగెలో బిన్నహకేళు ప్రపన్న వత్సల శ్రీహయవదన।**

(ధన్యుడవు నీవయ్య! సురముని మాన్యుడవు నీవయ్య। పన్నగారి వాహనము అనగా గరుత్మంతునే వాహనముగా గలిగిన నీకు ఈ ప్రపంచమున ఎవరు ఎదురుగా నిలబడలేరు. కావున ప్రసన్నుడవై నా ప్రార్థన నాలకించి నను కాపాడుము.)

- - - - - - -

## శ్రీపురందరదాస సాహిత్యంలో శ్రీనివాసుడు

'దాస రెందరె పురందర దాసరయ్య' దాసులంటే పురందరదాసులే అని నాటి (తమ) గురువులైన శ్రీవ్యాసరాయలచే గౌరవంగా పిలిపించుకొన్న పురందరదాసులవారు నారదాంశ సంభూతులని ప్రసిద్ధి. విజయదాసులవారు గురుస్తుతిని చేస్తూ 'మారజనకన సన్నిధానది సారెగానవ మాడువ। నారదరె ఈ రూపదిందలిచారు దరుశన తోరిద' మన్మథ జనకుని సన్నిధానమున అనర్గళముగా గానం చేసే నారదులవారే ఈ పురందరదాసులుగా దర్శనమిచ్చార'ని అంటారు. శ్రీహరి సంకల్పానుసారం శ్రీనివాసనాయకుడుగా నామాంతరము గలిగిన వీరు తమ నవకోటి ఆస్తిని తృణ ప్రాయంగా భావించి, త్యజించి, గురువ్యాసరాయలచే 'పురందర విఠల' అంకితమును పొంది నాటిచే ప్రామాణికమైన వేద పురాణేతిహాసముల సహాయంతో పద పద్య సుళాది కీర్తనలను నాలుగులక్షల డెబ్బై అయిదు వేలు రచించి భారత దేశాద్యంత సప్రామాణిక పుణ్యక్షేత్ర సందర్శనమును చేసి ఆయా దేవతలపై, నదులపై, శ్రీమన్మధ్వాచార్యాది పరంపర గురువులపై స్తుతి రూప పదములను, అనేక వేదాంత విషయములను, పురాణేతిహాసోపనిషత్తులందలి విషయములను సందర్భోచితముగా గ్రహించి వాటిని, ప్రభు, మిత్ర, కాంతా సమ్మితములుగా, ద్రాక్ష, కదళీ, నారికేళపాకములగా ఉపదేశాత్మకములుగా– ఇట్లు అనేక ప్రక్రియలలో కన్నడమున కీర్తనలను రచించి పాడినారు. కర్ణాటక సంగీత పితామహులుగా ప్రసిద్ధులైన పురందరదాసుల వారి కీర్తనలు కేవలము భజన సంప్రదాయమందు పాడుటయే కాక సంప్రదాయబద్ధమైన దేశి, మార్గసంప్రదాయ శాస్త్రీయ సంగీతమునందు కూడ రాగ తాళబద్ధంగా పాడుకొనుటకు వీలైనది. అంతేకాక నాట్యమునకు అనుకూలమైయున్నది. సాహిత్యదృష్టితో చూచినను సంగీత దృష్టితో చూచినను వీరి పదములు భావగర్భితములైయున్నవి. పదలాలిత్యముతో కూడి కొన్ని కీర్తనలు చిన్నవైనను అందులో భావార్థములు అగాధ జల నిధివంటిదని చెప్పవచ్చును. సాహిత్యపరంగా చూస్తే కావ్యసంప్రదాయాన్ననుసరించి నాటకీయ శైలిలోను, రమణీయమైన అర్థములు స్ఫురించే శబ్దజాలములతోను, అర్థ శబ్దాలంకారములతోను, దీర్ఘసమాసపదములతోను వివిధప్రక్రియలకు చెంది యున్నది. భక్త కవి, వాగ్గేయకారులైన పురందరదాసుల భక్తికి స్వయంగా పండరినాథుడు, తిరుమలేశుడు వీరికి దర్శనమిచ్చినట్లు ఐతిహ్యములున్నవి. 'పరమపురుషను విప్రనందది కరవనీడియాచిసే' పరమపురుషుడు విప్రరూపమున వచ్చి చేసాచినాడని స్వయంగా విజయదాసులవారే వీరిని కొనియాడినారు. అట్లే తిరుమలేశుడు కొండపై ఒకనాటి రాత్రి సమయమున భక్తుని వేషమున నీళ్లు అందించినట్లు, మరొసారి 'అప్పణ్ణ' అనే శిష్యుని రూపమున నేయిని తెచ్చి సమారాధనమున వడ్డించినట్లు వీరి కృతుల వలననే తెలుస్తున్నది.

*(ఇంకా ఉంది)*

గృహలక్ష్మి

# హిందూత్వంలో స్త్రీ విశిష్టత

- డా॥ విజయలక్ష్మి

హిందూత్వంలో స్త్రీకి ఓ అత్యున్నతమైన విశిష్టస్థానం ఉంది. క్రమేపీ ముదిరిన నాగరికత, ప్రబలిన అతితెలివి వెరసి, స్త్రీని ఓ యంత్రంలా, ఓ సౌందర్యసాధనలా మార్చేసింది. కానీ ఆ నెపాన్ని పురాణాలపైకి నెట్టింది ఈ నాగరికసమాజం.

నిజానికి పురాణాల్లో స్త్రీకి ఓ విశిష్టస్థానమే ఉన్నది. అందుకు ఎన్నో దాఖలాలున్నాయి. పురుషులకు సమానంగా స్త్రీలకు కూడా అస్త్రశస్త్రాది విద్యలను నేర్పేవారు. ఇందుకు చక్కని సోదాహరణ బృహస్పతి భార్య తార! బృహస్పతికి ఎన్ని ధర్మ శాస్త్రాలు తెలుసో... అందుకు ధీటుగా బృహస్పతి భార్యయైన తారకు కూడా సమస్తమైన ధర్మాలందు నైపుణ్యత పొందింది.

మహాభారతాన్ని నడిపించిన ద్రౌపది పంచభర్తలందు సంయమనాన్ని పాటిస్తూ, తన సౌశీల్యాన్ని నిరూపించుకున్నదంటే స్త్రీకి గల ధర్మసూక్ష్మత, ధర్మనైపుణ్యం మనం గ్రహించాల్సిందే!

సాక్షాత్ శ్రీమహాలక్ష్మీదేవియైన రుక్మిణీదేవి సైతం- ద్రౌపదినుండి పతివ్రతా ధర్మాలను నేర్చుకున్నదంటే ద్రౌపదిలోని ధర్మసూక్ష్మత మనం తెలుసుకోవలసిందే! ఓ రకంగా చెప్పాలంటే ద్రౌపదికి జరిగిన పరాభవమే కురుక్షేత్ర సంగ్రామానికి దారి తీసింది. అంటే స్త్రీకి జరిగే పరాభవానికి, అన్యాయానికి పౌరాణిక కాలంలో విలువను అందించేవారు.

ఇక వేదకాలంలో పురుషునితో సమానంగా స్త్రీలకు సైతం ఉపనయనాది సంస్కారాలు గావించేవారు. యాజ్ఞవల్క్యుడి భార్యయైన గార్గికి, ఉపనయన సంస్కారం అయినట్లు మనకు తెలిసినదే! లోపాముద్ర, ఇంద్రాణివంటి నారిఎందరినో మనం సకలశాస్త్రకోవిదులుగా చూడవచ్చు.

అసలు ఉపనయనానికి, వేదానికి ఆధారము, పూజ నీయమైనది 'గాయత్రీ'దేవి అన్నది మనం గుర్తించాలి. పాణిని ధర్మసూక్తుల్లో అధ్యాపకుడుకి, అధ్యాపకురాలికి, ఉపాధ్యా యునకు, ఉపాధ్యాయురాలికి ప్రత్యేకమైన స్థానం ఏర్పరచబడి ఉంది. కనుక స్త్రీలకు బోధనావృత్తిలోనూ విశిష్టస్థానం ఉందని మనం గ్రహించాల్సిందే!

ఇంకాస్త ముందుకెళితే యాజ్ఞవల్క్యునితో వాదోప వాదాలను చేసి గెలిచిన ఘనత కూడా స్త్రీ అయిన మైత్రేయికి దక్కుతుంది.

ఋగ్వేదాన్ని అనుసరించి, స్త్రీలు సైనికదళంలో ఓ ఉన్నతస్థానంలో ఉంటూ రాజ్యపరిరక్షణ చేసినట్లు మనం గ్రహించవచ్చు. ఈ తంతు మనకు చరిత్రలోనూ కానవస్తుంది, చంద్రగుప్త మౌర్యుని రాజ్యాన్ని, కోటను పరిరక్షించడంలో ఎంతో మంది స్త్రీలు ముందున్నట్లు చారిత్రక ఆధారాలు ఎన్నో ఉన్నాయి.

శ్రీదేవీమాహాత్మ్యంలో శ్రీమాత యొక్క దివ్యత్వం పరి పూర్ణంగా మనం దర్శించుకోవచ్చు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వ రులను ఉద్భవింపజేసి, వారికి వివిధ శక్తులను ఒసగి, వారికి వివిధ బాధ్యతలను అప్పగించినది శ్రీదేవియే!

జడత్వమైన పురుషునకు చైతన్యాన్ని అందించేది స్త్రీత్వము, శక్తిత్వమే! చైతన్యం లేని చోట అంతా నిర్వీర్యమే తప్ప ఏ విధమైన శక్తిత్వం ఉండదు. ఎక్కడైనా సౌందర్యాన్ని నింపేది, సౌందర్యం ద్వారా శక్తిని ఒసగేది స్త్రీయే!

వివిధకష్టాల్లో ఉండి, పలురకాల ఈతి బాధలు అను భవిస్తూ, మానవుడు నిస్తేజుడై, నీరసించినపుడు వానిలో నూతనో త్సాహాన్ని, ఉల్లాసాన్ని అందించే శక్తి స్త్రీకి మాత్రమే ఉంది! ఆ ఉల్లాసం మనిషిలో తెలియని ఓ నూతన శక్తిని పునః సృజిస్తుంది.

మనిషికి విద్య, వివేకం, సమస్యను పరిష్కరించుకునే చాతుర్యం కలిగించే శక్తిని 'సరస్వతీదేవి'గానూ, ఐశ్వర్యాన్ని, సంపదను, సకలభోగభాగ్యాలను కలిగించే శక్తిని 'మహాలక్ష్మీ దేవి'గానూ, అందిన సమస్తమైన సుఖభోగాలను సంరక్షించు కునే ధీరతను ఒసగే శక్తిని 'ఆదిశక్తి', 'పార్వతీదేవి'గానూ మన వేదాలు పేర్కొంటున్నాయంటే... స్త్రీకి మించిన శక్తి మరొకటి లేదన్నది మనం గుర్తించాలి.

*యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః।*
*యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రా ఫలాః క్రియాః॥*

# 'వైశాఖ'మాస వైశిష్ట్యం

– డా॥ పి.వి.ఎన్.మారుతి

ఆధ్యాత్మిక శక్తికి చెందిన మాసాలలో వైశాఖం ఒకటి. ఎందరో మహాత్ములు అవతరించిన మాసం కూడా ఇదే.

అవతారపురుషులు, దార్శనికులు, ప్రవక్తలు, భక్తులు, వాగ్గేయకారులు అవతరించిన మహిమాన్వితమైన మాసం 'వైశాఖం'.

నారద, పరాశర, వసిష్ఠ వ్యాసమహర్షులు, పద కవితాపితామహుడైన అన్నమాచార్యుడు మొదలైనవారు పుట్టిన దివ్యమాసమిది.

గంగావతరణం, నరసింహావిర్భావం, హనుమజ్జయన్తి– జరిగినవి ఈ నెలలోనే.

ఆదిశంకరభగవత్పాదులు, భగవద్రామానుజులు, శ్రీవిద్యారణ్యస్వామి, శ్రీత్యాగరాజస్వామి, కంచి మహాస్వామివంటి వారు అవతరించినదీ ఈ మాసంలోనే.

వైశాఖమాసంలో, ప్రతిరోజూ శ్రీమహావిష్ణువును కృష్ణ తులసీ దళాలతో పూజించితే భగవదనుగ్రహం లభిస్తుంది.

ప్రాతఃకాలం స్నానంచేసి, అధికమైన జలాన్ని అశ్వత్థ (రావి) మూలంలో పోసి ప్రదక్షిణలు చేస్తే పూర్వీకులు సద్గతిని పొందుతారు.

నిత్యం గోవులకు పూజ చేసి నిమిరినా ఉత్తమఫలాలు లభిస్తాయి.

ఈమాసంలో ఏకభుక్తం (ఒంటిపూట భోజనం) గానీ, నక్తంగానీ (పగలంతా ఉపవాసం ఉండి, రాత్రి మొదట్లో భుజించడం) మంచిది.

నిరంతరధారగా అభిషేకం జరిగేలా ధారాపాత్రను, విసనకర్రలు, ఛత్రములు, పాదరక్షలు శివునకు సమర్పణ చేయడం మహాఫలం.

నిత్యం ప్రాతఃకాలంలో విష్ణువును పూజించి, గంధం కలిపి నీటిపాత్రలో నుంచి పంచోపచారాలతో మళ్ళీ పూజించి, సూర్యాస్తమయ పర్యంతం ఆ జలంలోనే ఉంచాలి. తిరిగి రాత్రి వేళ స్వస్థానంలో స్థాపించి పంచోపచారాలతో పూజించాలి. ఆ తీర్థోదకంతో గృహద్వారాదులను, తనపై చల్లుకొని పవిత్రం చేసుకోవాలి. (ద్వాదశినాడైతే పగటిపూట జలమందుంచరాదు. రాత్రివేళనే కొద్దిసేపు జలమందుంచి పూజించి స్వస్థానంలో ఉంచాలి.)

ఈ విధంగా మాసమంతా (ముఖ్యంగా వైశాఖ, జ్యేష్ఠ మాసాలు) చేస్తే వేసవితాపం తగ్గుతుంది.

'వైశాఖో మాధవో రాధో'.

వైశాఖమాసాన్ని 'మాధవమాసం' అని అంటారు.

ఈ మాసంలో విష్ణుస్మరణతో, అభీష్టదేవతారాధనతో నియమపాలన చేయడం ఇహపర శ్రేయస్సునిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

వైశాఖమాసాన్ని మహిమాన్వితమైన దివ్యమాసంగా శాస్త్రాలు వర్ణించాయి.

ఈ మాసాన ప్రాతఃకాలాన లేచి మధుసూదనుని స్మరిస్తూ స్నానం చేయడం విశేషఫలప్రదం.

ప్రాతః సనియమ స్నాన్యే ప్రీయతాం మధుసూదన।

అదేవిధంగా..

మాధవే మేషగే భానౌ మురారే మధుసూదన।
ప్రాతఃస్నానేన మే నాథ ఫలదో భవ పాపహాన్॥

అనే ప్రార్థనతో తీర్థాదులలో చేసిన స్నానం దివ్యఫలాన్ని ఇస్తుంది. వైశాఖమాసమంతా శ్రీమహావిష్ణువును తులసీదళాలతో అర్చించడం శ్రేష్ఠం.

ఈ మాసం చలివేంద్రాలు, పళ్ళరసాలు, మజ్జిగవంటి పానీయాలశాలను నిర్వహించచడం, విసనకర్రలు, గొడుగులు, పాదరక్షలు దానం చేయడం పుణ్యఫలాన్నిస్తుంది.




## మనవంతు సాయం!

దారిలో అంబులెన్సు వాహనం వచ్చినప్పుడు...
దానికి దారి వదిలి, మీవంతు సహాయం చేయండి!
అందులోని రోగికి ఆరోగ్యం మెరుగుపడాలని...
మనసారా 'శ్రీవేంకటేశ్వరస్వామి'ని వేడుకోండి!!



ఆయుర్వేదం

# సనాతన వైద్యంలో 'తుంగముస్తలు'

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ

మన ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం ప్రకృతి మాత కొన్ని ఆహారపదార్థలని, కొన్ని ఔషధపదార్థాలను మనకు ప్రసాదించింది. అలాంటి వాటిల్లో ఔషధంగా ఉపయోగపడే 'తుంగముస్త' లని వివిధ అనారోగ్య సమస్యలలో ఎలా మనం సద్వినియోగం చేసుకోవచ్చో ప్రస్తుతం తెలుసుకుందాం.

తుంగముస్తలు చిన్న చిన్న మొక్కల యొక్క దంపలు, వరి పొలాల్లో కలుపు తీసే సమయాల్లో విరివిగా సేకరించ వచ్చు. వీటినే 'తుంగబొటికలు' అని కూడా అంటారు. సంస్కృతంలో వీటిని ముస్త అంటారు. **"ముస్యతి ఖండయతి రోగాన్ ముస్తః"**- అను వచనానుసారం రోగాలను నిర్మూలించు టచే ముస్త అంటారు. అట్లే చలువ చేసే గుణం కలిగి ఉండటం వల్ల 'హిమ' అని, సుగంధభరితంగా ఉండటం వల్ల 'సుగంధి' అని, నీరు ఉన్న ప్రాంతాలలో లభ్యమవుటచే 'జలముస్త' అనే సంస్కృత పేర్లు కూడ వీటికి ఉన్నాయి.

సైపరేసి అను వృక్ష కుటుంబానికి చెందిన ఈ మొక్కల శాస్త్రీయ నామం సైపరస్ రొటెండస్. ఇంగ్లీషులో నట్‌గ్రాస్, హిందీలో మోథ అని వీటిని పిలుస్తారు.

ఎండిన తుంగముస్తలు, తుంగముస్తల పొడితో పాటు ప్రస్తుతం చెప్పుకోబోయే మూలికలు ఆయుర్వేదౌషధ విక్రయ శాలల్లో లభిస్తాయి.

**అధికవేడి తగ్గేందుకు:** తుంగముస్తల చూర్ణం, సుగంధిపాల చూర్ణం, వట్టి వేర్ల చూర్ణం ఒక్కొక్కటి 10 గ్రాముల చొప్పున తీసుకొని 30 గ్రాముల పంచదార కలిపి సీసాలో నిల్వ ఉంచు కొని ఉదయం, సాయంత్రం పూటకు అర టీ స్పూను నుండి ఒక టీ స్పూను పొడిని 100 మి.లీ. నీటిలో కలిపి సేవిస్తుంటే అధికవేడి తగ్గుతుంది. అధిక వేడి వల్ల కలిగే కళ్ళ మంటలు, మూత్రంలో మంట నొప్పి, పోటువంటి బాధలు కూడా తగ్గుతాయి.

షుగర్ వ్యాధిగ్రస్తులు ఈ ఔషధ యోగంలో పంచదార కలుపుకోకుండా పావు టీ స్పూను నుండి అర టీ స్పూను వరకు వాడుకోవాలి.

**శరీర దుర్వాసన తగ్గేందుకు:** 50 గ్రాముల చొప్పున తుంగ ముస్తల చూర్ణం వట్టి వేర్ల చూర్ణం, గంధకచోరాల చూర్ణం కలిపి వుంచుకొని బకెట్ నీటిలో 2-4 టీ స్పూన్ల పొడిని కలిపి స్నానం చేస్తుండాలి.

**సాధారణ దగ్గులకు:** 20 గ్రాముల తుంగముస్తల చూర్ణంలో 20 గ్రాముల మిరియాల పొడి కలిపి ఉంచుకొని రోజు 2,3 సార్లు పూటకు ఒక గ్రాము పొడిని తగినంత తేనెతో కలిపి సేవిస్తుండాలి.

**కీళ్ళ నొప్పులకు:** 50 గ్రాముల తుంగముస్తల చూర్ణం, 50 గ్రాముల అశ్వగంధ చూర్ణం కలిపి వుంచుకొని పూటకు 200 మి.లీ. నీటిలో ఒక టీస్పూను పొడిని వేసి 100 మి.లీ. నీరు మిగిలేలా మరిగించి, దించి, చల్లార్చి, వడగట్టి ఒకట్రెండు టీ స్పూన్ల తేనె కలిపి సేవిస్తుండాలి.

**అధిక దప్పిక తగ్గేందుకు:** తుంగముస్తల పొడి 10 గ్రాములు, యాలుకుల పొడి 10 గ్రాములు కలిపి ఉంచుకొని రోజు రెండు



పూటల పూటకు ఒక గ్రాము పొడిని తగినంత తేనెతో కలిపి సేవిస్తు వుంటే అధిక దప్పిక సమస్యతో పాటు నోటి దుర్వాసన కూడా తగ్గుతుంది.

**అధిక బరువు తగ్గేందుకు:** 100 గ్రాముల తుంగముస్తల చూర్ణంలో వామును వేయించి చేసిన పొడి 25 గ్రాములు కలిపి వుంచుకొని ఉదయం, సాయంత్రం పూటకు 2-3 గ్రాముల పొడిని తగినంత తేనెతో కలిపి సేవిస్తు వుంటే అధిక బరువు తగ్గడంతో పాటు అధిక బరువు వల్ల కలిగే కీళ్ళ నొప్పులు కూడా తగ్గిపోతాయి.

**ఐ.బి.యస్. అనే విరేచనాల సమస్య తగ్గేందుకు:** రోజు రెండు సార్లు పూటకు 200 మి.లీ. నీటిలో 5 గ్రాముల తుంగముస్తల పొడి వేసి 100 మి.లీ. మిగిలేలా మరిగించి, దించి, చల్లార్చి, వడగట్టి సేవిస్తు ఉంటే తిన్న వెంటనే విరేచనం కావటం, ప్రయాణ సమయంలో విరేచనాలు కావటం, మానసిక వత్తిడి, ఆందోళన ఉన్నప్పుడు విరేచనాలు కావడం, అసంపూర్తిగా విరేచనం కావడం. పడని పదార్థం తినటం వల్ల విరేచనం కావడం వంటి వివిధ రకాలైన విరేచనాలు తగ్గిపోతాయి.

**చర్మ వ్యాధులకు:** తుంగముస్తలు పొడి, స్వచ్ఛమైన పసుపు పొడి ఒక్కొక్కటి 25 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకొని ఉదయం, సాయంత్రం పూటకు 1-2 గ్రాముల పొడిని తగినంత తేనెతో లేదా 50 మి.లీ. గోరువెచ్చని పాలలో కలిపి సేవిస్తు ఉంటే గజ్జి, తామర, దురదలువంటి చర్మసమస్యలు సమసి పోతాయి.

షడంగ పానీయం, గంగాధర చూర్ణం, ముస్తకారిష్ట లాంటి ప్రముఖ ఆయుర్వేద ఔషధాల తయారీలోను, శివాది చూర్ణం, చుక్కత్ తైలం, నీలవేంబు కుడినీర్, కరుణాయ్ లేహ్యం వంటి తమిళనాట ప్రసిద్ధి చెందిన సిద్ధ వైద్య ఔషధాల తయారీ లోను తుంగముస్తలను ఉపయోగిస్తారు.

# లక్ష్మీదేవికి విష్ణుమూర్తి ఇచ్చిన వరం ఏమిటి?

– కుమారి ఆర్.ప్రియంవద

లక్ష్మీదేవి భూమి మీదకు రావడానికి భయపడి విష్ణుమూర్తిని వేడుకుంది. "స్వామీ.. మానవుల వద్దకు నేను వెళ్ళలేను. వారు లోభులు, సోమరులు, విచ్చలవిడితనం ఎక్కువ. కొంచెం సంపద చేతిలో ఉంటే చాలు నా అంతవాడు లేడు అంటారు. ఇలా ఒకటా రెండా? సంపదలకోసం ఏమి చేయడానికైనా వెనుకాడరు. కనుక నేను వెళ్ళలేను కనికరించండి" అని మొరపెట్టుకుంది.

అప్పుడు విష్ణుమూర్తి లక్ష్మీదేవితో ఇలా అన్నాడు.....

"నువ్వు భయపడకు. – నీకు తోడుగా నలుగురుని పంపుతున్నాను. రాజు, అగ్ని, దొంగ, రోగం...

ఈ నలుగురు ఎల్లప్పుడూ నీకు తోడుగా ఉంటారు.

ధర్మంగా సంపాదించి దానధర్మాలు, పుణ్యకార్యాలు చేస్తూ ఉండే వారికి ఎల్లవేళలా నువ్వు తోడుగా ఉండు. చిన్న చిన్న కష్టాలు వచ్చినా అవి ఎంతోకాలం ఉండవు. ధర్మమే వారిని నిలబెడుతుంది.

ఈ ధర్మాన్ని ఎప్పుడైతే తప్పి అధర్మంగా జీవిస్తారో..

ఆనాడు రాజు వీళ్ళ సంపదని స్వాధీనం చేసుకుంటాడు.

ఇది కుదరకపోతే అగ్ని దహించివేస్తుంది.

మొత్తాన్ని తగలబెట్టేస్తాడు అగ్ని.

ఇక్కడి నుండి తప్పుకుంటే బంధువులు, స్నేహితులు, సుతులు, పుత్రికల రూపంలోనో, లేక దొంగ రూపంలోనో వచ్చి వాడిని సర్వం హరించేస్తారు.

ఇది కూడా కాకుంటే రోగాలు చుట్టుముట్టి చంపేస్తాయి. సంపాదించినదంతా రోగాలకో, రొష్టులకో తగల బెట్టేస్తారు. ఇలా ధర్మం తప్పి ప్రవర్తించిన వారిని పైన చెప్పిన నాలుగు కూడా ఒకేసారి పట్టేయవచ్చు.


కనుక నువ్వు నిర్భయంగా వెళ్లి ధర్మం ఎక్కడ ఉంటుందో అక్కడ క్షేమంగా ఉండు. ధర్మం తప్పిన నాడు నలుగురు నీకు తోడుగా ఉంటారు" అని వరమిచ్చి పంపించాడు.

# 'కులపతి' వశిష్ఠుడు

- శ్రీ డి.వి.ఆర్. భాస్కర్

బ్రహ్మ మానసపుత్రుడు, సప్తర్షులలో ఆరవవాడు, అత్యంత విశిష్టమైనవాడు వశిష్ఠమహర్షి. గొప్ప రాజగురువుగా అన్నింటికీ మించి ఇక్ష్వాకుల 'కులగురువు'గా రామచంద్రమూర్తిని న్యాయానికి, ధర్మానికి ప్రతిరూపంగా తీర్చిదిద్దిన 'రాజగురువు' వశిష్ఠుడు. బ్రహ్మజ్ఞానం తెలుసుకుని జీవితాన్ని యోగమయంగా, తపోమయంగా, జ్ఞానమయంగా ఆచరించి జీవించిన మహనీయుడాయన.

'మనిషిలోని వికారాలను సాధ్యమైనన్ని వదిలి వేసి, అసాధ్యమైతే అవసరాల మేరకు నియంత్రించి ఆదర్శప్రాయంగా జీవించే మనిషే గురువు' అనే వ్యాఖ్యానానికి నిలువెత్తు నిదర్శనం వశిష్ఠుడు.



వశిష్ఠుడు త్యాగి, నిష్కాముకుడు, స్వతంత్ర ప్రజ్ఞాశాలి. ఆధ్యాత్మిక, యోగజ్ఞానాలతో రాజనీతిని సమన్వయం చేసి ఇక్ష్వాకుల వంశాన్ని వశిష్ఠుడు ప్రభావితం చేశాడు. వశిష్ఠుని దగ్గరే రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు విద్య నేర్చుకొంటారు.

అయితే, శత్రువుల రాకపోకలు, వారి శక్తి సామర్థ్యాలను అంచనా వేయటం, అదుపు చేయటంలో రాజర్షి విశ్వామిత్రుడు తనకంటే ప్రావీణ్యం గలవాడని వశిష్ఠుడు గుర్తించాడు. ఎందుకంటే, విశ్వామిత్రుడు రాజర్షి కాబట్టి. అందుకే తాను చెప్పలేని కొన్ని విద్యలను రామలక్ష్మణులు విశ్వామిత్రుని వద్ద నేర్చుకునేందుకు పరోక్ష కారకుడవుతాడు. అది ఎలా గంటే...

నూనూగు మీసాల పసిపిల్లలైన రామలక్ష్మణులను తన యాగరక్షణ కోసం పంపాలని విశ్వామిత్రుడు దశరథుడిని కోరుతాడు. తనకు లేకలేక కలిగిన పిల్లలు, అత్యంత సుకుమారులు, అల్లారుముద్దుగా పెంచుకొనే తన పిల్లలను అరణ్యాలకు పంపడానికి దశరథుడు తటపటాయిస్తాడు. 'అవసరమైతే తాను, బలగాలు వస్తామని' బతిమాలుతాడు.

అప్పుడు వశిష్ఠమహర్షి 'మహారాజా! విశ్వామిత్రుడు శత్రువులను సంహరించగల సమర్థుడే, మీ పిల్లలకు అనుభవంతో ప్రావీణ్యం పెరిగి, భయం తొలగి హితం కలుగుతుంది. నిరభ్యంతరంగా పంపండి' అని ప్రోత్సహిస్తాడు. దీనివల్ల దశరథుని మాట దక్కుతుంది. విశ్వామిత్రుని లక్ష్యం నెరవేరుతుంది. రామలక్ష్మణులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇది రాజనీతి లక్షణం. కొన్ని గాథలను బట్టి వశిష్ఠ విశ్వామిత్రులు పరస్పర శత్రువులని మనం అపోహపడతాం.

నిజానికి వారిద్దరూ మిత్రులే. ఒకరి మనసును మరొకరు ఎరిగిన వారు. ఒకరి శక్తి సామర్థ్యాలను, విద్యలను మరొకరు బాగా తెలిసున్నవారు. అందుకే విశ్వామిత్రుని కోరిక మేరకు 'యోగవాశిష్ఠం' వేదాంత గ్రంథం రాసి వశిష్ఠుడు శ్రీరామునికి చెప్పాడు. వాస్తు గురించి వివరించాడు.

అదే విధంగా ఒక సందర్భంలో నిండు కొలువులో విశ్వామిత్రుడు 'రాముని సత్యధర్మ పరాక్రమాలు నాకంటే వశిష్ఠునికే ఎక్కువ తెలుసునని' నిజాయతీగా చెబుతాడు. వశిష్ఠుడు రచించిన వశిష్ఠ కల్పం, తంత్రం, పురాణం, శిక్ష, శ్రద్ధాకల్పం, వశిష్ఠ వ్రతం, వశిష్ఠ హోమం, లింగపురాణం వంటివి యోగవాశిష్ఠంతో ప్రభావితమయ్యాయి.

ఇంద్రుడు వశిష్ఠమహర్షి యజ్ఞాలకు మెచ్చి కామధేనువు పుత్రిక అయిన నందిని అనే గోవుని ఇస్తాడు. ఇది కామధేనువు లాగే తన యజమానికి ఏది కోరితే అది ఇవ్వగలదు. ఇంద్రుడు వశిష్ఠమహర్షి యజ్ఞాలకు మెచ్చి కామధేనువు పుత్రిక అయిన నందిని అనే గోవుని ఇస్తాడు. ఇది కామధేనువులాగే తన యజమానికి ఏది కోరితే అది ఇవ్వగలదు.

రాజనీతిజ్ఞుడు; అయోధ్యలో చిన్న రాజ్యాధిపతి సత్యవ్రతుడు భ్రష్టుడై దేవరాజనే రాజపురోహితుని సూచనతో వశిష్ఠుడు రాజ్యభారం మోయాల్సి వస్తుంది. ఎటువంటి శాసనాలు లేకుండా నోటిమాటతోనే రాజ్యమంతా ఒక కుటుంబం వలె కఠిన స్వీయ నియంత్రణతో మూడుపూవులు ఆరుకాయలుగా విరాజిల్లే విధంగా మారినప్పుడు పాలన చేస్తాడు. అప్పుడు పొరుగు రాజ్యాధికారి రాజర్షి విశ్వామిత్రునికి అసూయ కలిగి, అతనిపై దాడికి వస్తాడు, వశిష్ఠుడు సాదరంగా ఆహ్వానించి విశ్వామిత్రునికి అతిథ్యమిస్తాడు. ఆశ్రమంలో ఉండే నందినిని ఇవ్వమని విశ్వామిత్రుడు కోరతాడు. వశిష్ఠుడు నిరాకరిస్తాడు. బలవంతంగా తీసుకుపోతానంటాడు విశ్వామిత్రుడు. 'రాజబలం ముందు నేనెంత? తీసుకు వెళ్ళమంటాడు వశిష్ఠుడు, నందిని ఎదురు తిరుగుతుంది. దాంతో విశ్వామిత్రుడు, అతడి సైన్యం వెనుదిరగాల్సి వస్తుంది.



**రామనామం..**
**మనకు జపించదగ్గ మంత్రం.**

**రామరూపం..**
**ధ్యానించ దగ్గ దేవతాకృతి.**

**రామచరిత్ర..**
**అనుసరించాల్సిన ఆదర్శం.**

**ఈ మూడే..**
**మన మానవజాతికి..**
**ఇహపరసాధకాలు.**

కేవలం వశిష్ఠుని మీద పైచేయి సాధించేందుకే విశ్వామిత్రుడు తపస్సు చేసి, రాజర్షి అవుతాడు. అయినా సంతృప్తి చెందక, వశిష్ఠుడి చేతనే తనను బ్రహ్మర్షి అని పిలిపించుకోవాలని ఉబలాటపడతాడు. జన్మతః రాజైనందువల్ల అతడిలోని అహంకార మమకారాలు చావలేదని గ్రహించిన వశిష్ఠుడు, అతడికి అనేక పరీక్షలు పెట్టి ఆ లక్షణాలన్నీ తొలగినాయని తెలుసుకున్న తర్వాతనే విశ్వామిత్రుని బ్రహ్మర్షిగా సంబోధించి సంభావిస్తాడు. దాంతో విశ్వామిత్రుడు అమితానందపడిపోయి, వశిష్ఠునికి మిత్రుడవుతాడు.

'విశ్వామిత్రుని భుజబలం, వశిష్ఠుని బుద్ధిబలం' రాముని రాజ్యం కళకళలాడేందుకు కారణమవుతాయి. అందుకే, వశిష్ఠుడు సాధారణ గురువు, పురోహితుడు కాదు, రాజనీతిజ్ఞుడు. అన్నీ తానై రాజ్య క్షేమం కోసం మార్గదర్శనం చేసిన గురువు.

ఈయనకు పరమసాధ్వీమణియైన అరుంధతితో వివాహమైంది. అరుంధతి పరమపతివ్రత, పతి భక్తి పరాయణురాలుగా పేరుపొందింది. హిందూ వివాహాలలో సంప్రదాయం ప్రకారం వివాహానంతరం వధూవరులకు అరుంధతీ నక్షత్ర దర్శనం చేయిస్తారు.

అరుంధతీ వశిష్ఠులకు వంద మంది కుమారులున్నారు. వారిలో శక్తి మహర్షి జ్యేష్ఠుడు. ఈతని భార్య అదృశ్యంతి. శక్తి పుత్రుడే పరాశరుడు. అతడి కుమారుడే వేదవ్యాసుడు. ఒకానొక సందర్భంలో వశిష్ఠుడు తన వందమంది కుమారులను కోల్పోయి, తీవ్ర నైరాశ్యంలో కూరుకుపోతాడు. ఆత్మహత్యకు కూడా పాల్పడతాడు. అప్పుడు ఆయన భార్య అరుంధతి ఆయనకు అండగా నిలిచి ఆయనను ఆ ప్రయత్నం నుంచి మరలించి, తిరిగి తపస్సులో లీనమయ్యేందుకు ప్రోత్సహిస్తుంది.

వశిష్ఠుడు అరుంధతితోపాటు దక్షప్రజాపతి కూతురు ఊర్జ అనే ఆమెను కూడా వివాహం చేసుకుని ఆమెతో కొందరు పుత్రులను పొందాడు. సరస్వతీనదీ తీరాన వశిష్ఠమహర్షి ఆశ్రమం ఉండేది. ఇక్కడ దాదాపు పదివేలమంది శిష్యులకి విద్యాభ్యాసంతో పాటుగా భోజనం కూడా పెట్టేవాడు. అందువల్ల కులపతి అని పేరు వచ్చింది. వశిష్ఠమహర్షి పేరు మీదుగానే వశిష్ఠగోత్రం ఏర్పడింది.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-08

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య    నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | | | | |
|---|---|---|---|---|---|
| कश्चित् | = ఒకానొకడు | एकत्र | = ఒకచోట | स्यु: | = ఉందురు, వలెను, చాలుదురు |
| कतिचित् | = కొందరు | मा | = వద్దు | स्यात | = మీరుందురు, వలెను, చాలుదురు |
| किश्चित्, ईषत् | = కొంచెము | नो चेत् | = లేనియెడల చాలుదువు. | स्याम | = మేము ఉందుము వలెను, చాలుదుము |

అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) तत्र कश्चित् स्यात्।
02) नो चेत् यूयं तत्र स्यात।
03) कतिचित् तत्र सन्ति।
04) वयम् अत्र स्याम।
05) तत्र किश्चित् अपि नास्ति।
06) यूयं तत्र मा स्यात।
07) कतिचित् अत्र स्यु:।
08) अत्र किम् अपि नास्ति।
09) एते कतिचित् तत्र नासन्।
10) वयं कतिचित् अत्र स्म:।

అ) జవాబులు

01) అక్కడ ఒకానొకడు ఉండును.
02) లేనియెడల మీరు అక్కడనుందురు.
03) కొందరు అక్కడనున్నారు.
04) మేము ఇక్కడనుందుము.
05) అక్కడ కొంచెమును లేదు.
06) మీరు అక్కడ ఉండచాలరు
07) కొందరు ఇక్కడ ఉండచాలుదురు
08) ఇక్కడ ఏమియు లేదు.
09) వీరు కొందరు అక్కడ లేకుండిరి.
10) మేము కొందరు ఇక్కడ ఉన్నాము.


ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) మీరు కొందరు ఇక్కడనుందురు.
02) మేము కొందరము అక్కడనుందుము.
03) ఇక్కడ ఎవరునూ లేరు.
04) అక్కడ నిన్న ఎవడుండెనో ఇక్కడను వాడుండవలెను.
05) మేమెక్కడనుండవలెను?
06) ఏమో వారును ఇక్కడనుండవలెను.
07) మీరొకచోటనుండుడు.
08) ఇప్పుడక్కడ ఎవరూ లేరు.
09) మీరీవేళ రాత్రి అక్కడ నుండవలెనా?
10) లేనియెడల మేమక్కడ నుందుము.

ఆ) జవాబులు

01) यूयं कतिचित् अत्र स्यात।
02) वयं कतिचित् तत्र स्याम।
03) अत्र केऽपि न स्यु:।
04) तत्र ह्य: य: आसीत् स: अत्रापि स्यात्।
05) वयं कुत्र स्याम।
06) किं वा तेऽपि अत्र स्यु:।
07) यूयं एकत्र स्यात।
08) इदानीं तत्र केऽपि न सन्ति।
09) यूयम् अद्य नक्तं तत्र स्यात किम्?
10) नो चेत् वयं तत्र स्याम।

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



## కంచు - కనకం

అల్పు డెపుడు పలుకు నాడంబరముగాను;
సజ్జనుండు పలుకు చల్లగాను;
కంచు మోగినట్లు కనకంబు మోగునా?
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** అల్పుడు= నీచుడు, తక్కువవాడు; ఎపుడు= ఎల్లప్పుడు; ఆడంబరము= డాంబికము(స్థితికి మించిన మాటలు) తొందరపాటు; కంచు= రాగి, తగరముల మిశ్రమలోహం; కనకము= బంగారం.

**భావం:** నీచుడు డాంబికాలు (తనస్థితికి మించిన మాటలు) పలుకుతూ ఉంటాడు. సజ్జనుడు చల్లగా మాట్లాడుతూ ఉంటాడు. కంచు మోగినంత ధ్వనితో బంగారం మోగదు కదా?

**వివరణ:** మాట మేలు కలిగించేదిగా ఉండాలి. అవసరమైనంత మాత్రమే ఉండాలి. సత్యమైనదిగా ఉండాలి. అలాంటిమాటకి ఎల్లప్పటికీ విలువ ఉంటుంది. అలా మనసుకు ఆనందం కలిగే విధంగా మాట్లాడేవాడు సమాజంలో ఉత్తముడనిపించు కొంటాడు. హితమూ, మితమూ, సత్యమూ కాకుండా ఏవేవో చెవికింపుగా మాట్లాడేవాడు వాగుడుకాయగా డాంబికుడుగా మిగులుతాడు. వాడికి సమాజంలో విలువ ఉండదు. చెల్లని కాసుకు గీతలెక్కువ అని సామెత.

- కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## 65 వైకుంఠపాళి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ■ | 2 | | 3 | | 4 | ■ | ■ |
| | ■ | | ■ | | ■ | | ■ | 5 |
| 6 | | ■ | 7 | | | ■ | 8 | |
| | ■ | 9 | ■ | | ■ | 10 | ■ | |
| ■ | 11 | | | ■ | 12 | | | ■ |
| 13 | ■ | | ■ | 14 | ■ | | ■ | 15 |
| 16 | | ■ | 17 | | | ■ | 18 | |
| | ■ | 19 | ■ | | ■ | 20 | ■ | |
| ■ | ■ | 21 | | | ■ | 22 | | |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)భరద్వాజమహర్షి కొడుకు(5); 6)లక్ష్మి(2); 7)వైష్ణవాలయాల్లో స్వామికి పాశురాలు చదువుతూ దీనితో విసురుతుంటారు(3); 8)కీర్తన అనుపదాన్ని ఇలా అంటారు(2); 11)హిమాలయ, మైనాకపర్వతాలు కఠోరతపం చేయగా దాన్ని ఆపుటకు శివుడు ఈ రూపంలో వచ్చాడు(3); 12)ధృతరాష్ట్రుని కుమారుడు(3); 16)చిన్నపిల్లల్ని ముద్దుగా ఇలా కూడా పెద్దలు పిలుస్తారు(2); 17)పశ్చిమగోదావరి జిల్లాల్లో ఒక పట్టణం(3); 18)పువ్వు(2); 21)దేవకి పూర్వజన్మ(3); 22)శత్రుఘ్నుడు ఇతనిని చంపి మధురాపురి అనే రాజ్యాన్ని స్థాపించాడు(3)

### నిలువు

1)మేరువుకూతురు(4); 2)ఇపుడు దీని ద్వారా ఎత్తైన ప్రదేశాన్ని కూడా ఫోటోలు తీస్తున్నారు(2); 3)రుక్మిణి కూతురు(4); 4)తక్కువ అన్నపదాన్ని ఇలా కూడా అంటారు(2); 5)మారీచ సుబాహుల తల్లి(3); 9)సుగ్రీవుని ఉద్యానవనం(3); 10)యముని ఆయుధం(3); 13)రాహువు తండ్రి(3); 14)నకులుని భార్య(4); 15)జహ్ను మహర్షి కుమారుడు(4); 19)జనని తిరగబడింది(2); 20)ఓర్పుకు మరొక పదం(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు

**బాలనీతి**



# ప్రార్థనల విశిష్టత

– శ్రీ దీవి సుబ్బారావు

ఒకప్పుడు ఊరికి దూరంగా ఓ సాధువు చిన్న గుడిసె వేసుకొని అందులో ఉండేవాడు. అతను చాలా మంచి వాడు. రానురాను అతని మంచితనం చుట్టపక్కల గ్రామాల వారికి తెలిసి, ఏ అవసరం వచ్చినా అతని వద్దకు రావటం మొదలు పెట్టారు. తొందర్లోనే ఆ గుడిసె ఆశ్రమంగా పేరు మార్చుకొంది. రోజూ ప్రొద్దున్నే జనం బారులు తీరి అతని దర్శనం కోసం వచ్చేవారు. వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించి, వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకొని, చేతనైన సాయం చేస్తుండేవాడు.

ఒక రోజు ఆశ్రమానికి వచ్చిన వాళ్ళను యథావిధిగా పరామర్శించిన తరువాత, వాళ్ళతో ఇలా అన్నాడు, "చూడండి, ఈ ఏడు మన చుట్టు పక్కల గ్రామాల్లో ఎక్కడా వర్షం చుక్క పళ్ళేదు. నీటి కటకట ఎక్కువగా ఉంది. ఇవాళ మీరంతా కలిసి వర్షం కురిపించమని దేవుణ్ణి ప్రార్థించండి." సాధువు ఇలా అనే సరికి, వచ్చిన జనానికి చాలా ఆశ్చర్యం వేసింది. వాళ్ళు ఇలా అన్నారు, 'అయ్యా, మీరు సాధువులు, మహాత్ములు. భగవంతునికి మీ కంటే దగ్గర వాళ్ళు ఎవరున్నారు? మీ ప్రార్థనలే భగవంతుడు వినకపోతే ఇక మా ప్రార్థనలు ఏమి వింటాడు? కాబట్టి ఆ ప్రార్థనలు ఏవో మీరే చేయండి". వాళ్ళు ఆవిధంగా అనేసరికి సాధువు ఇలా సమాధానం చెప్పాడు. "ప్రార్థనల అసలు ప్రయోజనం, అంతరార్థం మీకు అవగాహన కాలేదు. ప్రార్థనల యొక్క విశిష్టత తెలియజేయటానికి ముందు, మీకో కథ చెబుతాను వినండి!" అంటూ ఇలా మొదలుపెట్టాడు.

ఒక పెద్ద హాల్లో గొప్ప విందు జరుగుతోంది. బల్ల మీద వివిధరకాలైన రుచికరమైన వేడివేడి తినుబండారాలు పళ్ళేల్లో అమర్చబడివున్నవి. అతిథులంతా చుట్టూ చేరి ఉన్నారు. అయితే, విందుకు వచ్చిన ప్రతి ఒక్కరి మీద ఒక షరతు విధించబడింది. ప్రతి ఒక్కరి చేయి వాళ్ళ వెనుక వీపుకు కట్టబడింది. రెండో చేతికి పొడుగాటి గరిటె ఒకటి కట్టబడింది. ప్రతి ఒక్కరు వారికి ఇష్టం వచ్చినంత తినవచ్చు. కాని, ఈ షరతును విధిగా పాటించాలి. ఆ అతిథులు చక్కటి విందు భోజనం ఆరగించారని ఎవరైనా అనుకోవచ్చు. కాని, అలా జరుగలేదు. అతిథులు చాలా అసంతృప్తికి లోనయ్యారు. గరిటె బాగా పొడుగ్గా ఉండ బట్టి అది వాళ్ళ నోటికి అందటం లేదు. ఆహారపదార్థలన్నీ నేల మీద చిందరవందరగా పడుతున్నవి. తిందామని ఎంత ప్రయత్నించినా, ఒక్క మెతుకు కూడా వాళ్ళ నోటికి అందటంలేదు.

అదే సమయంలో పక్కనే ఉన్న ఇంకో గదిలో అలాంటి విందు భోజనమే ఏర్పాటు చేయబడి ఉంది. అక్కడ కూడా రక రకాల రుచికరమైన ఆహారపదార్థాలు బల్ల మీద పేర్చబడి ఉన్నవి. విందుకు వచ్చిన అతిథులకు కూడా అదే షరతు విధించబడింది. ఒక చెయ్యి వెనక్కి కట్టబడింది. రెండో చేతికి పొడవాటి గరిటె కట్టబడింది. కాని ఈ విందు చాలా భిన్నంగా సాగుతోంది. ప్రతి ఒక్కరూ విందును ఆస్వాదిస్తున్నారు. ఇది ఎట్లా సాధ్యమయింది? ప్రతి ఒక్కడూ గరిటెతో ఆహారపదార్థాన్ని తీసుకొని, తనకు ఎదురుగా కూర్చొని ఉన్నవాని నోటికి అందిస్తున్నాడు. ఈ విధంగా విందులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆనందంగా భుజిస్తున్నారు." కథ చెప్పి సాధువు ఈ విధంగా ముగించాడు. "ఇతరుల కొరకు నీవు ప్రార్థిస్తే అవి తప్పక ఫలిస్తాయి".

**శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేయు భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం వారు టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేయడం జరిగింది.**

**యాత్రికులు, భక్తులు దేవస్థానానికి సంబంధించిన సూచనలు / ఫిర్యాదులకు మరి ఏ ఇతర సమాచారం కోసమైనా ఈ నంబరును సంప్రదించండి.**

తిరుమల తిరుపతి దేవస్థానం
టోల్ ఫ్రీ నెంబరు
18004254141

ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోండి! తిరుమల తిరుపతి దేవస్థానం యాత్రికులకు మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు మీ సూచనలివ్వండి.

చిత్ర కథ

# బాలహనుమంతుడు

కథ- డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- కె.తులసీప్రసాద్





లోకాలన్నీ తల్లడిల్లిపోతున్నాయి.
దేవతలు వెళ్ళి బ్రహ్మని ప్రార్థించారు.
విధాతా! మీరే కాపాడాలి
అందరూ వాయువు గుహకి వెళ్ళారు. వాయువుతో బ్రహ్మ...
నాయనా! నీ సంచారాన్ని ఆపితే సృష్టికే ప్రమాదం
మరి మా ఆంజనేయుడి సంగతి?
తన అమృతస్పర్శతో ఆంజనేయునికి తెలివి తెప్పించాడు బ్రహ్మ
నా పందేది?
నా బ్రహ్మాస్త్రం నీ మీద పని చేయదు. ఇది నా వరం
దవడ మీద వజ్రాయుధం దెబ్బతిన్న ఈ బాలుడు హనుమంతుడుగా కీర్తి పొందుతాడు- అన్నాడు బ్రహ్మ
దేవతల అస్త్రాలు శస్త్రాలు ఇతని మీద పనిచెయ్యవు.
తథాస్తు
వాయువు శాంతించాడు. లోకాలన్నీ గాలి పీల్చుకున్నాయి.
హమ్మయ్య బతికాం!
అంజన తన కొడుకుని ఎత్తుకుని ముద్దాడి...
నాయనా! హనుమంతా! చిరకాలం వర్ధిల్లు!
సర్వే జనాః సుఖినో భవన్తు!

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధస్సుకు పదును పెట్టండి

## కదంబం

### అష్టసిద్ధులు

1) అణిమ
2) మహిమ
3) గరిమ
4) లఘిమ
5) ప్రాప్తి
6) ప్రాకామ్యము
7) ఈశత్వము
8) వశిత్వము

## పిల్లలూ..జతచేయండి!!

| | |
|---|---|
| 1) బిందుసరోవరం | అ) టిబెట్ |
| 2) నారాయణసరోవరం | ఆ) రాజస్థాన్ |
| 3) మానస సరోవరం | ఇ) కర్ణాటక |
| 4) పుష్కరసరోవరం | ఈ) ఒడిషా |
| 5) పంపాసరోవరం | ఉ) గుజరాత్ |

జవాబులు: 1-(ఈ); 2-(ఉ); 3-(అ); 4-(ఆ); 5-(ఇ)

## మీకు తెలుసా?

1) రామాయణాన్ని వాల్మీకికి ఉపదేశించిన ముని ఎవరు?
2) రామకథను విన్న వాల్మీకి మధ్యాహ్నస్నానానికి వెళ్ళిన నది పేరు?
3) శివధనుస్సును తయారు చేసింది ఎవరు?
4) భరతుడు రాముని పాదుకలు ఉంచిన గ్రామం పేరు?
5) సీతరాముని కోరిన మాయామృగం ఏది?
6) సముద్రలంఘనంలో హనుమంతుడు ఎక్కిన పర్వతం పేరు?
7) హనుమలంఘించిన సముద్రం పొడవు?

జవాబులు:
1) నారదుడు
2) తమస
3) విశ్వకర్మ
4) నందిగ్రామం
5) బంగారులేడి
6) మహేంద్రగిరి
7) నూరుయోజనాలు

## కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

క ఉం ల సు ల టే సి దు క ఖం

జవాబు:
కలసి ఉంటే
కలదు సుఖం

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...




Edited and published on behalf of T.T.Devasthanams by Prof. K.Rajagopalan, Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri P.Ramaraju, M.A., Special Officer (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.

తిరుమల తిరుపతి దేవస్థానములు

# అప్పలాయిగుంట
# శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి
# బ్రహ్మోత్సవములు

2021 జూన్ 19 నుండి 27 వరకు



**19-06-2021 శనివారం**

పగలు: ధ్వజారోహణం - రాత్రి: పెద్దశేషవాహనం.

**20-06-2021 ఆదివారం**

పగలు: చిన్నశేషవాహనం - రాత్రి: హంసవాహనం.

**21-06-2021 సోమవారం**

పగలు: సింహవాహనం - రాత్రి: ముత్యపుపందిరివాహనం.

**22-06-2021 మంగళవారం**

పగలు: కల్పవృక్షవాహనం - రాత్రి: సర్వభూపాలవాహనం.

**23-06-2021 బుధవారం**

పగలు: పల్లకీలో మోహినీఅవతారోత్సవం - రాత్రి: గరుడవాహనం.

**24-06-2021 గురువారం**

పగలు: హనుమద్వాహనం - రాత్రి: గజవాహనం.

**25-06-2021 శుక్రవారం**

పగలు: సూర్యప్రభవాహనం - రాత్రి: చంద్రప్రభవాహనం.

**26-06-2021 శనివారం**

పగలు: రథోత్సవం - రాత్రి: అశ్వవాహనం.

**27-06-2021 ఆదివారం**

పగలు: చక్రస్నానం - రాత్రి: ధ్వజావరోహణం.



జాపాలి ఆంజనేయస్వామి (తిరుమల)